

# సహచరుని పిలుపు

గ్రంథకర్త: **రాఘవేంద్ర రావు, బి.ఇ.**

ప్రిసెప్టరు, జాయింట్ డైరక్టరు,

టెక్నికల్ ఎడ్యుకేషన్, కర్నాటక, రాయచూరు

తెలుగు అనువాదం: **టి.వి. శ్రీనివాస రావు**

అడ్వొకేటు, ప్రిసెప్టరు, కడప.

# సహచరుని పిలుపు

( ఆంగ్ల మూలము Call of the fellow Traveller)

రచయిత

## రాఘవేంద్ర రావు

B.Sc. BE,MISE

జాయింట్ డైరక్టర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ (రి)

కర్నాటక, రాయచూరు., కర్నాటక

తెలుగు అనువాదము

## టి.వి. శ్రీనివాస రావు

బి.కాం, బియల్


అడ్వకేటు, ప్రిసెప్టరు, కడప

శ్రీ రాంచంద్రజీ మహాదాజ్ సేవా ట్రస్టు


కో ఆపరేటివ్ కాలనీ, రాధాకృష్ణ నగర్

కడప.వా


రిచే ప్రచురితము.



పరమపూజ్య పద్గురు శ్రీ రాంచంద్రజీ మహరాజ్ (లాలాజీ)
ఫతేఘర్ (యు.పి)



పరమ పూజ్య సద్గురు శ్రీ రాంచంద్రజీ మహరాజ్
షాజహాన్‌పూర్ (బాబూజీ)



Author
Pujya Sri Raghavendra Rao, Raichur
Photo by T.V.Srinivasa Rao  Preceptor
Advocate, , Kadapa




గ్రంథకర్త : శ్రీ రాఘవేంద్ర రావు, బి.ఇ. (రిటైర్డు)
జాయింటు డైరక్టరు, టెక్నికల్ ఎడ్యుకేషన్, కర్నాటక,
రాయచూరు,
అనువాదకులు: శ్రీ టి.వి..శ్రీనివాసరావు, లడ్వొకేటు, ప్రొఫెసరు, కడప

# విషయము


| విషయము | పేజి నెం. |
|---|---|
| అవతారిక | i |
| ముందుమాట | ii |
| అనువాదకుని వినతి | iv |
| సహజమార్గ దశాదేశ నియమాలు | vi |
| 1. బాబూజీ మహరాజ్ గారికి వందన సమర్పణ. | 1 |
| 2. సమర్థవంతమైన ధ్యానము | 7 |
| 3. జ్ఞాన వాంఛ | 11 |
| 4 నాడు, నేడు | 14 |
| 5 అమరత్వానికి మార్గము | 18 |
| 6. భారతావనిలో వెలుగుతున్న జ్యోతి | 20 |
| 7. సారాంశాన్ని గ్రహించండి | 30 |
| 8. గురువు- రహస్యము | 39 |
| 9. ప్రార్థన మరియు ధ్యానము | 48 |
| 10 అభ్యాసి,ప్రశిక్షకుడు, (ప్రాణాహుతి) | 54 |
| 11 ఆధ్యాత్మిక శిక్షణ | 57 |
| 12 అభిన్నత్వ భావనలు | 61 |
| 13 సద్గురువు, సాధన, సంస్థ | 69 |
| 14 హృదయ గ్రంధి | 73 |
| 15 నా గురుదేవులు | 80 |
| 16 చిత్శక్తి | 85 |
| 17 ప్రాణాహుతి లేక యోగశక్తి ప్రసారితము | 93 |
| 18 గురువుగారి జన్మదిన కానుక | 97 |
| 19 దైవముతో మానవుని అనుసంధానము | 100 |
| 20 అజ్ఞాన (అవిద్య) తెర | 106 |
| 21 అపారము,అనంతము | 113 |
| 22 నా పద్ధతి, నా కర్తవ్యం | 116 |
| 23 గురువును చేరుటకు | 124 |
| 24 గురువుగారి యోగ పరిశోధనలు | 130 |
| 25 కర్మకాండ - దాని పరిధులు | 134 |
| 26 ధ్యానమనగా ఏమి | 139 |

# అవతారిక

గౌరవనీయులు, సోదరుడు శ్రీ రాఘవేంద్రరావుగారికి, షాజహాన్ పూర్ లోని మన పూజ్యగురువుగారి దర్శనము వారి స్వగృహంలో మొట్టమొదటిసారిగ 22,అక్టోబరు1955 తేదీన అయింది. గురువుగారిని, అయన లక్ష్యాన్ని తొలిచూపులోనే సంపూర్ణంగా ఆకళింపు చేసుకొన్న అభ్యాసీలలో ఆయన ఒక్కరు. ఇంకొక విధంగా చెప్పాలంటే, పూజ్యగురువుగారు తొలిచూపులోనే అయన్ను అనుగ్రహించారు. గురువుగారి అనుగ్రహామువల్ల సోదరుడు రాఘవేంద్రరావుగారు నిరంతర గురుస్మరణవల్ల ఉన్నతంగా పరిపక్వము చెంది గురువుగారి సన్నిధానం పొందారు.

ఇందులోని రచనలన్ని అట్టి పరిణతి చెందిన అభ్యాసిచే పైనచెప్పబడిన స్థితిలో వ్రాసినట్టివే. కొన్ని శుభ సమయాలలో ఆయన చేసిన ఉపన్యాసాలు, ఈపుస్తకములో చేర్చబడ్డాయి. ఈ రచనలలో సహజ మార్గ సిద్ధాంతాలు చాలా విపులంగా తెలియ జేయబడ్డాయి. ఇట్టి అమూల్యమైన రచనా సాహిత్యము సత్యాన్వేషకులందరికి కొన్ని తరాలపాటు మార్గదర్శకంగా ఉండగలదు.

కేవలము వీటిని చదివినంతమాత్రాన దైవీక స్పంధనలు గోచరమవుతూ, సహజమార్గ పద్ధతిన సాధన చేబడుదామనే కాంక్ష ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక రంగము లోకి అడుగు పెట్టాలనే ఇచ్ఛ వుండే ప్రతివానికి సోదరుడు రాఘవేంద్రరావుగారిచే వ్రాయబడిన ఈ రచనా సంపుటి గురువుగారి సందేశాన్ని అందజేయడములో, ఎంతో
మార్గదరశకంగా ఉంటుంది.

డి.ఆర్. విఠల్ రావు
హైకోర్టు జడ్జి, (రి), కర్నాటక హైకోర్టు
బెంగళూరు.

ఏప్రిలు 30, 1999
బుద్ధ పూర్ణిమ.

# ముందు మాట

యుగ యుగాలనుండి మానవుడు ఆనందంకొరకు అనేక విధాలుగా ఎల్లప్పుడూ అన్వేషిస్తూనే ఉన్నాడు. అవిరామంగా చేసే ఇట్టి అన్వేషణలు, ఏ ప్రాపంచిక విషయాలవల్ల లభ్యమవుతాయని ఆశించి వాటినే ఆధారంచేసుకొని అన్వేషిస్తున్నాడో, అట్టి విషయాదులే ఎక్కువ భాగం భయంకర పీడకలలుగా తయారయి, చివరకు నిరాశ, వైఫల్యాలే చవిచూడడం జరుగుతూవుంది.

మార్గ అన్వేషణలో అప్పుడప్పుడు అతను మామూలుగా గృహస్థ జీవనం గడుపుతూకూడా గురువు రూపంలో ఉండే భగవంతుని పాద సన్నిధికి చేరుకొంటాడు. అప్పుడు, ఆనంద మనేదానికి ఉండే పరిమితులేమిటో, గురువుగారు తెలియ జేయడమే గాక, అంతకంటే ఉన్నతమైన స్థితికి తీసుకొనిపోతాడు.

దివ్యపురుషులు నిరాడంబర జీవితం గడుపుతూ, మానవ జీవిత లక్ష్యాన్ని చేరుకో గలందులకు సత్యాన్వేషకులకు అనుభవపూర్వకమైన సాధనా పద్ధతుల ద్వారా సహాయం చేయడానికి అవతరించి ఉంటారు.

అట్టి ఉదాహరణ ఒకటి "సహచరుని పిలుపు" (Call of the Fellow Traveller) అనే ఈ పుస్తకములోని కొన్ని పుటలలో స్పష్టంగా తెలియజేయబడింది. ఉత్తరప్రదేష్ లోని షాజహాన్‌పూర్ వాస్తవ్యులు, సమర్థ సద్గురు శ్రీ రాంచంద్రజీ మహరాజ్‌గారి మార్గదర్శకత్వంలో సహజమార్గమను ధ్యానసాధన వల్ల మానవునిలో సంపూర్ణంగా మార్పుతెచ్చునట్టి విషయాలను గురించి, ఆధ్యాత్మిక, వేదాంత, శాస్త్ర విషయాలను గురించి సోదరులు శ్రీ రాఘవేంద్రరావుగారు, అన్వేషకులు నేరుగా ముఖాముఖిన, గ్రహించ గలందులకు వ్రాసిన రచనలు, చేసిన అనుగ్రహ భాషణలు, ఇందులో పొందుపరచ బడినందున ఈ పుస్తకము చాలా విశిష్టమైనది.

ఈ గ్రంధకర్త, పూజ్య గురువుగారి ఆధ్యాత్మిక శిక్షణ క్రింద సహజ మార్గ పద్ధతిన పొందిన ఉపదేశాలు, అనుభూతులు గురువుగారి శిక్షణా

సామర్థ్యాన్ని ఒక ఉదాహరణగా గమనించవచ్చు. జిజ్ఞాసియైనవాడు సహజ మార్గపద్ధతిన గురువుగారి ప్రేమాభి మానాలను చవిచూడవచ్చు.

సహజమార్గ అనుచరులుగా మనమందరము అభ్యాసానికి సంబంధించిన అంశములను, గురువుగారి రచనలను గురించిన వివరణలను కోరుతూ ఉంటాము. మన జీవిత లక్ష్యసాధనకు ఈ పుస్తకములోని అంశములు ఎంతో మేలు చేకూరుస్తుందని అనడములో సందేహము లేదు.

30-4-1999 తేదీన, ధార్వాడ్‌లో, బాబూజీగారి శతజయంతి జరుపుకొంటున్న శుభసందర్భంగా ఈ పుస్తకము ప్రచురించడము ఎంతో ఆనంద దాయకంగా ఉంది. దీనిలోని అత్యంత విలువైన విషయాలవల్ల మనమందరము, ఈ పద్ధతికి, దీని వ్యవస్థాపకుని వద్దకు ఇంకా దగ్గరకు చేరుకోవడానికి దోహదంచేసినాయి.

ఈ శుభ సందర్భమున సోదరులు శ్రీ రాఘవేంద్రరావు గారు ఈ పుస్తకమున ప్రచురించుటకు అనుమతించినందువలన, వారికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాము.

సహజ మార్గ పత్రికలో ప్రచురితమైన, సోదరులు శ్రీ రాఘవేంద్రరావు గారి ఈ రచనలన్నింటిని సేకరించి అందజేసి నందులకు, గుల్‌బర్గా వాస్తవ్యులు శ్రీమతి నళిని శ్యామరావు గారికి మేమెంతో ఋణపడి ఉన్నాము. ఈసంపుటములో తప్పులు లేకుండా సరిదిద్దినటువంటి సోదరుడు డి.బాలాజీగారికికూడా ఉత్సవ కమిటీవారు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నారు.

ఏప్రిలు, 30, 1999
శుక్రవారం.

బి. యస్. కె. ఘంటి
కార్యదర్శి.
పూజ్యశ్రీ బాబూజీ జన్మదిన శతజయంతి ఉత్సవ కమిటి

# అనువాదకుని వినతి

పూజ్యశ్రీ రాఘవేంద్ర రావుగారిచే ఆంగ్ల భాషలో వ్రాయబడిన "కాల్ ఆఫ్ ది ఫెలో ట్రావెలర్" అనే పుస్తకంలో మొత్తం 68 వ్యాసాలున్నాయి. వాటిలో కొన్ని వ్యాసములు తెలుగులోకి అనువదించి, వాటిని 29-12-2004 న విశాఖపట్నంలో శ్రీ రాంచంద్ర మిషన్ వ్యవస్థాపకుల దినోత్సవాల సందర్భంగా పూజ్యశ్రీ రాఘవేంద్ర రావుగారికి వారి పరిశీలనకు ఇచ్చాను. వారు నాయందు దయతో వాటిని రాయచూరుకు తీసుకొనిపోయి పరిశీలించి, ఆంగ్లభాషలో వ్రాసిన వారి భావాలకు అనుగుణంగా అనువాదం చాలావరకు సవ్యంగా జరిగిందని మిగిలిన వ్యాసములు కూడా అనువదించమని ఒకటి రెండు సూచనలతో ఈ క్రింది జాబు వ్రాసినారు.

Om Raichur
01-Jan 2005

Dear brother,

"Namaste". Sorry for the delay caused due to my failing eyesight and weakness.

I found some difficulty in understanding some words. I have put (?) question marks. Please use simpler words if possible.

The text represents my thoughts in fairly good manner in Telugu. Please go ahead with the translation. I cannot verify the translation with the original English text because of my physical difficulties. →

With love and best wishes to all of you.

Yours affectionately
Raghavendra

To
Shri T. V. Srinivasa Rao
Advocate
Cuddapah.

వారి ప్రోత్సాహమువల్ల నేను ఇప్పటివరకు 19 వ్యాసములు మాత్రము అనువదించడము జరిగింది. ఇంకా మిగిలినవి చేయవలసియున్నది.. అనువదించిన మటుకు పుస్తక ముగా తయారు చేయమని సోదర అభ్యాసులు సలహా యిచ్చినందు వలన ప్రస్తుతానికి పుస్తక రూపంలో కొన్ని ప్రతులు జెరాక్స్ చేయించడ మయింది.

ఈ రచనల విశిష్టతను గురించి సోదరులు డి. ఆర్. విఠల్ రావు కర్ణాటక హైకోర్టు జడ్జి గారు 'అవతారిక' లోనూ, వి. యస్. కె. ఘంటి గారు 'ముందు మాట' లోనూ విపులంగా తెలియజేసారు. గనుక వాటిని గమనించమని నా మనవి.

# బాబూజీ మహారాజ్ గారికి వందన సమర్పణ.

## (1) Salutations to Babuji Maharaj

మహాత్ములు అకస్మాత్తుగా జన్మించరు. వారి ఆశయము కూడా అంత సులభంగా పూర్తికాదు. మహాత్ములైన మన గురువుగారు ఈ కాలానికి అవసరమైనట్లుగా ఈ సంస్థను మనకు ఇచ్చారు. ఆయన ఆశయాన్ని నెరవేర్చే కార్యము మనది. ఆయన కార్యమును మనం చేపట్టినందుకు మనం చాలా అదృష్టవంతులము. అయితే, దానితోపాటు గొప్ప బాధ్యతకూడా మన పైన ఉంది. అంతేగాక, ఆలోచించి కార్యము చేయడానికి గురువుగారు మనకు ఎంతో స్వేచ్ఛను కూడా ఇచ్చినందువల్ల ఈ బాధ్యత ఎక్కువగా ఉంటుంది. మన నిజ స్థితితో చిక్కులు, జడత్వము, వికారములు, మూర్ఖత్వములను వాటిని కలిపి ఒక కలగూరగంపగా మనం తయారు చేసినందున ఇప్పుడు మన స్వరూపము ఈవిధంగా తయారయింది. ఎప్పుడైతే మూలసారము అంతర్థానమయిందో, అల్పమైన విషయాలుకూడా బ్రహ్మాండమైన వికృతరూపం దాలుస్తాయి. గనుక మనం వేసే ప్రతి అడుగు మూలసారమును అపవిత్రం చేయకుండా జాగ్రత్తగా వేయాలి. అంతేగాక,మన పురోగతి కొరకు మార్గమందు అవరోధాలు, ఇబ్బందులే మూలసారముయొక్క ప్రకాశమువల్ల దారి చూపే కాంతి నక్షత్రాలవలె మార్పు చెందేట్లు చూడాలి.

ప్రియమైన సోదరా, మన సంస్థ అసమానమైనది. ప్రతియొక్కరు ఇందులోకి ఆహ్వానితులే. అయితే, దీనిని నీదిగా స్వీకరించినప్పుడు, మిగిలినవాటినన్నింటిని విస్మరించాలనిపిస్తుంది. ఇది ఒక పెద్ద సందిగ్ధావస్థ. క్లిష్ట పరిస్థితిగా ఉంటుంది. ఏది ఉత్తమమో, అట్టి నిర్ణయాన్ని శాశ్వతంగా నీవు తీసుకోవాలి. అసంఖ్యాకములుగా వుండే బలవత్తరమైన ఆకర్షణలపట్ల రాజీ పడవలసినవి చాలా వున్నాయి. అయితే అదే కోవలో పనికిమాలినవి, లేదా అసత్య విషయాలపట్ల రాజీ పడడమనేది ఆధ్యాత్మికతకు, సత్యాన్వేషణకు హానికరమవుతుంది. ఏవిధంగానయితే కపట వినయము హానికరమో, మూఢత్వము, దురభిమానములనేవికూడా అంత హానికరములైనట్టివే.

మన మధ్యనే గురువుగారు ఉండడమువల్లనూ, దారి చూపడమువల్లనూ, రెండువిధాల మనం అదృష్టవంతులము. పటిష్టమైన బునాది మనకొరకు వేశారు. దాని నిర్మాణం పూర్తి చేసే కార్యభారాన్ని మనకు వదలి పెట్టారు. ఇది చాలా విలువైనది, ప్రశస్తమైనది, శాశ్వతమైనది. గనుక, సరియైన పద్ధతిలో, సరియైన చోట్ల సరియైన విషయాలతో కార్యనిర్వహణ చేయవలసిన బాధ్యత మనమీద ఉంది. అనుచితమైన, అయోగ్యమైన వాటివల్ల మన పనికి భంగం కలుగుతుంది. అందువల్ల, మన మూట,ముల్లె యావత్తు క్షుణ్ణంగా గురువుగారి పరిశీలన నిమిత్తం ఆయన ముందు తెరవండి. అంధకారంవల్ల ఎంతటి కాంతివంతమైనదని నీకు అనిపించినా,

ఆయన సమక్షంలో ప్రకాశించలేనివాటిని విసిరి పారేయడానికి వెనుకాడకండి. ఆవిధంగా విసర్జించినందువల్ల, భారంతగ్గి నీవు తేలికదనం పొందుతావు.

మన మార్గపద్ధతి, పారమార్థికం కొరకు ఇహలోకాన్ని త్యజించాలనే సన్యాసివలెగాని, లేదా, ఉండేది ఇహలోకమే గాని పరలోకమనేది లేదనే ప్రాపంచిక దృష్టికలవారి వలెగాని కాదు. రెండు లోకాలు - వాస్తవంలో అన్నిలోకాలు - మన దృష్టిలో ఉంటాయి. అయినప్పటికి, మనకుమాత్రం, అన్ని లోకాలకు అధిపతియైన మన గురువును పొందాలనేదే మన లక్ష్యము. మనం పొందివున్న అన్ని వస్తు విషయాదులు, అవి ఏలోకానికి సంబంధించినవైననూ, అవన్ని ఆయన కొరకు మాత్రమే. గనుక ప్రియమైన సోదరులారా, మీకు ఒక గురువు ఉన్నాడని, ఆయన సర్వలోకాలకు అధిపతియని, ఆయన మీతో ఉన్నాడని, మీలో ఉన్నాడని ప్రపంచానికి చూపండి. ఇతరులు చెప్పారని, చిల్లర విషయాలు, అల్పమైన వస్తువిషయాదులు కావాలనో లేదా అక్కరలేదనో దుఃఖపడకండి. ఇట్టి ప్రాపంచికమైన చిల్లర విషయాల కంటే ఉన్నత శ్రేణికి ఎదగండి. గురువుగారిని మాత్రమే మీ దృష్టియందు ఉండనివ్వండి. సంపూర్ణంగా ఆయనలో లయమవ్వండి, లేదా, ఆయనే మిమ్మల్ని ప్రేమించేటంతగా మారండి. అప్పుడు ఆయన్ను సంపూర్ణంగా పొందగలరు.

క్రమ క్రమంగా ప్రజలు మన సంస్థవైపు ఆకర్షితులవుతున్నారు. ప్రపంచమంతా సహజ మార్గము యొక్క మార్గ

దర్శకత్వానికి, దాని వెలుగు కోసం ఎదురు చూసే సమయం వస్తుంది. అట్టి పరిస్థితులలో మీరందరూ ఈ మహోన్నత కార్యమును నెరవేర్చడానికి సిద్ధంకావాలి. ఈ మధ్య, మన సంస్థ అభ్యాసిని సహజ మార్గము యొక్క దశాదేశములంటే ఏమి? అని అడిగారు. అతను, దశాదేశములు ముద్రించియున్న కరపత్రం కోసం వెతకడం ప్రారంభించాడు. "నన్ను చూసి వాటిని కనుక్కోండి" అని అతను సమాధానం చెప్పి వుంటే ఎంత బాగుండేదని నాకు అనిపించింది. మన సంస్థలోని ప్రతి సభ్యుడు సహజ మార్గముయొక్క స్వరూపంగా మారి, సమర్థవంతుడైన మన గురువుగారికి, ఆయన సంస్థకు ప్రతినిధిగా కావాలని నేను కోరుకొంటున్నాను.

ఇందువిషయంగా ఇప్పుడు కొన్ని హెచ్చరికలుకూడా ఇవ్వాలని అనుకొంటున్నాను. ప్రశిద్ధమైన సంస్థలుకూడా నీచ స్థితికి దిగజారడానికి, భ్రష్టుపట్టడానికి యోగ్యాయోగ్యతలపట్ల మూర్ఖమైన అలోచనలే కారణము. సభ్యుల సంఖ్య గణనీయంగా పెంపు చేయాలనే ఉత్సాహము, చందాలు, నిధులకొరకు ఆరాటము, లేదా, అహ్లాదం కోసం ఆకర్షణలకోసం బూటకపు చేష్టలవల్ల మూల సారముయొక్క దివ్యస్థితిని మరుగు పరచ కూడదు. మనకు కూడా ఎక్కువమంది సభ్యులు, డబ్బు, అహ్లాదాలు కావలసిందే కాని, యివన్ని ఆయన్ను పొందడానికి మాత్రమే దోహదంచేయాలి. ఏకోశానా, స్వార్థముగాని, తన గొప్పను చాటుకోవడంగాని, లేదా ఇంద్రియ వాంఛలు తీర్చుకోడమనేదిగాని పొడసూపకూడదు. అప్పుడే మన

సంస్థయొక్క పవిత్రతను సమర్థవంతంగా కాపాడగలము. అందువలన దిగజారడము, భ్రష్టుపట్టడములను వాటినిగురించిన భయము ఉండదు.

ప్రతి సభ్యుడు ఎప్పుడు పరిపూర్ణత చెందుతాడో, అప్పుడు మన సంస్థకూడా పరిపూర్ణతచెందుతుంది. ఎప్పుడయితే, ప్రతి సభ్యుడు నిరంతరము పరిపూర్ణత చెందిన మహావ్యక్తిని దృష్టియందు ఉంచుకొని అదే లక్ష్యముగా హృదయంలో కలిగి ఉన్నప్పుడు అట్టి పరిపూర్ణతను పొందగలడు. గురువుగారికి సంపూర్ణంగా అర్పణ చేసుకొన్నప్పుడు, గురువుగారినుండి వచ్చు ప్రాణాహుతి శక్తిని స్వీకరించ గలుగుతాడు. సద్గురువును ఒక్కడినే ఆరాధించినందువల్ల ఇతరములైన వాసనా ముద్రలను హృదయమునుండి తీసివేయుటకు సహాయ పడుతుంది. ఈ ప్రపంచంలోనివారందరూ తనవారేనను భావన ఏర్పడినప్పుడు, అందరికి మూలము ఒక్కటేనని, లేదా, అందరికి మూల కారణం ఒక్కటే ననే సత్యాన్ని పొందుతాడు. ఎవరెవరికి ఏమి చెందవలసియున్నదో, వాటినన్నింటిని ఇచ్చినందున తన బరువు బాధ్యతలనుండి విముక్తుడవుతాడు. నిరంతరము, నీ సంస్థయొక్క యోగక్షేమాలను గురించి చింతన చేయడమువల్ల, సంస్థను స్థాపించిన వ్యక్తితో నిరంతర సంబంధము కలిగి ఉంటావు. ఆవిధంగా మనకు సంపూర్ణత్వమనేది వ్యక్తిగతంగానూ, సాంఘికంగానూ పొందడానికి వీలవుతుంది. అసాంఘికమైన భావనలన్నింటిని మననుండి పూర్తిగా తుడిచివేయాలి.

గురువుగారి ఆశయానికి తగినట్లుగా మనం జీవించ గలందులకునూ, ఆయన తలపెట్టిన కార్యక్రమాన్ని సంపూర్ణంగానూ, ప్రతిభా వంతముగనూ, చేయగలందులకు మనందరియందు ఆయనే ఉండి, అందుకు తగిన శక్తి, ధైర్యసాహసాలను ప్రసాదించమని గురువుగారిని నేను ప్రా ర్థిస్తున్నాను.

గురువుగారు మనలో చిరకాలము జీవించియుండు గాక.

ఓం శాంతిః

## "SALUTATIONS TO BABUJI MAHARAJ"

From the Book 'Call of the fellow traveler,' (page 1)

# సమర్థవంతమైన ధ్యానము

## (2) Efficacious Meditation

అనేక మంది బోధకులు అనేక ధ్యానపద్ధతులు చెపుతూ ఉంటారు. వీరు చెప్పేవాటిల్లో, ఐదునిముషాల భావాతీత ధ్యానం మొదలుకొని, నాలుగు లేక ఐదు గంటలపాటు, నిర్ణీతమైన కొన్ని పదాలను ఉచ్చారణ చేసేవరకు ధ్యాన పద్ధతులు ఉంటాయి. అమాయకులు, గుడ్డిగా వీటిని అనుసరిస్తే, తెలివిగల బోధకుడు అట్టి అమాయకులను తన అధీనంలో ఉంచుకోడానికి ఏవేవో సలహాలు ఇస్తూ ఉంటారు. వీటిలో, కొన్ని ముఖస్తుతి చేసేవి, మరికొన్ని భయపెట్టేవిగాను ఉండవచ్చు. దాని ఫలితమేమంటే, అన్వేషకుడు అపేక్షించే బంధవిముక్తికి బదులు, అందుకు విరుద్ధంగా ఉండే బానిసత్వమే సిద్ధిస్తుంది.

సంపూర్ణ స్వేచ్ఛను గురించిన అలోచనలన్ని బాధలు, కష్టాలతో ఉండే మానవునియొక్క వింతైన, చోద్యమైన ఊహా మాత్రమేనని కొందరు వేదాంతులు చెప్పడములో కొంత వాస్తవముంది. అయినా, మానవుడు ఎప్పుడూ ఏదోవిధంగా బానిసగానే ఉన్నాడు. అతను ఇతరులకు బానిసగానో, లేదా తన ఆలోచనలకు, భావాలకు బానిసగానో ఉంటూనే ఉన్నాడు. అయినప్పటికి, సంపూర్ణ స్వేచ్ఛను పొందిన గురువు తటస్థపడినప్పుడు, మానవుడు తన నిజమైన బానిసత్వాన్ని గుర్తించడానికి సాధ్యమవుతుంది. ఈవిధంగా గుర్తించ గలిగినప్పుడు మాత్రమే, ఇతరములైన బంధాలన్నింటి నుండి విముక్తుడవుతాడు. దీని తర్వాత ఇక మిగిలి ఏదైతే ఉన్నదో అదంతా తన సంపూర్ణమైన సహజస్థితి మాత్రమే.

గనుక, లక్ష్యమంటే ఏమిటో, క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, అట్టి లక్ష్యాన్ని పొందిన గురువును ఆశ్రయించి, దాన్ని పొందడానికి అతని శిక్షణ క్రింద ధ్యానసాధన ప్రారంభించాలి. లక్ష్యమంటే ఏమిటో తెలియకుండా, అడ్డమైన ధ్యానసాధన ప్రారంభిస్తే పిచ్చిఆసుపత్రిలో నైనాచేరవలసివస్తుంది, లేదా రాత్రులందు భయంకరమైన పీడకలలతో నైనా అవస్థపడవలసి వస్తుంది.

యాంత్రికంగా కొన్ని శబ్దములను ఉచ్చరించడము ధ్యానమని ఖచ్చితంగా అనడానికి వీలులేదు. కొన్ని చిత్ర పటాలమీదగాని, విగ్రహములమీదగాని ఏకాగ్రతగా ఉండడము కూడా ధ్యానం కాదు. ఒక పవిత్ర లక్ష్యము పట్ల భక్తి, ప్రేమలతో బహుకాలం చింతన చేయడమే ధ్యానము. అట్టి ధ్యానసాధన, అట్టి పవిత్ర లక్ష్యాన్ని, హృదయంలోని అన్ని స్థాయిల్లోకి పోయేట్లు చేస్తుంది. గనుక, హృదయాంతర్గతంలోకి అట్టి తలంపును చొప్పించ గలందులకు పవిత్రమైన, ఉన్నతోన్నతమైన లక్ష్యాన్నే ధ్యాన వస్తువుగా తీసుకోవడం తప్పనిసరియై ఉంటుంది.

ఉన్నత లక్ష్యముపై ధ్యానమనేది ఒక గంట సేపు చేయాలి. అప్పుడది కొద్దికాలంలోనే మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఎప్పుడూ చంచలస్వభావంతో మనసుం ఉంటుంది గనుక, ధ్యానానికి కూర్చున్న తర్వాత, దైవీకమైనలక్ష్యంపై ధ్యాన కుదరడానికి మొదట్లో పది లేక పదిహేను నిమిషాల కాలం వరకు సామాన్యంగా పడుతుంది. అప్పుడుగాని మనసునకు ఒక స్వస్థతంటూ చిక్కదు. అందువల్ల, పది లేక పదిహేను నిమిషాల ధ్యానం నిష్ఫలమవుతుంది. అయితే,

సమర్థవంతుడైన గురువు లభ్యమయితే ఆ విషయంవేరు. అంత సంపూర్ణుడైన గురువు లేక సద్గురువు లభ్యమైతే అతనితో అత్యంత భక్తి ప్రేమలతో అనుబంధ మేర్పరచుకొంటే మన లక్ష్యం వెంటనే నెరవేరుతుంది. సద్గురువైన వాడు మూలముతో అనుసంధాన మేర్పరుచుకొన్నవాడు గనుక, అతనితోటి మన అనుబంధమనేది ఆ మూలముతో సహజంగానే ఏర్పరుస్తుంది.

సమర్థవంతమైన ధ్యానము రెండు విధాల ఫలితాలను చేకూరుస్తుంది. ఒకటి, హృదయాన్ని నిష్కల్మషంగా చేయడము, రెండవది హృదయాన్ని దివ్యతేజస్సుతో నింపడము. ఈ రెండు ఫలితాలు పరస్పరం ఒకదాన్ననుసరించి మరొకటి ఉంటుంది. ఈ రెండింటిలో ఏ ఒకటి లేకపోయినా మరొకటి ఉండడానికి వీలులేదు. గనుక, హృదయంలోని మాలిన్యాలను తొలగించడానికి, వెంటనే తేజోవంతంగా చేయడానికి ఏ ధ్యానపద్దతి ననుసరించినప్పటికి, అట్టి ధ్యానపద్ధతి మనస్సుతో సహకరించేదిగనే ఉండవలె. అభ్యాసియొక్క ఇచ్ఛాశక్తివల్ల, లేదా సమర్థవంతుడైన గురువు యొక్క కొంత ప్రాణాహుతి శక్తి ప్రసారితము వల్ల పైతెల్పిన రెండు ఫలితాలను పొందడానికి బాగా దోహదంచేస్తాయి.

ఉన్నతోన్నతమైన సంపూర్ణ లయావస్థపొంది, అందులోనే స్థిరపడినట్టి పరిపూర్ణ మానవుని రూపంపై ధ్యానం చేయడమనేది అన్నిటికన్న చాలా సులభమైనది, ఫలప్రదమైనది. అయితే అటువంటి వ్యక్తిని ఎక్కడ కన్గొనగలము? అట్టివానికొరకు మనః

స్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్థన చేయడమే. మన గురువుగారిని ఈవిషయంగా ఉదాహరణగా తీసుకోవచ్చు. నిజమైన అన్వేషకుని హృదయము అట్టి ఉన్నతమైన మానవుడిని గుర్తించగలదు. అది అక్షరాలా వాస్తవము. భగవంతుడే అన్వేషకుని వాకిలి వద్దకు వస్తాడు. అట్టి దివ్య పురుషుడు తటస్థపడినప్పుడు అన్వేషకుని హృదయంలో తెలియకుండానే ప్రేమ ఉద్భవిస్తుంది. అట్టి ప్రేమను తన సాధన ద్వారా భక్తి, శ్రద్ధలతో తన సంబంధము పటిష్టం చేసుకొన్నప్పుడు, కొద్ది కాలంలోనే లక్ష్యాన్ని పొందడములో సఫలీకృతుడవుతాడు.

ఓం శాంతిః

"Efficacious Meditation"
From the Book 'Call of the fellow traveler.' (page 5)

# జ్ఞాన వాంఛ

## (3) LOVE FOR WISDOM

జ్ఞానం కావాలని మానవులు ఆశించడము సహజమే. కొంతమంది వారు జ్ఞానులమని అనుకొంటారు. కొంతమంది వారికి జ్ఞానం ఇంకా అభివృద్ధి కావాలని ఆశిస్తుంటారు. మరి కొంతమంది వారి జ్ఞానంతో విసుకుజెంది, ఉన్నతమైన, లేక దివ్యజ్ఞానం పొందడానికి ఆరాటపడుతూ ఉంటారు. జ్ఞానమే మానవజాతిని అన్ని బాధలనుండి విముక్తి చేసేదనే నమ్మకంకూడా ఉంది.

హృదయంలోని కేంద్రమే కోర్కెలన్నింటికి ఆధారమైనప్పుడు, లేదా, హృదయమే ఆలోచనలను కట్టుబాటులో నుంచినప్పుడు, అనేక కోర్కెలతోపాటు జ్ఞానాన్ని పొందాలనేది కూడా ఒక కోరికగా అవుతుంది. జ్ఞానమనేది కూడా, హృదయం చుట్టూ తిరుగాడుతూ ఉండే కోరికలమాదిరేనని చెప్పడంకూడా కద్దు. భోగ భాగ్యాలను పొందడానికి ప్రాపంచిక వస్తువిషయాదులను ఏవిధంగా వాడుకోవాలనే తెలివితేటలని కూడా జ్ఞానమని భాషాంతరీకరణ చేసారు. మరికొన్ని మార్లు, తన ఎరుకనుగురించిన పెరుగుదల లేదా, తర్క మీమాంసాదులచే తన అహంభావమును, దర్పాన్ని పెంపుచేసుకొనే నైపుణ్యాన్ని కూడా జ్ఞానమని అర్థంచెప్పారు

జ్ఞానమనేది రెండువిధాలని విశ్వవ్యాప్తంగా అంగీకరించారు. ఒకటి ప్రాపంచిక జ్ఞానము, రెండవది దివ్యజ్ఞానము. సృష్టి ప్రారంభ మైనప్పుడు, దివ్యశక్తి, ప్రవాహమువలె క్రిందికి దిగివచ్చింది. ఒకే ప్రవాహంగా ఒక స్థాయివరకు దిగివచ్చింది. అక్కడినుండి రెండు పాయలుగా విడిపోయి రెండు ప్రవాహములుగా మారినాయి. చిన్న చిన్న ప్రవాహాలు కూడా చాలా ఏర్పడినాయి. రెండు పాయలుగా విడిపోయిన ఈ ప్రవాహములు, ఒకటి అధోముఖంగానూ, మరొకటి కుడివైపునకు ఊర్ధ్వముఖంగా మరలే స్వభావంతోను ప్రవహిస్తుంటాయి. అధోముఖంగా ప్రవహించినట్టి శక్తి బహుశః ప్రాపంచకానికి, స్థూలవిషయాలకు సంబంధించినదిగానూ, కుడివైపుకు ప్రవహించినట్టి శక్తి ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినట్టిది లేదా సూక్ష్మవిషయాలకు సంబంధించినట్టిదగనూ ఉండవచ్చు. దివ్యజ్ఞాన మనేది కుడివైపు ప్రవాహానికి, ప్రాపంచిక జ్ఞానము అధోముఖంగా ఉండే ప్రవాహానికి బహుశః సంబంధించినట్టిదై ఉండవచ్చు.

దివ్యజ్ఞానాన్ని కాంక్షించడ మనేది హిందూదేశములోని యోగులకు, ఋషులకు ప్రత్యేకత. ఇట్టి జ్ఞానం కొరకు గొప్ప ఋషులందరు, హృదయాన్ని పవిత్రత చేయడము, క్రిందికి దిగజారే స్వభావాలను నిగ్రహించడములనేవి అవసరమని నిర్ణయించారు. ఎవడైతే తనహృదయ గ్రంథిని ఛేదిస్తాడో వానికి దివ్యజ్ఞానం ప్రాప్తిస్తుందని మహర్షులు అంటారు.

దివ్య శక్తి అధోముఖంగా ప్రవహించడానికి ప్రారంభమయిన చోటికి కొంచెం దిగువన, జ్ఞాన మనేదాని స్థానం ఉంది. దివ్యజ్ఞానం పొందాలంటే, మొట్టమొదట కుడివైపుకు ప్రవహించే దిశన పురోగమించడం ప్రారంభం చేయాలని మహర్షులందరు కన్గొన్నారు. హృదయంలో అయిదు ముఖ్య స్థానాలు ఉన్నాయి. అధ్యాత్మిక పయనం ఈ అయిదు స్థానాలగుండా ముగియాలి. ప్రతి స్థానమూ, కుడివైపునగాని, లేక ముందు స్థానానికి పై స్థితిలో గాని ఉంటుంది. ఈ పయనమయిన తర్వాత దివ్య జ్ఞాన మనే ప్రాంతంలోకి ప్రవేశిస్తాడు.

అన్ని స్థానాలు దాటి, దైవ సామ్రాజ్యంలోకి ప్రవేశించినవాడు, దివ్య జ్ఞానాన్ని పొందాలని అపేక్షించే మరొకరికి దివ్య ప్రకంపనలను ప్రసరింపచేసి, ఎంతగానో సహాయం చేస్తాడు. ఉన్నత స్థాయిలనుండి దిగజారడమనేది ఉంటుంది గనుక, దిగజారకుండా ఉండడమనేది దాదాపు అసంభవము. అందువలన, అట్టి దిగజారుడు కలుగకుండా ఉండడానికి వాస్తవంలో, అట్టి దివ్యత్వాన్ని ప్రసరింప చేయడమనేది అత్యవసరము. సమర్థవంతుడైన గురువు మాత్రమే అట్టి దిగజారుడు కలుగకుండా ఇంకా ఉన్నతమైన స్థానాలను అందుకోడానికి సహాయము చేస్తూ ఉంటాడు. ఎవరికైనా దివ్యజ్ఞానం కొరకు పటిష్టమైన ప్రేమ ఇచ్ఛ ఉంటే దాని విషయంగా పరిశోధన చేసి, ఇంతవరకు తెలియజేయనట్టి కొత్త స్థానాలను, కొత్త అస్పదాలను కనిపెట్టవచ్చు.

ఓం శాంతి

**"Love of Wisdom"**

From the Book 'Call of the fellow traveler,' (page 8)

## (4) నాడు, నేడు
## (4) Then and Now

శ్రీ రాంచంద్ర మిషన్ లో నేను చేరిన వెంటనే, నా స్నేహితుల మధ్య ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది. ఉండే వళ్ళందరూ ఉండగా నాలాటివాడు ఆధ్యాత్మిక సంస్థలో చేరడమేమిటని కొంతమంది నా స్నేహితులకు ఆశ్చర్యచకితులయ్యారు. ఇలాటి తొందరపాటు పని ఏదో నేను చేస్తానని చాలాకాలనుండి అనుకొంటూనే ఉన్నామని కొందరు గొణుక్కున్నారు. అందులో చాలామందికి మతమంటే తిరస్కారం, అపహాస్యం చేసేవారే. అంతేగాక, నాపట్ల సానుభూతి చూపేవారే. నా స్నేహితులు విశ్వవిద్యాలయాల్లో చదివి ఇంజనీరింగులోను, న్యాయశాస్త్రంలోనూ, ఇతరవాటిల్లోనూ పట్టభద్రులైనవారే. కొంతమంది మంచి అవకాశాలకోసం ఎదురు చూస్తూ ఉండేవారు. నేను అప్పట్లో ఇంజనీరింగు శాస్త్రంలో టీచరు ఉద్యోగం వచ్చి చేరాను.

సంవతసరాలు గడిచిపోయినాయి. నా ఆధ్యాత్మిక శిక్షణ యావత్తు దాదాపు పూర్తయిందని నా గురువుగారు తీర్మానించారు. నిర్లక్ష్యం; తిరస్కార భావనలవల్ల కాకుండా, కేవలము అవాంఛనీయమైన ధోరణిలో మార్పుకలిగినందువల్ల పూజావిధానం తొలగిపోయింది. కొన్నిమార్లు నా ఆప్త మిత్రులను కలుసుకోడము తటస్థించేది. అప్పటి మాదిరి ఇప్పుడు వారు బాధ్యతా రహితంగానూ,

ఇచ్ఛానుసారం ఆలోచించే పట్టభద్రులైన చిన్నవాళ్ళుకూరు. ఇప్పుడు నావంతు వచ్చింది. మతమంటే వారికి ఏర్పడ్డ నమ్మకాన్ని గురించి కాస్త ఆటపట్టించడానికి నావంతు వచ్చింది. అయితే అది వాళ్ళను హేళన చేయడానికి, అపహాస్యంపట్టించడానికి, సానుభూతి చూపడానికి కాదుగాని, వారందరూ ఆధ్యాత్మికంగా క్షేమంగా ఉండాలనే ఆరాటమే గాని మరో విధమైన తలంపేమి కాదు.

ఇది ఏవిధంగా జరిగింది? ఇంత త్వరితగతిన మార్పు కలగడము ఏవిధంగా జరిగింది? నాజీవిత పయనాన్ని వారితో పోల్చుకొనేదా? అంటే నేను వాళ్ళకంటే కొంత ఎదిగాననే భావన నాలో యిమిడి ఉన్నదా? కానేకాదు. ఎప్పటికి కాదు. నేను వాళ్ళనందరిని ఇంతకు ముందు ప్రేమిస్తున్నట్లే ఇప్పుడుకూడా ప్రేమిస్తున్నాను. వాళ్ళు ఆరాధించే దేవుళ్ళను గురించి, వాళ్ళ కోర్కెలను తీర్చిన ఆ దేవుళ్ళనుగురించి, వారి ఆశయాలు, నమ్మకాలు, భయాలను గురించి, జపతపాదులను గురించి, కులమతాలను గురించి, గురువులు, భజనలను గురించి వాళ్ళడిగిన ప్రశ్నలన్నింటికి ఏవిధమైన సంకోచము లేకుండా ధారాళంగా, స్వేచ్ఛగా జవాబులు చెపుతూ ఉంటే, వాళ్ళంతా విస్తుపోతూ ఉంటారు. ఈ విధమైన స్థితి నాకు కలగడానికి ఏమి జరిగి ఉంటుంది?

నవీన విద్యావిధానంవల్ల బుద్ధిశాలురకు, వివేకవంతులకు మతముపట్ల విశ్వాసము సన్నగిల్లి చెదిరిపోయింది కాని, దానికి

ప్రత్యామ్నాయంగా దాని స్థానే ఉన్నతమైన ఆధ్యాత్మిక శక్తి చోటుచేసుకోలేదు. మనసుం నియమబద్ధంగా ఉండదు. క్రమేణా కోర్కెలు, అవసరాలు, ప్రకృతివైపరీత్యాలు వారికి తయారవుతాయి. వారి తెలివి మొద్దుబారిపోయి, అంధకారములో చిక్కుకొనిపోతారు. అట్టి సమయంలో దేవుళ్ళను, మతాలను ఆశ్రయించి, వాటి సహాయము కొరకు ప్రయాస పడుతూ ఉంటారు. ఈ దేవుళ్ళను, మతాలను ప్రతినిధులమని అంటిపెట్టుకొని వుండేవారు, అట్టివారి కొరకు ఎల్లప్పుడు సిద్ధంగనే ఉంటారు. ఇక అక్కడినుండి వారిపంట పండడము మొదలవుతుంది. అనేక రూపాలలో, పద్ధతుల్లో వారి బల హీనతలను సొమ్ము చేసుకోడము ప్రారంభమవుతుంది.

ఇవన్నికూడా తప్పుడు పద్ధతులవల్ల, తప్పుడు మార్గ దర్శకంవల్ల, తప్పుడు లక్ష్యంవల్ల ఏర్పడే అవస్థలు. నాగురువుగారిని దర్శించిన తర్వాత ఈ మూడింటి విషయంగా నాకు యదార్థస్థితి గోచరించి, చక్కని అవగాహన ఏర్పడి, దృష్టిని సరియైన లక్ష్యము వైపుకు మళ్ళింపబడి, సర్వసమర్థుడైన గురువు, సహజమార్గమను పేర ఒకే ఒక విశిష్టాత్మకమైన పద్ధతి నాకు అందజేసారు. ప్రత్యేకమయిన పద్ధతిలో యోగ శక్తి ప్రసారితము వల్ల శిక్షణ యావత్తు పూర్తి కావింపబడింది. అంధకారమంతా అంతర్ధాన మయింది, జడత్వమంతా కరిగిపోయి కొట్టుకొని పోయింది. గురువుగారిచే జీవితము సంపూర్ణంగా పరిశుద్ధము కావింపబడింది.

నా ప్రియమైన స్నేహితులందరు గురువుగారి అనుగ్రహము వల్ల ఇట్టి అమృతాన్ని రుచి చూసి వారి యధార్థ స్థితిని మరల పొందుదురుగాక !

ఓం శాంతిః

**Then and Now**

From the Book 'Call of the fellow traveler,' (page 11)

# (5) అమరత్వానికి మార్గం
## (5) "Way to Immortality"

పసివాడైన మార్కండేయుడు మరణించే నిర్ణీత ఘడియలు ఆసన్న మవుతున్నాయని తెలుసుకొన్న అతని తల్లిదండ్రులు శోకంతో విలపిస్తున్నారు. భగవధారాధనలో నిమగ్నమై ఉన్నాడు మార్కండేయుడు. అక్కడికి యమధర్మరాజు వెళ్ళాడు. భగవ దనుగ్రహ పాత్రుడై ఆయన ఒడిలో ఉన్న మార్కండేయుడిని ఏమిచేయలేక యమధర్మరాజు వెనుకకు వెళ్ళిపోయాడు.

సత్యవంతుడి ప్రాణాన్ని యమధర్మరాజు తీసుకొని పోతూవున్నాడు. సత్యవంతుడి భార్య సావిత్రి తన భర్త ప్రాణాలను వెనక్కు తీసుకొడానికి, మార్గమధ్యంలో అనేక అవరోధాలను, ఆటంకాలను ధైర్యంతో ఎదుర్కొంటూ అధిగమిస్తూ యమధర్మరాజు వెంటబడింది. ఆమెను రావద్దని యమధర్మరాజు ఎన్నోమార్లు వారించాడు, అయినా ఆమె వినలేదు. చివరకు ఆమెను ఏదైనా వరం కోరుకోమన్నాడు. తెలివిగల సావిత్రి ఉపాయం ఆలోచించి, తాను పుత్రపౌత్రులను పొందే వరం కోరింది. తన భర్తని భార్య కావడము చేత, ఆమెకు భర్తను మరల అప్పగించాడు.

పశివాడు నచికేతుడు. యమధర్మరాజు వద్దకు వెళ్ళి, నిద్రాహారాలు లేకుండా ఆయన కొరకు మూడురొజులు, నిరీక్షిస్తూ

ఉండినాడు. యమధర్మరాజు అతని పట్టుదలకు సంతసించి మూడు వరాలు ఇస్తానని అభయమిచ్చాడు. తెలివైనవాడు, చురుకైనవాడు కావడంచేత, నచికేతుడు ఇతరములైన ప్రాపంచిక ఆకర్షణలకు లొంగక, సమస్త ఉనికి యొక్క రహస్యాన్నీ, చివరకు జ్ఞానాన్ని పొందేందుకు భగవంతునికన్న వేరెవ్వరు లేరు గనుక, దాన్ని ఆయననుండే పొందాలని కోరాడు. ఆవిధంగా నచికేతుడు మృత్యువును జయించడమే గాక, భగవంతుని దయతో ఆత్మసాక్షాత్కారం పొంది అమరుడైనాడు.

పైన చెప్పిన ఉపాఖ్యానాలు హిందూదేశంలో తాత్విక చింతనను సుసంపన్నం గావించాయి. అద్భుతమైన కల్పనా కథలు, నాటకాలు, ఉన్నతమైన తత్త్వచింతన లనునవి హిందువుల యొక్క సాంప్రదాయంౌ సంస్కృతి, నాగరికతలపైన ఎనలేని ప్రభావం చూపినాయి. కళలు, సాహిత్యం, పద్యకవితలు, వాఙ్మయము, తత్త్వశాస్త్రము ఇవన్నికూడా పైతెల్పిన అంశాలనుండే పుష్కలంగా విషయసేకరణ చేసాయి. మోక్షకాములుకూడా, మార్కండేయుడు, సావిత్రి, నచికేతుల పేర్లు వింటేనే ఆనంద పరవశులై పరవశం చెందుతారు.

ప్రతి మానవునికి జీవితాన్ని ప్రేమించడమనేది ముఖ్యమైన ఒక ఆస్థి. నిజ జీవితంలో ఒకే నిర్ణీత రూపాన్ని అంటి పెట్టుకొనే విషయంగా గందరగోళంవల్ల మృత్యువును గురించిన భయము మానవునిలో కలుగుతుంది. ఈ గందరగోళం అచేతన మైన జడ పదార్థం

ఉన్నట్లు గమనించవచ్చు. దాని పర్యవసానంగా రూపాలన్ని వీగిపోయి గుప్తంగా ఉన్న శక్తిని క్రియారూపం చెందడానికి దోహదం చేస్తుంది.

వున్న ఉనికి ఒక్కటేననిన్ని, అందువల్ల వ్యక్తిగత రూపాలన్ని అందులోని భాగాలేననిన్ని గ్రహించి, జీవితంపట్ల ఉండే ప్రేమ బంధాన్ని ఏదోవిధంగా సరియైన పద్ధతిలో అటువైపు మళ్ళించినప్పుడు మరణాన్ని గురించిన భయము ఇక ఏమాత్రం ఉండడానికి వీలులేదు. వ్యక్తిగత రూపానికి సంబంధించిన భయాందోళనలన్ని కూడా ఏవిధమైన ప్రాముఖ్యత లేకుండా అర్థ రహితమైపోతాయి. ఒక వ్యక్తి ఎందుకు అంతగా తన వ్యక్తిత్వంతో బంధం పెట్టుకొంటాడు ? ప్రాచీన ఋషులు అనేక మానసిక శక్తులను గమనించి, వాటికి దేవుళ్ళని పేరుపెట్టారు. మానవులు జీవించడానికి, వారి జీవితావసరాలను తీర్చడానికి అట్టి శక్తులను తమ అధీనంలో ఉంచుకోడానికి ఎల్లప్పుడు ఈ దేవుళ్ళు సహాయం చేయడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారని గమనించారు. దేవుళ్ళకు మానవులు ఆహారాన్ని సమకూరుస్తారు, మనుష్యులకు దేవుళ్ళు ఆహారాన్ని సమకూరుస్తారు. దివికి భువికి వివాహబంధమేర్పడింది.

ఏవిధంగానైతే మనుష్యులకు సహాయం చేయడానికి దేవుళ్ళు ఉన్నారో, అదేవిధంగా జడత్వంతోనూ, అజ్ఞానాంధ కారంతోనూ ఉండే మానసిక శక్తులయిన దానవులుకూడా ఉన్నారు. వారు కూడా వారికి రావలసిన ఆహారం మనుష్యులనుండి

కోరుతూ ఉంటారు. దైవదానవులు ఇరువురు ఒకే మనసునుండి ఉద్భవించిన రెండు వ్యతిరేక శక్తులు, వాస్తవంలో ఒకే రక్తాన్ని పంచుకొని పుట్టిన సోదరులు.

దైవ దానవులిర్వురు కూడా భయంనుండి విడుదల కానివారనే విషయాన్ని ప్రాచీన ఋషులు గుర్తించారు. జీవితకాలం ఈ భూమిమీద ముగిసిన పిమ్మట మానవులు దైవ లోకంలోకిగాని, దానవ లోకంలోకి గాని ప్రవేశిస్తారు. మానవునికి దైవలోకం పొందాలనే కోరిక సహజమే. దైవ లోకమే అంతిమ నివాసము కాదని పూర్తిగా అవగాహన పొందిన ప్రాచీన మహర్షులకు బాగా విశదమయింది. అందుచేత ఇంకా ఉన్నతమైన స్థితుల యొక్క ఉనికిని సూచించి, వివిధ తేజోవంతమైన మండలాలను దాటి , అంతిమ బంధవిముక్తిని పొందడానికి తగిన మార్గ పద్ధతులను కూడా సూచించారు. దీన్ని పొందడానికి అన్నింటికన్న మొట్ట మొదట, తీవ్రమైన ఆరాటము, ఇచ్ఛ, కలిగి ఉండడము, తదుపరి ఆహ్లాదములకు లోనుగాకుండా ఉండడములనేవి ముఖ్యము.

దైవ లోకంతో పాటు, దానవ లోకాన్ని కూడా జయించాలి. మెరుగైనదానియందు మాత్రమే దృష్టి కలిగి ఉంటే సరిపోదు. గనుక అజ్ఞానాంధకారులు ఎప్పుడూ కూడా ముముక్షువుల మంచితనాన్ని, ప్రకాశవంతమైన ప్రతిదానిని భయ పెట్టడము, కలవర పెట్టడము ఇంకా కొన్ని మార్లు దండెత్తడము కూడా సహజంగా చేస్తూ ఉంటారు. అదే వారి సహజ లక్షణం.

ఉన్నతోన్నత మైన మూలమును చేరుకొని, తనయందు ప్రేమగల సహచరుల యోగ క్షేమం కోరకు మానవావతారంలో ఉండే భగవత్ స్వరూపుల పైనకూడా దండెత్తడానికి వెనుకాడరు. అయితే అట్టి పరిస్థితుల్లో ఈ రాక్షసులు సంహరింపబడి నాశనము కావింప బడుతారు. అయినప్పటికి, అట్టి అవతార మూర్తులు శారీరకంగా కొంత ఇబ్బందికి లోనవుతారు. పటిష్టమైన ప్రేమ, ప్రార్థనల వల్ల అట్టి ఇబ్బందులను తొలగించవచ్చు.

శారీరకంగా ఈ భూమి మీద శాశ్వతంగా జీవనం చేయాలని చేసే ప్రయత్నము, అందుకు సంబంధించిన తలంపులన్ని హైందవ విజ్ఞతకు కడు దూరమైనప్పటికి, విజ్ఞత కల్గిన యోగులను కూడా కాదని, ఏదోవిధంగా మనలో కూడా ఈతలంపు చోటుచేసుకొంది. ఈజీవితము యొక్క ఉనికి అంతా ఒక చైతన్యవంతమైన పూర్ణమని, ఎట్టి నిర్ణీతరూపమేగాని పరిణామము చెందకుండా నిలచి పోవడమంటూ లేదను హైందవ తత్వ సిద్ధాంతాన్ని ప్రాచీన ఋషుల యొక్క అనుభవాలు నిరూపించడమే గాక, హైందవ జీవన పద్ధతులవల్ల కూడా తెలుసుకోవచ్చు. ప్రాపంచిక వస్తు విషయాదులందే గాక, స్వర్గసుఖాలపట్ల కూడా వైరాగ్యము, బంధరహితము కలిగి ఉండడమే హైందవ సంస్కృతియొక్క ముఖ్య సారాంశము. ప్రాణాహుతిద్వారా ఆత్మ సాక్షాత్కారం, అన్ని విధములైన బంధములనుండి స్వేచ్ఛను పునః పొదడమే అమరత్వమని మన

గ్రంథాలలో విశిష్టంగా చెప్పబడింది. దైవానుగ్రహాన్ని ప్రాణాహుతి ప్రసారితం చేయుటవల్లనే జరుగుతుంది.

అన్వేషకుడు ఈ ప్రాణాహుతిని తప్పక పొందాలనే విషయం ప్రాచీన ఋషులు కూడా నొక్కి చెప్పారు. గొప్ప యోగీశ్వరులందరు దీనిని ప్రత్యేకంగా సాధన చేసారు. సహజమార్గ పద్ధతి మాత్రమే దీనిని నిజమైన అన్వేషకులకందరి ఉపయోగార్థం అందుబాటులోకి తెచ్చింది. ఎవరైనా సరే, సావిత్రి, నచికేతుడు, మార్కండేయుడు పొందినట్టి స్థితులను పొందాలను కొంటే, అట్టి వారు యోగశక్తి ప్రసారితము చేయగల సమర్థులను ఆశ్రయించితే సులభంగా వారి కోర్కెలను తీర్చుకోవచ్చు.

ఓం శాంతి

**"Way to Immortality"**

From the Book 'Call of the fellow traveler,' (page 13)

# (6) భారతావనిలో వెలుగుతున్న నూతన జ్యోతి

## (6) New Light shining in India

సుమారు 2500 సంవత్సరాలకు పూర్వము, గౌతమ బుద్ధుడను ఒక విశిష్ట వ్యక్తి, మానవుడు దుఃఖాలనుండి విడివడి నిర్వాణాన్ని పొందడానికి పద్ధతులను బోధించాడని చరిత్రకారులు మనకు చెప్తారు. ఇప్పుడు బౌద్ధమతం అనేక రూపాలలో మనం చూస్తూ ఉన్నాము. బౌద్ధమతంలో అనేకవిధాలైన బౌద్ధులందరూ ఏదోవిధంగా దుఃఖాలను అనుభవిస్తూ నిర్వాణంకొరకు అనేక మంది ఆశస్తూ ఉండడము మనం చూస్తూనే ఉన్నాము.

దాదాపు 2000 సంవత్సరాలకు పూర్వము జీసను క్రైస్తు అను విశిష్టమూర్తి భగవత్ సామ్రాజ్యంలోకి ప్రవేశించడానికి, జీవన పద్ధతులను బోధించాడు. ఇప్పుడు అనేక రూపాలలో క్రైస్తవ మతాన్ని, పలువిధములైన క్రైస్తవులను మనం చూస్తూనే ఉన్నాము. భౌతిక బంధాలనుండి స్వేచ్ఛ పొందకుండా పైశాచిక అధికారంక్రింద నలిగిపోతూ ఉన్నారు.

ఇస్లామ్ మరియు యితర మతాలు వారి అనుచరుల విషయంకూడా అదేవిధంగా ఉంది. మత వ్యవస్థతో సంబంధంలేని మార్క్సిస, డార్విన్ మొదలైన సిద్ధాంతాలుకూడా అదేవిధమైన తగ్గ స్థితికి దిగజారిపోయినాయి. మార్క్సిస సిద్ధాంతాలు మతానికి సంబంధించినవి కావని వారు అన్నప్పటికి, వారి నాయకులు,

పైస్థాయిలో ఉండే యితర వ్యక్తుల యొక్క స్వార్థము, మూర్ఖత్వము, అసహనము, దురభిమానముల వల్ల మతానికి ఉండే అవలక్షణాల న్నింటికంటే యింకా ద్రోహం చేస్తూవచ్చారు. మత సంస్థలపట్ల గాని, మతముతో సంబంధములేని లౌకిక వాదుల పట్ల గాని, లేదా తదితరులపట్లగాని సహనము, ఆదరణ చూపడంలో హిందూదేశం చాల గొప్పదనడంలో సందేహంలేదు.. కొన్ని మార్లు దేశ సమైక్యతకు, స్వాతంత్ర్యానికి, స్వేఛ్ఛకు ముప్పు వాటిల్లుతుందని అన్నప్పటికి యిట్టి సహనము, ఆదరణ మొదలగు సుగుణాలను విడిచిపెట్టకుండా ఉండడమే కాకుండా వీటిని యింకా పెంపు చేసుకొంటున్నది. ఈ దేశంలో అన్ని విధాలైన మత సిద్ధాంతాలు, మతాతీత సిద్ధాంతాలు అన్నింటికి అనేక పద్ధతులలో ప్రతి వ్యక్తికి మతస్వేచ్ఛ, ఆలోచనా స్వాతంత్ర్యములకు అభయ మిస్తూ ఉండడము చూడవచ్చు.

దారిద్ర్యము, దుఃఖాలు, వ్యసనాలు, వ్యాధులు, వృద్ధాప్యము, మరణములనేవి సర్వసామాన్యంగా అంతటా ఉన్నప్పటికి, వ్యక్తియొక్క స్వేఛ్ఛ, స్వాతంత్ర్యభావాలకు విలువగల ఈ దేశంలో జన్మించడమనేది ఒక దైవ ప్రసాదముగా భావింపబడుతూ ఉంది. ఒక మతస్థుడు తన మత సిద్ధాంత రీత్యా భగవంతుడిని మరొక మతస్థుడు నమ్మనందున వారిని చంపడము మొదలు పెట్టినప్పుడున్నూ, తాను నమ్మిన సాంఘిక సిద్ధాంతాన్ని పదిలంగా కాపాడుకోడానికి మరొక సాంఘిక సిద్ధాంతానికి కట్టుబడి ఉండే వానివల్ల ముప్పు వాటిల్లుతుందని అనిపించి చంపడము,

అదే విధంగా రెండు సంస్థలమధ్య మత సిద్ధాంతాలవల్ల గాని, సాంఘిక సిద్ధాంతాలవల్ల గాని బేధము ఏర్పడినప్పుడు యుద్ధాలు చేయడమనేది హిందూదేశస్తునియొక్క మనసుఎ అతలాకుతలమై, అట్టి స్థితికి సమ్మతిపడక, అట్టివారి కులాధిపత్యాన్నిగాని, సాంఘికమైన ఆధిపత్యాన్ని గాని అంగీకరించదు. వారి స్వార్థపూరితమైన దుష్ట తలంపులతో వారి సంస్థలను కాపాడు కోడానికి యుద్ధాలు చేస్తున్నారనేది, అతని వివేకవంతమైన దృక్పథంతో గ్రహిస్తాడు. పశులక్షణాలు గల్గిన సంస్థలు వారి పశుత్వాన్ని అంగీకరించడానికి సిగ్గు పడతారు. గోముఖ వ్యాఘ్రాలువలె మోసపూరితమైన సాంఘిక సిద్ధాంతాలతో కపట బోధలతో దుర్మార్గులుకూడా సన్మార్గులుగా చెలామణి అవుతుంటారు. బాధితులకొరకే ఇట్టి యుద్ధాలన్ని చేస్తున్నామని ప్రచారం చేయడంవల్ల ఇంకా ఘోరమైన మారణకాండకు దారి తీస్తూ ఉంటుంది.

హిందూదేశంలో యజ్ఞయాగాదులప్పుడు జంతువులను బలి ఇస్తే అజంతువు నేరుగా స్వర్గానికి పోతుందని ఆ రోజుల్లో యాజ్ఞికులు బోధిస్తూ ఉండేవారు. అదే నిజమైతే, తన తండ్రినే బలియిస్తే అతను కూడా నేరుగా స్వర్గానికి పోతాడుగదా అని ఎవడైనా నాస్తికుడు సలహాయిస్తే ఆశ్చర్యపోనక్కరలేదు.

తత్వవేత్తలు సమస్యలను తరగతులుగా విభజించి విశ్లేషణ చేసి, వారి సిద్ధాంతాలను తెలియచేయవచ్చు. కొన్నిమార్లు వాటి

పరిష్కారానికి మార్గాలనుకూడా సూచించవచ్చు. అయినప్పటికీ, వ్యక్తిగతమైన సమస్యలు పరిష్కారం కాకుండా అంతకు ముందు ఎంత క్లిష్టంగా ఉండినవో, అదేమోస్తరుగా ఉంటునే ఉన్నాయి. సాంఘిక పరంగా కూడా యిదే పరిస్థితి. యోగులు, వేదాంతులు పరిష్కార చేయాలని ప్రయత్నం చేస్తారు, కాని, అట్టి ప్రయత్నం చేయడానికి ముందుగానే తమ ఊహల్లో మైమరచి పరవశులై చిత్రవిచిత్రమైన భ్రాంతులలో చిక్కుకొని పోతారు.

గనుక ఈ విషయంగా ఎవరైనా నూతనంగా ప్రయత్నం చేయాలంటే, ఇంతకు ముందు జరిగిన పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించి, అతని దృష్టి యావత్తు లక్ష్యమందుంచి, దాన్ని సాధించేవరకు ఎట్టి స్థితిలోగాని విరమించకూడదనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగిపోవాలి. మానవుని ఆలోచనా శక్తి ఎంత బలోపేతమైనదో ఇప్పటి సాంకేతిక సరిజ్ఞానాభివృద్ధివల్ల తేట తెల్ల మవుతున్నది. అన్ని శాస్త్రాలు, తత్వజ్ఞానాలు, మతాలు, నూతనంగా కనిపెట్టబడిన విషయాలన్ని కూడా మానవుని ఆలోచనల వల్ల బహిర్గతమైనట్టివే.

గనుక, వ్యక్తిగతంగా కాని, సాంఘికంగా కాని సమస్యలకు పరిష్కారమనేది ఆలోచనా శక్తిని ఉపయోగ పెట్టడములోనే ఉంది. ఇది మానవుని ఇచ్ఛాశక్తి, ప్రయత్నాలపైననే ఆధారపడి ఉంది. తమ పక్షం చేరడానికి చేసే బోధలవల్ల, మతద్వేషంతో అనేక హింసాకాండలు చేయడమువల్ల, బలవంతం చేయడమువల్ల, లేక

ఎన్నో ఆకర్షణలకు అహ్లాదాలకు లోనుచేయడమువల్ల, మానవుడిని తన ఆలోచనా శక్తిని, ఇచ్ఛాశక్తిని ఉపయోగించి పని చేయించడములో సఫలీకృతులు కాలేరు. స్వచ్ఛందంగా, సర్వ స్వతంత్రంగా ఇచ్ఛాశక్తిని ఉపయోగించి తన స్వేచ్ఛకొరకు బంధాలను తెగ తెంపి పారేయాలి. అప్పుడుగాని అతనికి ఉన్నతమైన మానసిక స్థితులేగాక, దైవీక స్థితి కూడా కలగడానికి వీలుపడుతుంది.

అయినప్పటికీ, ఉన్నతశక్తి యొక్క సహాయము తప్పనిసరియే గాకుండా అగత్యముకూడా. అయితే అట్టి ఉన్నత శక్తి తనకంటే బాహ్యంగా ఉన్నట్లు అనిపించినప్పటికి, అది చివరకు అతనిలోనే ఉన్నదనేది కన్గొనవలసినదే. అందుకోసం మళ్ళీ ఆ ఉన్నత శక్తే సహాయం చేస్తుంది. ఇది ఆచరణీయమైనది, అనుభావికమైనది, వాస్తవికమైనదేగాని కల్పించబడిన విషయం కాదు. రాజయోగ సాధన ననుసరించి సహజమార్గ పద్ధతి ప్రకారం ఇట్టి సహాయం ప్రాణాహుతి ద్వారా అందించబడుతుంది. ఎవరైనా దీనిని అనుభవపూర్వకంగా పొందాలనుకొనేవారు రాంచంద్ర మిషన్ ప్రశిక్షకులను (ప్రిసెప్టర్లను) కలిసి ప్రయత్నము చేయవచ్చు. సాధనా నంతరము ఆలోచనా శక్తిని ఉపయోగపెట్టి, వాస్తవము మరియు మానసికము, సంస్థలు మరియు వ్యక్తులు, తెలియని శుద్ధ అవివేకము మరియు భగవత్ సాక్షాత్కారం మొదలయిన వాటినన్నింటిని గురించి తమ ఆలోచనా శక్తిని ఉపయోగించి పరిష్కారం చేసారు. శ్రీ రాంచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు

గారిచే కనిపెట్టబడిన నూతన మార్గపద్ధతి ఇది. ఏవిధమైన స్వార్థము లేకుండాఅదృష్టవశాత్తు మనకు సహాయము చేయడానికి వారు మన మధ్యన ఉన్నారు.

జిజ్ఞాసులందరు ఆ తేజసునను దర్శించుదురు గాక !

ఓం శాంతి.

**"New Light shining in India"**

From the Book 'Call of the fellow traveler,' (page 17)

# (7) సారాంశాన్ని గ్రహించండి.

## (7) CATCH THE SPIRIT

నేను రాయచూరునుండి వచ్చాను. నావలె మీరుకూడా అనేక ప్రాంతాలనుండి గురువుగారిని చూడడానికి వచ్చారు. గురువుగారు మనల్ని ఆకర్షించారు గనుక మనం వచ్చాము. మనం ఇక్కడికి వచ్చింది కేవలం గురువుగారిని చూడడానికా లేక ఇంతకంటే ఎక్కువగా ఏదైనా పొందడానికి వచ్చామా? వచ్చిన పనియేమి? ఉద్దేశ్యమేమి ఈ విషయాలను గురించి మనం ఆలోచించాలి. నేను అందరి అభ్యాసీలనుద్దేసించి మాట్లాడుతున్నాను.

మనం ధ్యాన సాధన చేపట్టాము. ఇక్కడ మన ఆలోచన పనిచేయాలి. మనం ఆలోచించాలి. ఆలోచన చేయకూడదనుకొన్నా, ఆలోచించడానికి భయపడినా, లేదా సక్రమంగా అది చేయలేక పోయినా, ఈ ధ్యాన సాధన మీకు అక్కరలేదు. ధ్యానం మీకు ఉపయోగ పడదు. మీరు ఆలోచించవలసిన పని లేదనుకొంటే, వేరే అనేక పద్ధతులున్నాయి, అనేక మంది గురువులున్నారు, అనేక యోగ పద్ధతులున్నాయి. అక్కడికి వెళ్ళి ఆలోచనా శక్తిని పోగొట్టుకొని హాయిగా నిద్రపోవచ్చు. శాంతమనేదానికి, మందత్వమనేదానికి బేధముంది. ఇక్కడే మన ఆలోచనా శక్తిని ఉపయోగించాలి. మనం వివేకాన్ని ప్రదర్శించాలి. ధ్యానమనేది వివేకాన్ని అభివృద్ధి చేస్తుంది. ఎప్పుడైతే

అది అభివృద్ధి చెందుతుందో, సహజంగానే ఇతర స్వభావాలలో కూడా మార్పు రావాలి లేదా, స్వాభావికంగానే జరగాలి. ఇది అవసరం.

ధ్యానమనేది ఏదో చేయాలని ఒకగంటసేపు చేసి, మరచిపోవడము కాదు. అవిధంగా కాదది. దాని ముఖ్య సారమేమిటో గ్రహించాలి. మీరు ఎందుకు ఈ సహజమార్గ సాధన చేస్తున్నారు? జీవతాన్ని సంపూర్ణంగా మార్పుచేసుకోడానికా?, లేక భగవంతుడిని పొందడానికా? లేక ధృఢ నిశ్చయానికా? , లేక అంతిమ లక్ష్యాన్ని పొందడానికా? లేక, 'దాన్ని' (అంటే భగవంతుడిని) ఈ జన్మలోనే పొందడానికా? దాన్ని పొందాలనుకొంటే నీవు సాధన చేస్తూ ఉండాలి. ప్రశిక్షకుని సూచనలమేరకు మీరు సాధన చేస్తూ ఉంటే, అట్టి ప్రశిక్షకుడు చెప్పినట్లే పాటించాలి, జీవితాన్ని సరిదిద్దుకోవాలి., నడవడిక మార్చుకోవాలి. అందుకు తగ్గట్లు మీరు మాట్లాడే తీరు కూడా మారాలి.

నేను హైదరాబాదు ఎప్పుడు వచ్చినా, అభ్యాసులు నా వద్దకు వచ్చి వారి పురోభివృద్ధిని గురించి, వారి స్థితిని గురించి, స్థాయిని గురించి అడుగుతారు. ఇది హైదరాబాదు లోని అభ్యాసులే కాదు, ఇతర చోట్ల అభ్యాసులందరూ కూడా అదేవిధంగా అడుగుతుంటారు. వారు సహజంగా ఉత్సాహంతో తెలుసుకోవాలనే ఆతృతతో అడుగుతుంటారు. అది మంచిదే. దాన్ని మీరు అభివృద్ధి చేసుకొని, మీకు మీరే కనుక్కోవాలి. ఎంతవరకు మీరు మారినాము, ఎంతవరకు ఇతరులకు మీరు సహాయకారులుగా ఉన్నారు అనేది తెలుసుకోడానికి

ప్రయత్నంచేయాలి. ఈవిధమైన ఆలోచన చాలా అవసరము. అప్పుడే మీరు మీకు సహాయం చేసుకోడమే గాక, సంఘానికి, మానవ జాతికికూడా సరియైన రీతిలో స్ఫూర్తి కలుగ చేయడానికి దోహదం చేస్తుంది. ఆవిధంగా కాకుండా, స్వాములమని, గురువులమని చాటుకొంటూ వారిచే యివ్వబడిన పాత సిద్ధాంతాలకు కట్టుబడి పోయినప్పుడు ఆ బరువంతా నెత్తిమీద పెట్టుకొని, ఇంకా, హృదయంలో జడత్వాన్ని వృద్ధిచేసుకొని పురోభివృద్ధి చెందలేక ఆటంకాలుగా తయారవుతాయి.

మీరు విగ్రహారాధన మానుకోడానికి సిద్ధంగా ఉండాలి. యాంత్రికంగా ఆలోచన చేయడంవల్లనే విగ్రహారాధన అభివృద్ధి చెందింది. దాన్ని మీరు వదలుకొని, మీ వివేకాన్ని ఉపయోగించాలి. ఎందుకు మీరు దాన్ని చేస్తున్నామని, దేనికొరకు చేస్తున్నామనేది కన్గొనాలి. యాంత్రికంగా చేస్తూవుంటే, మీ ఆలోచనా నైపుణ్యాన్ని ఉపయోగించడము లేదన్న మాట. ఒకటి రెండు ఉదాహరణలు చెప్తాను. అవి చెపితే కొంత మొరటుగా ఉండవచ్చు. సేవ చేయాలనే స్వభావం ఉందనుకొండి. మనం మన గురువు గారిని ప్రేమిస్తాము. మనం ఆయనకు సేవ చేయాలనుకొంటాము. అందరూ ఒకేసారి సేవ చేయాలనుకొంటాము. అందులోని చిక్కులను కాస్త గమనించండి. ఈ మధ్య, గురువుగారు మద్రాసునుండి రాయచూరు రైల్లో వచ్చారు. ప్లాటుఫారం మీద రైలు వచ్చి ఆగెంతలోపల, మన అభ్యాసులు రైలుతో పాటు ప్లాట్‌పారంమీద కొంతవరకు పరుగెత్తుకొంటూ వెళ్ళి గురువుగారున్న పెట్టెలోకి ఎగబాకి లోపలికి ప్రవేశించారు. ఆయన్ను

అటూ ఇటూ కదలనివ్వలేదు. అతి కష్టంమీద వాళ్ళందరిని దాటుకొంటూ గురువు గారు బయటికి వచ్చారు. అభ్యాసులందరూ ఆయన సామాన్లు తలా ఒకటి తీసుకొని బయటకు పరుగెత్తారు. అంతపెద్ద గుంపులో ఎట్లా ఉంటుందో ఊహించండి.

ప్రతి వాడు ప్రేమతో, సేవా దృక్పథంతోనే ఆవిధంగా చేసారనుకొండి. అయితే దాని ఫలితం ఎట్లావుంది? గురువుగారు కొంతసేపు అక్కడే నిలబడి, నా సామన్లు ఎక్కడని ఒకటికి రెండుసార్లు అడగవలసి వచ్చింది. గనుక మనం సేవ చేయడానికి బదులు ఆయనకు అసౌకర్యాన్ని కలుగజేయడమే అయింది. అంతేగాక, వృథా కాలయాపనకూడా జరిగింది. ఇది చాలా స్వల్పవిషయం. అభ్యాసులకున్న ప్రేమాను రాగాలను అర్థం చేసుకోగల్గినప్పటికి, అది ఒక క్రమ పద్ధతిన ఉంటే సహాయకారిగా ఉంటుంది.

మమ్ములను ఆహ్వానించినందులకు హైదరాబాదు అభ్యాసులకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. అయితే, ఇతర ప్రాంతాలనుండి వచ్చినప్పుడు, వారి పట్ల మన బాధ్యత ఏమిటి?. ఎప్పుడు పడితే అప్పుడు చెప్పకుండా వచ్చి శరీరానికి బూడిదపూసుకొని పోవడానికి ఇదేమి సన్యాసుల మఠం కాదుగదా?. మనమంతా బాధ్యతగల గృహస్థులం. బాధ్యతను గుర్తించాలి. కార్యకర్తలకు ముందుగానే మనం ఎంతమంది వస్తున్నామనేది తెలియచేస్తే, వాళ్ళుకూడా భోజన వసతులు అందుకు తగినట్లుగా ఏర్పాటు చేయడానికి సులభంగా ఉంటుంది. ఉన్నట్లుండి 20 మంది

అర్థరాత్రి వచ్చి భోజన వసతులు కావాలని వారికి అసౌకర్యం చేస్తాము.వారు ఆహ్వానించారనుకొండి. మనం వచ్చాము, అయితే వారికి మనం అసౌకర్యం కలుగ చేయకూడదు. వారికి భారం కాకూడదు. అందువల్ల ఇలాటి అనేక విషయాలలో మనం కూడా కొంచెం వివేకంతో ఆలోచించాలి. మనం వివేకంతో తెలివిని ఉపయోగించచక పోతే, పూజ చేస్తున్నందుకు అర్థమేముంది? నేను పది సంవతసరాల నుండి అభ్యాసంచేస్తున్నాను, నీకంటే ఐదు సంవతసరాలు ముందే నేను అభ్యాసిని అంటే ఉపయోగమేమి? పురోభివృద్ధి అనేదాన్ని సంవతసరాలను బట్టి నిర్ణయించలేము.

గురువుగారు వచ్చినప్పుడు ఆయన్ను కదలనీయకుండా మనం అసౌకర్యానికి గురిచేస్తుంటాము. దీన్ని గురించి కొంచెం ఆలోచన చేయండి. మీరు బుద్ధిపూర్వకంగా చేస్తున్నారని కాదు. పది మంది అనుసరించే పద్ధతినే మీరు కూడా చేయాలను కొంటారు. ఒకడు ఆయన పాదాలను తాకి నమస్కారం చేస్తాడు. మిగతవారంతా అదే ప్రకారం చేస్తారు. పాదాలను తాకడమనేదానికి నేనేమి వ్యతిరేకిని కాను. కాని, తెలివిని, వివేకాన్ని విస్మరించి యాంత్రికంగా ఆ పని చేస్తూవుంటే అదే ఒక చిరాకు కలిగించి ఇబ్బందిని కలుగజేసిన వారమవుతాము. గనుక నేను చెప్పదలచినది ఏమంటే, మనం ఏదైనా సాధన చేస్తూవుంటే, అది మన వివేకాన్ని అభివృద్ధి చేయాలి. మానసిక వికాసాన్ని కలుగజేయాలి. ఈ రెండూ అభివృద్ధి చెందక పోతే ఏదో లోపం ఉన్నదని, ధ్యాన పద్ధతి సరియైనది కాదని, లేదా, సహజమార్గ పద్ధతి ననుసరించి ధ్యానం మీరు చేయడం లేదని గ్రహించండి.

ప్రశిక్షకుని (ప్రిసెప్టరు) వద్దకు ఏకాంతంగా వెళ్ళు. నీ సమస్యలను, కష్టాలను తెలియజెయ్యి. అతను నీకు సహాయకారిగా ఉండగలడు. మనం జడత్వాన్ని పోగొట్టుకోవాలి. గురువులమని చాటుకొంటూ 'నా పాదాలపైపడాలి, అప్పుడే నీకు స్వర్గంలోకి అడుగు పెట్టడానికి అనుమతిస్తా'నని చెప్పేవాళ్ళు ఉన్నారు.. అసంబద్ధమైన ఉపన్యాసాలు విన్నందువల్ల అనాగరికమైన ఆలోచనలు మనసుల్లో నాటుకొని పోయినాయి. అందువల్ల మూర్ఖత్వం చెందింది. ఈవిధమైన ఆలోచనలవల్ల ఏర్పడ్డ ముద్రలను తుడిచిపారేయాలి.. ఇది చాలా అవసరం. వీటిని కడిగి పారేసేవరకు, జడత్వాన్ని, గందరగోళాలను నిర్మూలంచేసే వరకు మీరు సత్ఫలితాలను ఆశించడానికి అస్పదం లేదు. సమర్థవంతుడైన గురువు లభించినప్పుడు, ఒక్క క్షణంలో అడగిన తక్షణమే మనకు ఉన్నత స్థితులను ప్రసాదించవచ్చు. అయితే పవిత్రత కలుగ చేసుకొనే విషయమేమిటి? ఇందుకు మనము తగిన వారమేనా? అట్టి అర్హత కలుగజేసుకోడానికి మనమేదైనా కృషి చేసామా? ఆయనకు మనం సంపూర్ణంగా అర్పణ చేసుకొన్నామా? ఆయన సూచనలను, ఆదేశాలను సంపూర్ణంగా ప్రతి విషయంలోనూ ఆచరించడానికి సిద్ధంగా ఉన్నామా? యాంత్రికమైన పాత ఆలోచనలను వదలి వేయడానికి తయారుగా ఉన్నామా?

అయ్యా , సహజ మార్గం పిరికి వాళ్ళకు కాదు. అది సింహంలాంటి ధైర్యవంతులకే. ఆధ్యాత్మిక చరిత్రలో ఒక పెద్ద క్రాంతికారకమైన మార్పు రాబోతున్నది. నూతనమైన గొప్ప

విప్లవాత్మకమైన పద్ధతిని మీకు అందించ బోతున్నారు. అందుకు సిద్ధంకండి. జడత్వంతోనే ఉంటామని అంటే ఇదంతా మీకు కాదు.

ప్రియమైన సోదరా, ఆధ్యాత్మిక రంగంలో శీఘ్రగతిన పురోభివృద్ధి చెందాలంటే, ఒక్కసారిగా ధృఢ సంకల్పం మనం చేయవలసిందే. మనం దానినే కోరుకోవాలి గురువులమని చాటుకొనేవారి సలహాలవల్ల, మాయ మాటలవల్ల, మన మనసులో కరుడు కట్టుకొని పోయివున్న పాత అభిప్రాయాలు, నిర్ణయాలు, జడత్వము, మందత్వము మొదలయినవాటి నన్నింటిని పారద్రోలాలి. వాళ్ళ వశీకరణంనుండి విడుదలవ్వండి. మూలమేదైతే ఉన్నదో, దాన్ని మాత్రమే పొందాలని కోరుకోవాలి. మూలమును లక్ష్యంగా మీముందు ఉంచుకోండి. లక్ష్యాని దృష్టిలో పెట్టుకోండి. మన కోర్కెలే లక్ష్యానికి అవరోధాలు. అదే సూత్రము. మన కోర్కెలే మన పురోభివృద్ధికి అటంకాలుగా ఉన్నాయి. ఆయన సహాయమే లక్ష్యాన్ని చేర్చగలదు.

ప్రతి రోజూ ఈ ప్రార్థన చేయాలి. 'ఓ నాథా, నీవే మానవ జీవనానికి లక్ష్యము, మాకోర్కెలకు మేము బానిసలమై ఉన్నాము. అవే మా పురోభివృద్ధికి అటంకాలుగా ఉన్నాయి. నీవే శక్తివి, నా ఇష్ట దైవము నీ సహాయము వల్లనే నిన్ను పొందగలము.' అయన సహాయము లేనిదే మనం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. అదే మనం కోరాలి. ఏవిధమైన మర్మముగాని, సంకోచముగాని లేకుండా మనల్ని మనం అర్పించుకోవాలి. చేతులారా మనకై మనం

చేసుకొన్నవాటిని వదలించుకోడానికి సాధ్యమయినంత వరకు మనం పాటుపడడానికి సుముఖంగా ఉండాలి.

గురువుగారి శ్రమ తగ్గించడానికి సాధ్యమయినంత వరకు మనంచేయగల్గినంత చేస్తూవుండాలి. చెప్పవలసిన విషయాలు చిన్నవి, పెద్దవి అనేకములున్నాయి. వాటినన్నింటిని గురించి చెప్పాలంటే చాలా శ్రమతో కూడిన పని. ధోవతి కట్టుకోవలెనా లేక ప్యాంటు వేసుకోవలెనా, లేక చొక్కా తొడుక్కోవలెనా మొదలయిన అనేక చిల్లర విషయాలను గురించి మీకు మీరే నిర్ణయించుకోవచ్చు. ఇతరులకు కష్టము కలిగించకుండా మీకు సహాయకారిగా వుండే విషయాలను మీరే నిర్ణయించుకోవచ్చు. అందువల్లనే వివేకము అభివృద్ధి చేసుకోవాలనేది. సక్రమమైన పద్ధతిలో సాధన చేస్తూఉంటే, మీ వివేకమే మీకు సహాయం చేయాలి. పద్ధతి సరియైనదిగా ఉండాలి. దాన్ని సరియైన విధంగా అనుసరించాలి. ఈ రెండు విషయాలు ముఖ్యము. అన్నింటికంటే, సహజమార్గపద్ధతి శ్రేష్ఠమైనది. దాన్ని అందరు అభ్యాసులు పరీక్షించారు. అవగాహన చేసుకొన్నారు. వారికిది చాలా శ్రేష్ఠమయిందని గ్రహించారు.

కాబట్టి, ప్రియమైన సోదరులారా, నేను అభ్యాసులకు ప్రత్యేకించి చెబుతున్నాను. శీఘ్రగతిన పురోభివృద్ధి చెందాలని సాధన మీరు చేస్తున్నారు. శీఘ్రగతి అంటే అర్థమేమి? ఎంతవరకు మనం పురోభివృద్ధి చెందినాము? మీరే ఆలోచించాలి. మీరు మళ్ళి,మళ్ళి ఆలోచించాలి. ప్రశిక్షకుని వద్ద కూర్చొని, చర్చించి సరిచూచుకోవాలి.

మీ ఆలోచన మీ నడవడికలో ప్రతిఫలించాలి. నడవడిక సరియైనది కాకుండావుండి, దాన్ని సరిచేసుకోకుండా, మార్పు చెందకుండా ఉంటే, ధ్యాన సాధనలో పొరబాటు ఉన్నట్లే. కోర్కెలు అంతర్థానం చెందాలి, లేదా కనీసం కొద్దికొద్దిగానైనా తగ్గుముఖం పట్టాలి. మనము లక్ష్యం వైపుకు పోవాలి. ఉన్నత దిశగా లక్ష్యంవైపుకు ఎదిగి పోతూ, లక్ష్యానికి దగ్గరవుతూ ఉండాలి. లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని హృదయంలోని అవరోధాలను తీసివేసుకొంటూ ఉండండి. ప్రశిక్షకునికి, ఉన్నతమైన ప్రశిక్షకునికి (గురువు) సంపూర్ణంగా అర్పణ గావించుకోవాలనే ఇచ్ఛాశక్తిని బలోపేతం చేసుకోండి. దానికి ఆటంకాలుగా ఉండే వాటినన్నింటిని తొలగించుకొండి. ఇదే మిమ్మల్ని ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయిలకు చేర్చడానికి సహాయకారిగా ఉండేది.


ఈ మాటలతో నా సంభాషణ ముగిస్తున్నాను.

సమర్థ సద్గురు శ్రీ రాంచంద్రజీగారు 14 జూన్ 1971 హైదరాబాదుకు విచ్చేసినప్పుడు శ్రీ రాఘవేంద్రరావుగారు చేసిన ప్రసంగము.

ఓం శాంతి

## "CATCH THE SPIRIT"

From the Book 'Call of the fellow traveler.' (page 21)
Written by **Pujya Sri. Raghavendra Rao.** Raichur



# (8) గురువు - రహస్యము

## (8) Master the Secret

ప్రియమైన సోదర సోదరీమణులారా,

పరమపూజ్య గురువుగారి 79వ జన్మ దినోత్సవాల సందర్భంగా ఇక్కడికి వచ్చినందుకు, కార్యవర్గ అద్యక్షుడుగా మీకందరికి స్వాగతం పలుకుతున్నాను. మీకందరికి శుభం కలుగుగాక అని కోరుకొంటున్నాను.

గురువుగారు మన సమక్షంలో ఉన్నారు. గురువుగారి జన్మ దినోత్సవాలు జరుపుకోడానికి ఇక్కడ సమావేశమయినాము. గనుక చిరకాలము ఆయన ఆయురారోగ్యములతో ఉండడానికి మనమందరము ప్రార్థనా స్థితిలో ఉండడమనేది మన కర్తవ్యము. అంతే గాక, ఆయనకు ఏ విధమైన శ్రమ, అలసట కలుగకుండా, ఏవిధమైన ఒత్తిడి ఆయనపై బడకుండా గమనించుకోడమనేది మన ముఖ్య బాధ్యత. ఆయన మన శ్రేయస్సు కోరి ఇప్పుడు, ఎల్లప్పుడు ప్రత్యేకించి పని చేస్తున్నారు. అందుచేత మనం ఏ కొంచెం ఒత్తిడి కలుగజేసినా, ఆయన చేస్తూవుండే కార్యక్రమానికి అలసట కలుగ జేసినవార మవుతాము. నిన్నటి రోజు ఆయన

ఇక్కడికి వచ్చినప్పుడు నాలుగడుగులు వేయగనే ఎంతో బల హీనతకు గురి కావడంతో. వెంటనే ఆయన్ను ఇంటికి తీసుకెళ్ళారు.

గనుక, మన సమక్షంలో ఆయన ఇక్కడ ఉన్న సమయంలో సత్ఫలితాలు పొందడానికి మీకు ఒక విశిష్టమైన పద్ధతి చెప్తాను. అది రహస్యమైనది. అయినా మీకు అవగాహన కలిగేట్లుగా నేను ప్రయత్నం చేస్తాను. దాన్ని బహిర్గతం చేయడానికి ప్రయత్నిస్తాను. చాల రహస్యమైనదని చెప్పినది ఏమనగా అది 'మౌనమే.' అయినాకూడా, ఆయనపై ఏవిధమైన ఒత్తిడి, అలసట కలుగజేయకుండా మన అధ్యాత్మిక ఉపయోగార్థం ఈ అవకాశాన్ని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవచ్చునో విశదపరచడానికి నే ను ప్రయత్నం చేస్తాను. గనుక మౌనంతో మీ హృదయంలో ప్రార్థనా స్థితిని, మరియూ గ్రహించే శక్తిని పెంపు చేసుకొనండి. ప్రియమైన సోదర సోదరీ మణులారా, మీరు నన్ను అర్థంచేసుకొంటున్నారా?

మీరందరు క్రమంతప్పని అభ్యాసులనిన్నీ, మీకు సహజమార్గ పద్ధతిన అభ్యాసం ద్వారా అనుభవాన్ని పొందే విధానం తెలుసునని భావిస్తున్నాను. మీలో ఎవరికైనా కొంతమందికి తెలియకపోతే అదిచేయడం తెలుసుకొవచ్చు. అయితే ఇప్పుడు నేను, ప్రత్యేకించి సాధన చేయడం తెలిసిన వారి నుద్దేశించి చెపుతున్నాను. ఇప్పుడు అధ్యాత్మిక పెరుగుదలకు ఈ సందర్భాన్ని ఎంత సద్వినియోగం చేసుకో వచ్చునో గమనించాలి. గనుక నేను

చెప్పినట్లు, ప్రతి అభ్యాసి ఈ రహస్యంపై ఆధిపత్యం పొందాలి. ఎందుచేతనంటే, అదే మనలో ప్రతివానికి కర్తవ్యమై ఉంటున్నది. దాన్ని జన సమూహంపై వెదజల్లవచ్చు. మనం రాళ్ళవలె కాదు. మనం దాన్ని స్వీకరించవచ్చు, లేదా తిరస్కరించవచ్చు. రాళ్ళవలె తిరస్కరిస్తే అది పడిపోయి అంతర్ధానమై పోతుంది.

ఇక్కడ మనకు సాధన అనేది ఉంది. సంపూర్ణంగా అనుగ్రహాన్ని పొందే విధంగా సాధన చేయవచ్చు. గనుక మీహృదయాలను తెరవండి. ఒకే ఒక్క గురువును తప్ప యితర విధములైన అన్ని కోర్కెలను తొలగించివేయండి. అయన నుండి పొందడానికి అయనపై ఏలాటి ఒత్తిడి కలగజేయకండి. అయన్ను స్వేచ్ఛగా వదలండి. మన అర్హత సామర్థ్యాలను బట్టి ఎంతవరకు ఇవ్వాలో ఇవ్వనియ్యండి. మనం అర్హత సామర్థ్యాలను వృద్ధి కావడానికి కృషి చేద్ధాము. అది మన కర్తవ్యము. అది ఏవిధంగా చేయడము? హృదయాన్ని పవిత్రంగా చేయడమే. అన్ని కోర్కెలను బహిష్కరించండి. జడత్వాన్ని హృదయంలోనుండి సమూలంగా తీసివేయండి. అన్ని విధాలైన సంస్కారాలను, చిరాకు, గందరగోళంగా ఉండే చింతనను తోసివేయండి.

సహజమార్గం చాలా సులభమార్గం. సరళమైనది. నీసాధనతో నైపుణ్యం వృద్ధిచేసుకోవాలి. గనుక అయన్ను స్మరించండి. ఎంతవరకు అయన సేవలో ఉండగలమో ఆలోచనచెయ్యండి. అయితే అది భౌతిక సేవ కాదు. మనలోని

ప్రతి ఒక్కరు ఆయన్ను శారీరకంగా పైకి లేవనెత్తడానికి ప్రయత్నంచేస్తే ఆయన్ను ముక్కలు ముక్కలుగా చేసినట్లే అవుతుంది. అది సరైన పద్ధతి కాదు. అందరు ఒకే సారి ఒకే పనిని చేయలేరు. అవిధంగా చేస్తే మనం ఏమి సాధించలేము. ఇది ప్రాపంచికంగాకూడా అంతే. గనుక ఏది మంచిదని అనిపిస్తే, ప్రాపంచికంగా ఆయనకు సహాయం చేయడానికి అందరు ఒకేసారి ప్రయత్నం చేయకండి. మీరందరు అభ్యాసి సోదర సోదరీ మణులు గనుక ఏదైనా పలానా విషయంగా సహాయం కావలసినప్పుడు మీయొక్క సహాయ సహకారం కావాలని సంకోచం లేకుండా మేము మిమ్మల్ని కోరుతాము. ఆవిధంగా మేము కోరనప్పుడు లేదా ప్రత్యేకించి ఫలానిది చేయమని అడగనప్పుడు, మీరందరూ ఉత్సాహంతో అటూ ఇటూ ఎగురుతూవుంటే అది చీదర పుట్టించడమే గాక, జరగవలసిన పని సజావుగా జరగడానికి ఆటంకంగా తయారవుతుంది.

ఇక్కడ మన సోదర సోదరీ మణులు వారికి చేత నయినంత మేరకు చేసారు. మన సంస్థ వృద్ధి జెందుతున్నది. ఎంత వరకు హద్దుఏర్పరచినా అది చాలదు. ప్రపంచం యావత్తు విస్తరిస్తున్నాము. గనుక హద్దులుగల స్థళం ఎప్పుడూ పరిమితం గానే ఉంటుంది. అట్టిది ఎప్పుడూ నిండిపోయి బయటికి ప్రవహిస్తూనే ఉంటుంది. గనుక మీరందరూ ఇప్పుడు ఏవిధంగా ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మకంగా పాలుపంచుకొని, వీలైనంత

వరకు ఏవిధంగా సేవ చేసి లాభం పొందాలనే విషయాలు మీరు నిర్ణయించుకోవాలి. ఇటువంటివి సామూహికంగా ఆవేశంతో చేసేవి కాదు, చేయలేముకూడా.

ఆధ్యాత్మికత అనేది ఆత్మవిద్య. ఇది మీలో ప్రతి ఒక్కరికోసం గనుక, దానికొరకు మీరే మార్గాన్ని కన్గొనాలి. మీకు మీరే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సాధనా పద్ధతులు ఉన్నాయి, ఏవైనా రహస్యమంటూ వుంటే గురువుగారు వాటిని గురించిన వివరాలన్ని మీకు, నాకు మనబోటి సామాన్యులందరికి అందజేయడానికి శాయశక్తులా ప్రయత్నంచేస్తూనే ఉన్నారు. అయినాకూడా అదంతా మౌనమే. దానిమీద మనం అభివృద్ధిచెందాలి. అది ధ్యానసాధన ద్వారా చేయాలి. మన సహజ మార్గంలో ఇది చాల సులభము, మీకందరికి అనుభవమే. దివ్య తేజసుున హృదయంలో ఉన్నదనే భావనతో కళ్ళుమూసుకొని సహజరీతిన చింతన చేయండి. మానసికంగా ఏవిధమైన ఊహలు చేయవద్దు. ఆ విధంగా ఊహిస్తే అది సహజమూ కాదు, వాస్తవమూ కాదు. అంతర్ముఖంగా ప్రయాస పడడము, పోరాడడము మొదలయినవి చేయవద్దు. సౌమ్యంగాను, సరళంగాను సులభరీతిన కూర్చొని ధ్యానం చేయండి. భగవంతుని అనుగ్రహం కోసం మీరు నిరీక్షిస్తున్నారు. ఇది అభ్యాసం చేయండి. మీరు అయిదు నిమిషాలో, లేక ముప్ఫై నిమిషాలో చేస్తుండవచ్చు. కాని, ఉన్నతమైన సత్ఫలితాలు పొందాలంటే ఉదయం ఒక గంట సేపు కూర్చొనండి. ఈవిధమైన అభ్యాసం చాల అవసరం. తర్వాత

మీకందరికి తెలిసినట్లుగా సాయంత్రం మాలిన్య నిర్మూలన (శుద్ధి) కార్యక్రమం ఉంది. అది మీరు చేయండి. దీని తర్వాత ప్రార్థన. అన్నింటిలో అత్యున్నతమైనది, ప్రధానమైనదీ ప్రార్థన. సహజ మార్గంలోని మన ప్రార్థన యితర మతీలలోవలె దేవుళ్ళను, దేవతలను పొగడడము, స్తోత్రము చేయడము ఉండదు. మన ప్రార్థన చాలా అద్భుతమైనది. ఇదిమన లక్ష్యాన్ని గురించిన్నీ, మార్గమందు ఉండే ఆటంకాలను గురించిన్నీ, ఎవరినుండి సహాయము లభించేది, ఎవరికి మనం అర్పణ కావించుకోవలసినది తెలియజేస్తుంది. ప్రార్థన అనేది కేవలం మాటలవరకే పరిమితం కాదు. అందులోని మాటలు, వాక్యాలు వాటికి ఉండే అర్థాలు ఉన్నప్పటికి, అది వీటికన్నింటికి అతీతమైనదిగా ఉంటూ, వీటి అన్నింటి యొక్క ఉద్దేశ్యముకూడా అందులో ఇమిడి ఉంది. అయితేకూడా ఈ మాటలకు, వాక్యాలకు అతీతంగా భావము, స్థితిని గురించి ఉంటుంది, మాటలు రాలిపోయినప్పుడు, భావంకూడా అంతర్ధానమైనప్పుడు ప్రార్థనా స్థితిలో లయావస్థ చెందినప్పుడు నీవు ఆ ప్రార్థనా స్థితిలోనే నిద్రపోతావు. అప్పుడు అట్టి నిద్ర మామూలు పశులక్షణం కల్గిన నిద్ర కాకుండా, ప్రార్థనామయ నిద్రగా రూపొందుతుంది. సరియైన పద్ధతిలో నిద్రావస్థను ఉపయోగ పెట్టడమనేది ఇదే.

జంతువులకంటే మానవులు ఉన్నతమైనవారు కాదని శాస్త్రజ్ఞులు మనకు చెప్పారు. ఆ మాట ఎట్లున్నా, మానవ

జీవితానికి ఒక ప్రత్యేక లక్షణం ఉంది. మనం ఆలోచించ గలము, ఆలోచనా శక్తివల్ల మనలోని పశులక్షణమైన బంధములనుండి ఉన్నతమైన స్థితికి చేరుకోగలము. పశు లక్షణాలు ఉన్నాయి, సందేహం లేదుకాని, అంతకంటే విశిష్టమైనదికూడా ఉంది. మనకు ఏ వస్తు విషయాన్ని గురించి అయినా ఉత్తమంగా గమనించే సామర్థ్యం సహజంగానే ఉంది. అదే లక్ష్యం. ఇట్టి పరిణామస్థితి మనం పొందాలి. అందుకొరకు మనకు మనమే సిద్ధంకావాలి - అంటే ప్రార్థనా స్థితిని వృద్ధిచేసుకోవాలి

అందుకు పద్ధతి ఏమి ? నేను ఇప్పుడు చెప్పినదే పద్ధతి. పడుకొనబోయేముందు నీ నిద్రను ప్రార్థనా స్థితిగా మార్చుకో. దీన్ని అభ్యాసం చెయ్యి. ఎప్పుడయితే చేయడానికి నీకు ఆ నేర్పు (సామర్థ్యం) లభిస్తుందో అప్పుడు నీవు ఎల్లప్పుడు ప్రార్థనా స్థితిలోనే ఉండగలవు. ఇది ఏర్పడినప్పుడు దైవానుగ్రహాన్ని పొందడానికి నీవు సిద్ధంగా ఉంటావు. అప్పుడు నీవు దైవానుగ్రహాన్ని తప్పని సరిగ స్వీకరించి, ఆస్వాదించి ఆకళింపు చేసుకొని జీర్ణంచేసుకొంటావు. నీవు దానికి తగిన అర్హత కలిగిన వాడవవుతావు. నీయొక్క సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోడానికి అదే పద్ధతి. మీలో ప్రతి ఒక్కరు ఈ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. గనుక, నేను ముందు చెప్పినట్లు, మనమందరము ఇక్కడ ఒక లక్ష్యంతో సమావేశ మయ్యాము. ఎవరి జన్మదినాన్ని మనం జరుపు

కొంటున్నాము ? దాన్ని గమనించి ఆయన్ను పదే పదే సంతోషంగా, సౌకర్యంగా , సుఖంగా ఉండేట్లు చూద్దాము.. ఆయన సంతోషంతో ఉండాలి. మనం చేసే పూజ, ఆరాధనలవల్ల దేవుళ్ళు,నిజంగా సంతోష పడుతున్నారో లేదోకూడా మనం గమనించకుండా చేసే మతపరమైన పూజ కాదు మనం ఇక్కడ చేసే పద్ధతి. అక్కడ దేవుడెవరో తెలియదు. ఆదేవుడు సంతృప్తి చెందుతున్నాడో, సంతోషిస్తున్నాడో తెలియదు. మనకు మనమే సంతృప్తి పడతూ పూజ చేస్తూనే ఉంటాము. అటువంటి ఆలోచనా పద్ధతిని మనం అలవాటు చేసుకొన్నాము. మనం ఇక్కడ ఈ స్థితినుండి పైకి ఎదగాలి. దయచేసి యిది గమనించండి. దైవానుగ్రహాన్ని పొందడానికి మనం సాధన చేయాలి. అందుకోసం దైవం కూడా సంతృప్తి చెందాలి.

ఇక్కడ భగవదనుగ్రహమనేది గురువు గారి రూపంలో మనకు లభ్యమయి ఉంది. ప్రిసెప్టర్లు (ప్రశిక్షకులు) గురువు గారు ఏర్పరచారు. మీరు చేసే పూజవల్ల భగవంతుడు సంతృప్తి చెందుతున్నాడా లేదా అనే విషయం వారు మీకు విశదీకరించి తగు విధంగా దారి చూపిస్తారు. భగవంతునికి ప్రీతి దాయకం కాని పక్షంలో, ఏవిధంగా ఆయన్ను సంతోషపరచి అనుగ్రహం పొందగలమో చెపుతారు. సహజ మార్గంలో ఉండే విశిష్టతను గమనించండి. -- అదే ప్రాణాహుతి. అనుగ్రహాన్ని ప్రసారితం చేయవచ్చు. దాన్ని మీలో ప్రతి ఒక్కరు పొంది ఉన్నారు.

అనుగ్రహాన్ని ఎప్పుడయితే ప్రసారితం చేయబడిందో దాన్ని మీరు సరియైన పద్ధతిలో పొందినారనిన్నీ, దైవాన్ని సంతోష పరచినారనిన్నీ అర్థం. అనుగ్రహమనేది ఉంది - యోగ శక్తి ప్రసారితమనేది ఉంది. - భగవంతుడిని పొందడానికి అది సహాయం చేస్తుంది. అదే లక్ష్యం. ఇతర విధములైన చిల్లర కోర్కెలు తీర్చుకోడానికి దారితీసే లక్ష్యం కాదు మన లక్ష్యం. మన పురోభివృద్ధికి ఆటంకాలుగా ఉండే ఎన్నోవిధాలైన కోర్కెలు ఉండవచ్చు. పరస్పరం వ్యతిరేకములైన పలు చిల్లర కోర్కెలు తీర్చుకోడంలో మనలోని సమస్త శక్తి చెల్లాచెదరై, ఘర్షణ, అశాంతి సృష్టించి తద్వారా మన విచక్షణా శక్తిని కూడా పోగొట్టుకొంటున్నాము. లక్ష్యమనేది మన ముందున్నప్పుడు, అన్ని విధములైన మన చర్యలు సక్రమమైన పద్ధతిలోకి తీర్చిదిద్దబడుతాయి.

ఓం శాంతిః

"Master the Secret"
From the Book 'Call of the fellow traveler.' (page 34)

# (౯) ప్రార్థన మరియు ధ్యానము
# (9) PRAYER AND MEDITATION

ప్రియమైన సోదర సోదరీమణులారా,

మన ధ్యాన పద్ధతిని గురించి, దాన్ని ఎందుకు చేస్తున్నామనే దాన్ని గురించి కొన్ని అంశాలను మీముందు ఉంచుతున్నాను. చాలమంది అభ్యాసులు నాకు తారస పడుతూ ఉంటారు. ఎందుకు మీరు ధ్యానం చేస్తున్నారని అడిగితే వారు జవాబు ఏమనిచెప్పాలని ఆలోచన చేస్తూ ఏజవాబు ఇవ్వలేని స్థితిలో ఉంటారు. ఏదో ఒకవిధమైన యోగాభ్యాసం చేస్తూఉండే కొంతమందిని చూచాను. ఎందుకు చేస్తున్నారని అడిగితే, అస్పష్టమైన జవాబు యిస్తారు. ధ్యాపం ఎందుకోసరు చేస్తున్నామనేది తెలుసుకోడం చాలీ ముఖ్యం. ఉన్నతమైన స్థాయి మన లక్ష్యంగా లేకపోతే మన ప్రయత్నమంతా వృధా అయిపోతుంది లేదా అది కేవలం ఆహ్లాదంకోసం చేసే కార్యక్రమం అయి, అవి ఇంకా జడత్వాన్ని సృష్టిస్తాయి. గనుక దయచేసి ఎందుకు మనం ధ్యానం చేస్తున్నామో అవగాహనకు తెచ్చుకొండి.

ప్రార్థన అందుకొరకే మన ముందు ఉంది. ప్రార్థనలో అన్నాన్ని గురించి విపులంగా చెప్పబడింది. అంతిమ లక్ష్యమేమిటో, మూలకారణ మేమిటో, ఆధార మేమిటో, ఆటంకాలేమిటో, అందులో తెలియ జేయబడినాయి. గనుక ప్రార్థనతో ధ్యానం

ప్రారంభించడము గుర్తు ఉంచుకొండి. అప్పుడు తెలిసి చేసిన వారవుతారు. అందువల్ల మీకు అవగాహన చేసుకొనే శక్తి ఎక్కువవుతుంది.

అనేక మతాలలో పలు విధాలైన ప్రార్థనలు నేను చూచాను. వాటిని నిశితంగా పరిశీలన చేస్తే, అవి ప్రాపంచికంగానో, లేదా బాధలు, కష్టాలను తొలగించు కోడానికో ఉద్దేశింప బడినవే. సహజ మార్గంలో, మన లక్ష్యం బగా స్పష్టంగా ఉంది. అట్టి లక్ష్యముతో, శాశ్వతంగా అనుసంధానం కల్గిన వ్యక్తి మనకు ఉన్నాడు. అతన్ని మన లక్ష్యంగా చేసుకో గలిగి, అయనతో మనం సంబంధం ఏర్పరచుకొంటే అధ్యాత్మిక పురోభివృద్ధి మనకు కలుగుతుందని మనం ఆశించవచ్చు. ఆవిధంగా కాకపోతే ఈ ధ్యానమే మన ఉద్దేశాన్ని పాడుచేపి, సంస్కారాలు తోలగి పోయే మాట అటుంచి, అవి ఇంకా ఇంకా అవాంఛనీయమైన సంస్కారాలను కూడా సృష్టిస్తుంది. ప్రార్థనంటే మీకు ఒక అభిప్రాయం ఉండవచ్చు. ఇది లక్ష్యాన్ని గురించిన అభిప్రాయం కలుగజేస్తుంది. అందువలన బాగా అర్థం చేసుకోడానికి బాగా ఆలోచన చేయాలి. తర్వాత ప్రార్థనా స్థితిని అభివృద్ధిచేసుకోడానికి ఈ అర్థాన్ని కూడా మరచి పోవాలి. పడుకొనబోవు సమయంలో ఈ పద్ధతినే నిర్దేశింప బడింది. క్రమంగా వినమ్రత చేకూర్తూ ఉంటుంది. పశులక్షణాలతో కూడిన నిద్ర, సూక్ష్మస్థితియైన ప్రార్థనా స్థితిగా రూపాంతరం చెదుతుంది. ఇట్టి ప్రార్థనా స్థితి మీలోని అవగాహనా శక్తిని వృద్ధి చేస్తుంది. అందువల్ల, ఇట్టి ప్రార్థనా స్థితిని

వృద్ధి చేసుకొంటే, మీ ఆధ్యాత్మిక పురోభివృద్ధి తప్పకుండా శరపరంపరలుగా ముందుకు సాగి పోవలసిందే.

గనుక, ఈ ప్రార్థనకు రెండు విధాలైన ఉద్దేశ్యములున్నాయి. నీ లక్ష్యాన్ని గుర్తు చేస్తుంది లేక, నీవు సాధించవలసినదాన్ని గుర్తుచేస్తుంది. అంతేగాక, అది ఎల్లప్పుడు గురువుగారిని చూపిస్తుది, లేదా జ్ఞాపకం చేస్తుంది. దానితోపాటే ప్రార్థనాస్థితిని అభివృద్ధి కావడమేగాక, జడత్వమంతా తొలగింప బడుతుంది.

మీలో ప్రతి ఒక్కరు ధ్యానంలో ఏమి జరుగుతున్నదిని గమనించి యుండవచ్చు. అంతర్ముఖంగా అణచిపెట్ట బడిన ఆలోచనలు, కోర్కెలు, ఇంకా చాలా విధములైన సంస్కారాలు మనసులోకి వస్తూ ఉంటాయి. అవి ధ్యాన సమయంలో నీ ఎరుకలోకి వచ్చి, తొలగింపబడుతాయి. కొంతకాలం ఈ క్రమంలోనే జరుగుతుంది. వాస్తవంగా ఇది నిర్మలంగా చేయడమే. ధ్యాన సమయంలో నీవు ఆలోచనలతో సతమవుతూ ఘర్షణ పడవలసిన అవసరమూ లేదు, అవి ఉన్నందున నీవు నిరాశ, నిస్పృహ చెందనవసరమూలేదు. ధ్యానమయిన తర్వాత నీవు ఆలోచనలను జ్ఞప్తికి తెచ్చుకోవాలని ప్రయత్నంచేస్తే, నీవు బహుశః ఒకటి లేక రెండు ఆలోచనలు గుర్తు ఉండవచ్చు. ఈ విధంగా ధ్యానకాలంలో ఆలోచనలు తరిగి పోవడమనేది శుద్ధి కావింప బడుతున్నదని అనడానికి నిదర్శనము.

గనుక, ఒక క్రమ పద్ధతిన ధ్యాన సాధన అత్యవసరము. సహజమార్గంలో నిర్దేశింపబడిన ఈ పద్ధతి చాలా సులభము. ఎంతో సులభము. ఇతర పద్ధతులలో సాధన చేసినందుల్ల కష్టతరం చేస్తున్నాము. మనకు ధ్యానాన్ని గురించి అనేక అభిప్రాయాలున్నాయి. వాటివల్ల అనేక సమస్యలు సృష్టించు కొంటున్నాము. మన ధ్యానముకూడా ఇతర సిద్ధాంతాలతో ఏకీభవించేట్లుగానో, లేక ఇమిడేట్లుగానో ఉండాలని అనుకోవడంవల్ల అసలు సత్యమేమిటో మరచి పోతున్నాము. అపసవ్యమైన ఆలోచనలతోనూ, దురభిమానాలతోనూత సత్యమనే దానిని మూయబడి ఉంది. గనుక మనం సత్యాన్ని చేరవలెనంటే మనం ధైర్యంగా ఉండాలి. అప్పుడే అది మీకు శీఘ్రంగా తెలుస్తుంది. ఈ సాధనా పద్ధతివల్ల అతి త్వరగా గ్రహించగలుగుతారు.

ఆలోచనలను అపసవ్యంగా ఉపయోగించినందు వల్ల మనం సంస్కారాలను కలుగ జేసుకొంటాము. ఈ ఆలోచనను సవ్యంగా ఉసయోగించుట ఎవల్లనే మళ్ళీ మన సంస్కారాలను తొలగించుకోగలము. యోగశక్తి ప్రసారితమనేది ఆలోచనా శక్తి వల్ల కలుగుతుంది. ఆధ్యాత్మిక పురోభివృద్ధి ఈ ఆలోచనా శక్తి వల్లనే ఏర్పడుతుంది. ఈ పద్ధతి అంతాకూడా కేవలం ఆలోచనపైనే ఆధారపడి ఉంది. అదే బునాది. మన అదృష్టంకొద్ది, ఈ శక్తిపై సంపూర్ణ ఆధిపత్యం కల్గిన విశిష్ట వ్యక్తి మనకు ఉన్నారు. ఆయన ఆ మూలముతో అనుసంధానము గావించుకొని ఉన్నారు. సమస్త

జడత్వము, స్థూలత్వములనుండి స్వేచ్ఛను పొంది ఉన్నారు. మన ఆలోచన ద్వారా ఆయనతో సంబంధం కలిగి ఉంటే సూక్ష్మ స్థితులయొక్క వివిధ స్థాయిలను దాటుతూ ఇంకా సున్నిత మైన స్థాయిలు మనకు గోచరిస్తాయి.

మన మొట్ట మొదటి స్థితి దైవీకముతో ఉండినది. మన ఇంద్రియాలను, కోర్కెలను అదుపు ఆజ్ఞ లేకుండా వదలి వేసినందువల్ల, ఈ విధమైన క్లిష్ట సమస్యలను సృష్టించుకొన్నాము. అందువల్ల, ఇంద్రియాలన్నీ వాటి వివేకాన్ని కోల్పోయినాయి. మనిషి మనిషిగా కాకుండా కేవలం పశువుగా తయారయినాడు. అంతర్ముఖంగా మనం అనేక బంధాలను సృష్టించుకొని వాటినుండి బయట పడడానికి వీలు లేకుండా ఉంది. తప్పుడు సిద్ధాంతాలు, సద్ధతులద్వారా మనలో సృష్టించుకొన్న ఈ బంధాలన్నింటిని ఇప్పుడు తొలగించుకోడమే గాక కొత్త బంధాలు కలుగ జేసుకొకుండా ఉండాలి. ఇందుకు అత్యున్నతమైన మార్గమేమంటే, బంధరహితుడైన ఆయనతో మనం బంధం ఏర్పాటు చేసుకోవడమే. మనలోని బంధాలనుండి పూర్తిగా మనం విడుదల పొదగలిగాతే అప్పుడు మనము నిజమైన స్వేచ్ఛా జీవులమవుతాము. ఇది చాలా సులభము. నీకు నిజంగా కావాలని ఇచ్ఛ ఉంటే అది అత్యంత సులభమని గురువుగారు చెప్తారు. మనలోని జడత్వము మొదలయిన వాటిని తొలగించుకోవాలనిన్నీ, ఆకర్షణలకు, అహ్లాదాలకు గురిచేసే మానసిక స్థితులకు లోను కాకూడదనిన్నీ ధృఢ సంకల్పంచేస్తే ఇది చాల సులభము. ధృఢ సంకల్పంచేసి,

చాల సులభమైనట్టివి, ప్రతివారు పాటించ గల్గినట్టి గురువుగారి ఆదేశాలను అనుసరించండి. ఇట్టి లక్ష్యము స్థిరం చేసుకొంటే పురోగతి చాలా సులభంగా సాధించగలరు.

శీఘ్ర గతిన అట్టి పురోభివృద్ధి సాధించగలందులకు గురువుగారు మనందరిని అనుగ్రహించు గాక.

ఓం శాంతిః.

**"Prayer and Meditation"**

From the Book 'Call of the fellow traveler,' (page 34)
Written by **Pujya Sri. Raghavendra Rao.** Raichur

ఫిబ్రవరి, 1979, బసంత పంచమి

## (10) అభ్యాసి,- ప్రశిక్షకుడు,-మరియు గురువుగారి (ప్రాణాహుతి) యోగ శక్తి ప్రసారము

## (10) Abhyasi, Preceptor, Master's Transmission

ఎవరైనా సహజమార్గ పద్ధతిన ధ్యాన సాధన చేయాలనుకొంటే, అంతకంటే ముందు తన లక్ష్యమేమిటో ఖచ్చితంగా నిర్ణయించుకోడము చాలా అవసరం. లేకపోతే పొరపాటువల్ల గమనించినట్టి అసత్య విషయాలు, లోపభూయిష్టమైన అభిప్రాయాలు వల్ల తప్పుదారి పట్టిపోతాడు. భగవంతునితోగాని, లేదా, ఇంద్రియాలకు, మనసుఁకు, అహ్లాదాలకు, ఆకర్షణలకు, చివరకు అహం అనే భావనకుకూడా అతీతంగా ఉండే ఉన్నతమైన స్థితితోగాని సంపూర్ణ ఐక్యత పొందాలనేదే లక్ష్యంగా ఉండాలి. గనుక (ధ్యానసాధన చేపట్టిన) అభ్యాసి యైనవాడు ఇంద్రియ, మానశిక అహ్లాదాలకు సంతోషాలకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండడానికి తీర్మానించుకోవాలి. అప్పుడే గురువుగారి నుండి ప్రసారితమయ్యే ప్రాణాహుతి శక్తి అతనికి నిజమైన సహాయము చేస్తుంది.

మానవ సాధ్యమగు ఉన్నతోన్నతమైన స్థితిని పొందాలనే లక్ష్యం కల్గినవారు, శ్రీ రాం చంద్ర మిషన్‌లోని ప్రశిక్షకుని (ప్రిసెప్టరు) కలిసి వ్యక్తిగతంగా శిక్షణ పొందవచ్చు. ఇక్కడ ఒక విషయం తప్పని సరిగ అవగాహన చేసుకోవాలి. ప్రశిక్షకుడుకూడా అభ్యాసియే కాని గురువుకాదు., అయితే గురువుగారు ప్రత్యేకంగా

ప్రాణాహుతి పద్ధతి ద్వారా ప్రశిక్షకుడు సహాయకారిగా ఉంటాడు. గురువుగారి యోగశక్తి ప్రసారితము వల్ల తన ఆధ్యాత్మిక పురోభివృద్ధి జరిగేట్లుగా చూచుకోవాలేగాని ప్రశిక్షకుడిని అనుకరణ చేయడముగాని, లేదా అతని పొరబాట్లను లెక్కించడానికి ప్రయత్నం చేయ కూడదు.

ప్రశిక్షకుడుకూడా తన పురోభివృద్ధి పట్ల శ్రద్ధగా ఉంటూ తద్వారా అభ్యాసకులకేగాక ఇతరులుకూడా తన మంచి ప్రవర్తనవల్ల ప్రభావితులగునట్లు మసలుకొవాలి. అతని నడవడికవల్ల ఇతరులలో ప్రేమ, పవిత్రత భావాలను కలుగ చేసేట్లుగా ఉండాలి. ప్రశిక్షకుడు సహజ మార్గ పద్ధతి ననుసరించి నిర్దేశింపబడిన ఆదర్శాల కనుగుణంగా నడవడిక అలవరచుకొనక పోతే, అటు వ్యవస్థకు, ఇటు గురువుగారికి అపచారము చేసినట్లవుతుంది. తన సహచరులుకూడా అదే విధంగా నమ్మికతోనూ, చక్కని ఆశయాలతోనూ అనుసరించేట్లుగా ప్రశిక్షకుడుకూడా ధ్యానము, శుద్ధికార్యక్రమము, ప్రార్థన చేయాలి. ప్రశిక్షకుడు అభ్యాసి యొక్క ధ్యాన సాధనలు శ్రమలేకుండా, నిరాడంబరముగా ఉండేట్లు చూడాలి.

అభ్యాసి మనసులల్లో గందరగోళము, అనుమానాలు, సంస్కారాలు కలుగ జేసేట్లుగా సాధనా పద్ధతులను నిర్ణయించడము చాల చెడ్డ పద్ధతి. అట్టి ప్రశిక్షకుడు తనకు తనే అపచారం చేసుకోడమే గాక, సంస్థకు, ఆత్మసాక్షాత్కారంకొరకు

చాలా సులభమైన సహజ మార్గ పద్ధతికి గూడా అపచారం చేసినవాడవుతాడు.

మన గురువుగారు మనకు చాలా సులభమైన, ఆశ్చర్యకరమైన ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతిని ఇచ్చారు. ఆయన మానవ ఉనికికి, సంస్కారాలకు మూల కారణాన్ని కన్గొన్నారు. మానవుని మనసుఎ ఏవిధంగా ఇష్టంవచ్చినట్లు పని చేస్తూ, జడత్వాన్ని, చిక్కుసమస్యలను సృష్టిస్తుందో, వాటికి మానవుడు ఏవిధంగా తన సృష్టికి తనే బానిసగా అయి, నిరంతరము ఘర్షణలో ఇంకా చిక్కులను, బంధాలను సృష్టించుకొంటాడో మొదలగునవి అన్నింటిని ఆయన మనకు విశదపరచాడు. సోగొట్టుకొన్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యమును సొందడానికి, తన సృష్టిని తన ఆలోచనా శక్తిచే తుత్తునకలుగా చేయడమనేది ఒక్కటే మార్గము. ఆవిధంగా సర్వ విధములైన బంధములనుండి లేదా పరిమితులనుండి విడివడి సంపూర్ణ స్వేఛ్ఛను పొందిన విశిష్ట వ్యక్తి, జిజ్ఞాసుకు ఎంతో ఉపయోగంగా ఉండగలడు. అట్టి సహాయము సహజ మార్గమందు గురువుగారి ప్రాణాహుతి శక్తి ప్రసారితము ద్వారా ఇవ్వబడుతుంది.. లక్ష్యము యొక్క నిరంతర స్మరణ అనునది అభ్యాసికి ప్రాణాహుతి శక్తిని గ్రహించే సూక్ష్మత్వం అంతకంతకు వృద్ధి చేస్తుంది.

ఓం శాంతిః

ABHYASI, PRECEPTOR, MASTER'S TRNSMISSION
From the Book 'Call of the fellow traveller,' (page )

# (11) ఆధ్యాత్మిక శిక్షణ
# (11) SPIRITUAL TRAINING

సోదర సోదరీమణులారా

ఈరోజు మనమందరము ఇక్కడ గురువుగారి 80వ జన్మదినం జరుపుకోడానికి కలుసుకున్నాము. 30వ తేది ఏప్రిల్ 1979 న అహ్మదాబాదులో గురువుగారి 80వ జన్మదినం దేశంలో అనేక ప్రాంతాలలో జరుపుకోవాలని నిర్ణయం తీసుకోవడంతో ప్రారంభమయింది. సర్వసమర్థుడైన గురువుగారు మార్గం చూపించడానికి ప్రత్యక్షంగా మనమధ్యన ఉన్నారు. అయన ఒక గొప్ప సందేశాన్ని మానవజాతికి ఇవ్వనున్నారు. అయన జీవితమే ఒక గొప్ప సందేశం. అట్టి విశిష్ట మూర్తి ఇంతకు ముందు ప్రపంచంలో ఎప్పుడూ లేడు, ఇకమీదటకూడా ఉంటాడనేది సందేహాస్పదమే. గనుక, అట్టి విసిష్ఠ వ్యక్తి మార్గదర్శకత్వంలో, మనమందరము శిక్షణ పొందుతూ ఉండడమనేది మహత్తరమైన అదృష్టంగా మనం భావిస్తాము. అయన జన్మదినం దేశవ్యాప్తంగా పలుచోట్ల ఈ సంవతసరం జరుపుకోడము మనందరికి సంతోషంగా ఉంది.

మనవునికి బాగా పరిణతి చెందిన బుద్ధి ప్రసాదింప బడినందున, మిగిలిన జీవరాసులకంటే ఎంతో ప్రశస్తమైనదని

మనిషి అనుకొంటాడు. తన మనసునను క్రమబద్ధంచేస్తే మిగిలిన జంతువులకంటే నిజంగానే ప్రశస్తమైన స్థితికి మానవుడు రావచ్చు. ఇందుకొరకు సహజ మార్గము సరియైన, సులభమైన మార్గ పద్ధతులను అందిస్తుంది.

మానవ జీవన లక్ష్య సాధనకు మనసునను క్రమ బద్ధీక రించుటకు ఇష్టపడేవారు తన పురోభివృద్ధి కొరకు నిజమైన లక్ష్యాన్ని గురించి ఆలోచన చేయాలి. అట్టి ఉన్నతోన్నతమైన లక్ష్య స్థితిని గురించి ఆలోచన చేయడమే గాక, పరి పరి విధాలైన తన కోర్కెలు, ఇష్టాఇష్టాలు లక్ష్యానికి ఆటంకాలు, అవరోధాలుగా ఉంటాయనే విషయం అతను గ్రహించవలసి ఉంటుంది. ఎప్పుడైతే తన కోర్కెలకు బానిసగా ఉన్నాడనే ఎరుక ఏర్పడుతుందో అప్పుడు బానిసత్వంనుండి స్వేచ్ఛ పొందాలనే ఆలోచనకూడా మొదలవుతుంది. తదనంతరము, అన్నివిధాలా బంధ విముక్తుడయి, యోగశక్తి ప్రసారితము ద్వారా సహాయము చేయగల్గిన తోటి వ్యక్తిని ఆశ్రయించ వలసినదిగా సలహా ఇవ్వబడుతుంది. సహజమైన పద్ధతిలో ప్రశిక్షకుడు అభ్యాసిలోని తీవ్రమైన బంధాలను బలహీన పరచి అతని హృదయంలో దివ్యతేజససను బీజము నాట బడుతుంది. తర్వాత హృదయంలోని దివ్యతేజసుసపై ధ్యానం చేయవలసిందిగా సూచింప బడుతుంది. ఏవిధమైన ఊహ చేయకుండా ధ్యానమనేది చాలా సహజంగానూ, సరళంగానూ, శ్రమ, ఒత్తిడి లేకుండగను చేయాలి.

అంతర్ముఖంగా మాలిన్య నిర్మూలన ద్వారా పవిత్రత చేకూరడానికి కొన్ని యితర పద్ధతులు కూడా చెప్తారు. అభ్యాసి లోని స్థూలత్వము, జడత్వము, సంస్కారాలు,అంధకారము మొదలయినవి తొలగింప బడడానికి ప్రశిక్షకుడుకూడా తన ఇచ్ఛా శక్తిని ఉపయోడిస్తాడు. సహజ మార్గ సద్ధతిలో గురువుగారు ప్రశిక్షకునికి కూడా యోగశక్తి ప్రసారము చేసే శక్తిని అనుగ్రహిస్తాడు.

సహజ మార్గ పద్ధతిన సాధన చేస్తూవుండే అభ్యాసులు త్వరలోనే వారి మనసుల్లో ఒక విధంగా అధీనంలోకి వచ్చి తేలికదనము, స్వేచ్ఛను పొందడము గమనించారు. ఉన్నతమైన స్థితిని పొందాలనే తలంపు పటిష్టమైనప్పుడు, అట్టి స్థితిని శాశ్వతంగా పొందిన గురువుగారిని జ్ఞాపక ముంచుకోమని సలహా యివ్వబడుతుంది. త్వరలోనే నిరంతర స్మరణ అలవాటు చేసుకొని అభ్యాసి తన ఉనికియొక్క ఉన్నత సరిధులలోకి శీఘ్రగతిన చొచ్చుకొని పోతాడు. తన తీవ్ర ఇచ్ఛ ఎక్కువయ్యేకొద్ది అతని పురోగతికూడా అంత ఉన్నతంగా ఉంటుంది. గురువుగారి ప్రాణాహుతి ప్రసారం వల్ల, అభ్యాసి తనలోని బంధాలనుండి విడివడుతూ లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో సమీపిస్తూ ఉంటాడు.

చాలామంది అభ్యాసులు అనుభవం పొందినట్లు, ఈ సహజ మార్గ పద్ధతిన ఆధ్యాత్మిక శిక్షణకు సమ్మతి పడిన జిజ్ఞాసులు ఎవరైనా సరే, అనుభవం ద్వారా పొందగలరు. ఈ విధంగా మానవులు సహజ పద్ధతిన తమ నిజమైన పురోభివృద్ధిని సాధించగలరు. అవిధంగా

కాకపోతే వారి శక్తి అంతా హింసాత్మకమైన, రాక్షసకృత్యములద్వారా ఎవరికి వారే వినాశనం కావడానికి దుర్వినియోగ మవుతుంది.

సహజ మార్గము మనకు సంప్రాప్త మయింది. ఈ పద్ధతిని కనిపెట్టిన విశిష్ట వ్యక్తి అదృష్ట వశిత్తు మనకు దారి చూపించి, నడిపించడానికి మన మధ్యనే ఉన్నాడు గనుక మనం ఉపయోగం పెట్టుకోవడము మన విద్యుక్త ధర్మం.

ప్రకృతి ఆదేశానుసారం మన మందరము పురోగ మించడానికి గురువుగారు మనకందరికి సంపూర్ణమైన వివేకాన్ని ప్రసాదించు గాక.

ఓం శాంతిః

న్యూఢిల్లీ
సెప్టెంబరు 30, 1979.

## "SPIRITUAL TRAINING"

From the Book 'Call of the fellow traveller,' (page 41 )
Written by Pujya Sri. Raghavendra Rao. Raichur

# (12) అభిన్నత్వ భావనలు

## Thoughts on oneness

" మనమందరము సోదరులము. జ్ఞానరీత్యా, నైతికరీత్యా, మానవ జీవనమునకు పరమ లక్ష్యమైన ఆధ్యాత్మికత రీత్యా అందరము ఒకటిగా ముడిపడి ఉన్నాము. ఇది, అది అనేదంతా ఇప్పుడు పోయింది. ఆయన సమస్త చర్యలలోను, చుట్టుప్రక్కల వాతావరణమంతటిలోను ఒక్క పవిత్రత మాత్రమే ఉంది. ఈ పవిత్రతే మానవుల ఆధ్యాత్మిక గమ్యాన్ని మూలముతో ముడివేయుగలిగేది."... బాబూజీ సందేశము.

మానవుడు సాంఘిక జంతువు. అంతేగాక ఆలోచనా పరుడు. మానవ ఉనికికి దైవీకస్థితి ఆధారం. సాంఘిక జీవనానికి నైతిక జీవితం అవసరమైతే, దైవీక స్థితికి ఆధ్యాత్మికమైన జీవనం తప్పనిసరియని అంటుంది. మానవ జీవనంయొక్క ముఖ్య లక్ష్యాన్ని పొందడానికి అవసరమైన మార్గపద్ధతులను, బుద్ధి తన నైపుణ్యంతో కనిపెడుతుంది.

ఎప్పుడయితే ఆలోచన నియమబద్ధంగా జరగదో, అప్పుడు అది భిన్నత్వ భావనలను, విభజనలను సృష్టిస్తుంది. ఆలోచన నియమబద్ధంగా జరిగినప్పుడు, భిన్నత్వాన్ని, విభజనను సమసి పోయేట్లుగా చేసి, మూలతత్వమైన ఏకత్వాన్ని పొందుతుంది. ఈ విధంగా భిన్నత్వమనేది నశించి పోయినప్పుడు, పవిత్రమైన మూలముతో సమస్తము అవిభక్తంగా ఉన్నదనే దృష్టిని మనకు కలుగ జేస్తుంది.

ధ్యాన సాధనవల్ల ఆలోచనలను క్రమబద్ధం చేయడము సాధ్యమవడమేగాక అత్యావశ్యకంగా చేసి తీరవలె. గురువుగారి ప్రాణాహుతి (యోగశక్తి ప్రసారితము) వల్ల సాక్షాత్కారం సులభతర మవుతుంది. సాధారణంగా కోర్కెలనేవి ఆలోచనలకు ప్రేరణ కలుగ జేస్తాయి. భగవత్ సాక్షాత్కారం కొరకు పటిష్టమైన కోర్కెను

బుద్ధిలోకి చొప్పిస్తే, మిగిలిన కోర్కెలన్నీ వాటి పటుత్వాన్ని కోల్పోయి ఆలోచనలను ప్రేరేపించే శక్తి లేకుండా పోతుంది. హృదయంలో మాలిన్యాలు ఇంకా బీజరూపంలో మిగిలి ఉండే కోర్కెలన్నీ ధ్యాన సమయంలో అలజడి కలుగజేస్తూ ఉంటాయి.

అంతర్ముఖంగా ఉండే మాలిన్యాలు, జడత్వము, సంస్కారాలు మొదలయిన వాటిని తొలగించడానికిగాను సులభమైన, సాధారణమైన, ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతులను గురువు గారిచే కనిపెట్టబడి సహజ మార్గమను పేరుతో మనకు అందజేసారు. సత్ప్రవర్తన, సేవా దృక్పథములనేవి అంతర్ముఖంగా పవిత్రతను కలుగజేయడానికి ఎంతో గొప్పగా సహాయము చేస్తాయి. ఈర్ష్య, ద్వేషములను వాటినుండి ఎవరైతే సంపూర్ణంగా విడుదల కాలేరో, అట్టివారు భగవత్ సామ్రాజ్యంలోకి అడుగు పెట్టడానికి కూడా వీలు లేదు. ఏవిధమైన బంధాలు, పరిమితులు లేని అనంతమైన ఆధ్యాత్మికరంగంలో ఉన్నతోన్నతంగా గురువుగారు ఎదిగి ఉన్నారు. అట్టివారితోటి బంధమనేది జడత్వాన్ని, స్థూలత్వాన్ని తొలగింపజేస్తుంది.

గురువుగారు అన్నిబంధాలను, పరిమితులను అధిగమించిన వారని తెలుసుకోగలందులకు, ఆయనతో సహచర్యం చేసి గమనించి అవగాహన చేసుకోవాలి. వాస్తవంలో గురువుగారి పైన ధ్యానమనేది ఆలోచనా సరళిని సరియైన పద్ధతిలోకి తెస్తుంది. గురువుగారు సామాన్య మానవుడుగా అగుపించవచ్చు, కాని జీవిత

లక్ష్యాన్ని దృష్టియందు ఉంచుకొన్న అభ్యాసికి, ఆయన శక్తి మానవ స్థాయిలకు అతీతంగా వ్యాపించి ఉన్నదని గుర్తిస్తాడు. అభ్యాసికి గురువుగారు ఒక విశిష్ఠమైన మానవుడుగా గోచరమవడము మొదలవుతుంది. అభ్యాసి సూక్ష్మత్వం చెందినప్పుడు అతనికి గురువుగారి గొప్పతనము, అత్యంత పవిత్రతతో కూడిన విశిష్టతలను తన హృదయంలో గమనించడము మొదలవుతుంది. ఇట్టి సహచర్యంలో ఏ కొంచెము ప్రేమ ఉన్నప్పటికి సాక్షాత్కారం శీఘ్రగతిన అవుతుంది.

ఉన్నతోన్నతమైన స్థితిని లేదా, మూలమును పొందడమే అభ్యాసి తన లక్ష్యంగా ఉంచుకోవాలి. అనేకమార్లు, ఈ లక్ష్యమనేదాన్ని మన కోర్కెలనే వాటితో పలచబడేట్లు చేసుకొన్నప్పుడు, గురువుగారు సరిదిద్దడానికి ప్రయత్నము చేయడము గమనించవచ్చు. అయితే మనకు ఇది గ్రహించే శక్తి సరిగా లేనప్పుడు, గురువుగారిని దూషించడము, కించపరచడము, తప్పుపట్టడముకూడా కద్దు. అందుచేత మన ఆధ్యాత్మిక అభివృద్ధి ఆలస్యమవుతుంది. ఈ విధంగా ఎందుకు జరుగుతుంది అంటే, మాలిన్యాన్ని నిర్మూలించాలంటే అభ్యాసి కొంత శ్రమ పడవలసి వస్తుంది. తాను చాలా పవిత్రంగానే ఉన్నానని, అందువల్ల ఏవిధమైన మాలిన్యాలను తొలగించుకోవలసిన అవసరము లేదనిన్ని, లేదా, గురువుగారే అవసరమైతే ఆ పని చేస్తారనిన్ని, లేదా ఆ విధంగా మాలిన్యాలను తొలగించుకొనే పద్ధతితెలియదనిన్ని, లేదా, గురువుగారికే సరియైన అవగాహన ఉండాలని మొదలయిన

ఏవేవో కారణాలు సృష్టించుకొని అట్టి శ్రమ పడకుండా తప్పించుకొని పోవాలనుకొంటాడు.

సమర్థవంతుడైన గురువుగారు చాల పవిత్రుడు కాబట్టి, మనము ఆయన్ను గురించి ఏవిధంగా అనుకొంటామో, ఆ విధంగానే కనపడతాడు. చాలా దయార్ద్రహృదయుడు కాబట్టి, మన అవివేకమైన, మూర్ఖమైన ఆలోచనలను ఉదాసీనతతో కొంత స్వేచ్ఛనుకూడా మనకు ఇస్తాడు. అయనతో మనకు గల అవినాభావ స్థితిని గుర్తించి, మన మూర్ఖమైన, అహేతుకమైన పనికిమాలిన తలంపులను ప్రక్కన పెట్టాలి.

మన గురువుగారు మానవ రూపం దాల్చినందువల్ల, సహజంగా మానవ లక్షణాలనే చూపిస్తూ ఉంటాడు. అయితే దానితోబాటు అయన పూర్ణుడు కాబట్టి మనందరము అట్టి లక్ష్యాన్ని చేరుకోవాలనేదే అయన ఆశయం గనుక మనకు మార్గం చూపిస్తూ నడిపిస్తూ ఉంటాడు. అయన యొక్క ప్రేమ తత్వం, నడవడిక, మాటల్లో హాస్యం, వ్యక్తంచేసే అలోచనలు మన అవగాహన కొరకు, మనకు మార్గదర్శకత్వం కొరకు వివిధ రీతులలో వ్యక్తము చేయబడుతున్నవన్నీకూడా ఒకే మూలశక్తినుండి బహిర్గత మవుతున్నాయనేది గమనిస్తే, అప్పుడు మనం సరియైన మార్గంలో ఉండడానికి సాధ్యమవుతుంది. అయన విశిష్టమైన మానవాతీతుడని, లేదా, విశిష్టమైన అవతార పురుషుడనే విషయం మరచిపోతే ఇక అయన్ను గురించిన అలోచనలను మనం కల్పన

చేసుకొని మన ఇష్టాఇష్టాలతో పరిమితుడిగా చేసి అట్టి ఆలోచనలలోనే ఇరుక్కొని పోతాము. ఆవిధంగా కాకుండా, అట్టి విశిష్టమూర్తి మాట్లాడే ప్రతి మాటలోను, చేసే ప్రతి కార్యములోను, చూసే ప్రతి చూపులోను, మనకు ఒక సందేశము, ఒక మార్గదర్శ కానికి శిక్షణయని తెలుసుకొన్నప్పుడు మాత్రమే ప్రాణాహుతి సహాయముతో ఆయన్ను పొందడానికి వీలవుతుంది.

అభ్యాసియైనవాడు అహ్లాదాలు, సంతోషాలు కోరుతూవుండే మానశిక స్వభావం తనకే గాక యితరులకు కూడా ఎంత చెరుపు, చిక్కులు కలుగ చేస్తాయో త్వరలో గమనించాలి. అప్పుడు గాని తన కోర్కెలకు తానే బానిసగా ఉండే స్థితిని నుండి విడుదల కాలేదు. గురువుగారితోటి బంధము ఏర్పరచుకొని, ఆయన ఇచ్చే శిక్షణకు అభ్యాసి ఏవిధమైన ప్రతి బంధకము కలిగించకుండా వుంటే అనేక విధాలైన సూక్ష్మస్థితులగుండా పోతూ ఉంటాడు. ప్రారంభంలో ఆనందము, ఉత్సాహముకొరకు అలవాటుగా ఏర్పడిన బంధము వాటి వింత పోకడలనుండి శుద్ధి కావింపబడాలి. లేకుంటే, గురువుగారిని మొరటుదనంతో అతిగా అనుకరించడము మొదలయితే అది ఇంకా జడత్వాన్ని, స్థూలత్వాన్ని అభ్యాసిలో వృద్ధి చేస్తుంది.

గురువుగారిచే యివ్వబడి, సర్వత్రా అవరించియున్నట్టి ప్రేమ, అందరిపట్ల ప్రేమను, అన్నింటియందు ప్రేమను అభివృద్ధి కలుగ చేయడానికి బదులుగా అభ్యాసులలో వారి గొప్పదనాన్ని

పెంపు చేసుకోవడానికి దోహదము చేయవచ్చు.. దీనివల్ల పొందికకు బదులు వ్యతిరేకత, ఏకాంతానికి బదులు ఒంటరితనము, స్పష్టతకు బదులు అస్పష్టత, అర్పణస్థితికి బదులు నిస్సహాయస్థితి, అన్వేషణకు బదులు దృఢీకరించడము, అహంనివృత్తికి బదులు అహంపెంపు చేసుకోవడము, మొదలయినవన్ని ఏర్పడే అదనపు అవాంఛితమైన ఫలితాలు. కొన్ని మార్లు అట్టి అభ్యాసి అంతర్ముఖంగా మాలిన్యాలను తొలగించుకోడానికి తిరస్కరించి, తాను ఆధ్యాత్మికంగా సామర్థ్యంపొందినానని లేదా, సంపూర్ణంగా గురువుగా అయనానని, లేదా తానే భగవంతుడయినానని మొదలయిన అపోహలతో మతి భ్రమించి చివరకు పిచ్చివాడుగా కూడా అవుతాడనడములో ఆశ్చర్యము లేదు.

అవినా భావ స్థితికి అటంకములైన విషయాలను గురించి అధ్యయనం చేసినాము చేసినాము గనుక, ఇప్పుడు అట్టి అద్వితీయ స్థితిని గురించి, దాని పరిణామాలపైన మన దృష్టిని నిలుపుదాము. ఎప్పుడయితే గురువుగారు మన సొంతమని భావిస్తామో, చిన్నపిల్లలు తమ తల్లిదండ్రులదంతా తమదేనని అనుకొంటారో, అదేవిధంగా గురువుగారిదంతాకూడా మనదేనని మొరటుగా అనుకొంటాము. అట్టి స్థితిలో అభ్యాసియైనవాడు, అద్వితీయ భావమనేది మూలానికి సంబంధించినదనిన్నీ, దాని ముఖ్యమైన లక్షణం సర్వవ్యాపకమని గమనించడంలో అప్రమత్తంగా ఉండాలి. వాస్తవంలో, సమర్థ వంతుడైన గురువు అభ్యాసికి మూలజ్ఞానాన్ని ప్రసారం చేస్తాడు. దాన్ని అభ్యాసి తన

వివేక శక్తిని, అవగాహనా శక్తిని వికశింప జేసుకోడానికి ఉపయోగ పెట్టుకోవాలి. ఇతరులను అగౌరవ పరచినందువల్ల ఏకొంచెం కళంకము కలిగిని, లేదా ఆత్మ స్తుతితో ఆలోచనాశక్తిని కలుగ చేపినా, అద్వితీయ భావాన్ని ఛిన్నాభిన్నం చేసినట్లేగాక, అట్టి అద్వితీయ స్థితియొక్క ప్రశాంతతకూడా అభ్యాసికి లేకుండా పోతుంది.

అంతా గురువుగారనే అనుభవం తరుపరి సాధనవల్ల అభ్యాసి పొందుతాడు. అందరిపట్ల గౌరవము, మర్యాదలనే నైతిక సిద్ధాంతము అభ్యాసి ద్వారా బహిర్గతమవుతూ ఉంటుంది. సక్రమమైన పద్ధతిలో అవగాహన చేసుకొనే నైపుణ్యము, జ్ఞానపరంగా మానవకోటి అంతా ఒక్కటేననే సత్యము గోచరము కావడానికి ప్రారంభమవుతుంది. ఈ స్థితిలో అభ్యాసియొక్క సమస్త చర్యలు గురువుగారి పరంగా చేయవలసిన బాధ్యతలుగా రూపొంది, తన వ్యక్తిగతమనేది అంతరించి పోవడము మొదలవుతుంది.

పలువిధాలైన ఆధ్యాత్మిక స్థితులు యొక్క అనుభవాలు, శ్రద్ధా భక్తులుకల అభ్యాసిని తన అనుభవాలలోని సూక్ష్మమైన, సన్నితమైన బేధాలను గమనించేట్లుగా చేస్తాయి. మామూలుగా నిత్యజీవితంలోని అనుభవాలుకూడా కొత్తదనం తోనూ, పవిత్రతతోనూ ఉంటూ, వాటి మూల శక్తిని కూడా అవగాహన

చేసుకోడానికి దోహదంచేస్తాయి. అభ్యాసి పొందిన ఇట్టి స్థితి వల్ల ఆలోచనా శక్తిపై అధికారం కల్గినవాడై, తన అధీనములో ఆ శక్తి పనిచేస్తూ ఉంటుంది. ఈ స్థితిలో సమర్థవంతుడైన గురువుయొక్క సహాయము అవసరమే గాక తప్పనిసరిగ వుండవలె. తదుపరి ఉన్నత స్థితులను, ఇంకా అటుపై ఉన్నత స్థితులను ఏ విధంగా గురువుగారు ఇస్తారో, ఏవిధంగా అభ్యాసి ఆ శిక్షణ పొందుతాడో, అట్టి స్థితులలో ఏవిధంగా అభ్యాసి తన ఆలోచనా శక్తిని ఉపయోగ పెట్టుకొంటాడో మొదలయినవన్ని, అభిన్నత్వ స్థితిని గురించి చెప్పే అభిప్రాయాలు కాబట్టి ప్రస్తుతానికి ఇక్కడ ప్రస్తావించడము లేదు.

ముగింపుగా ఒక విషయమేమనగా, అద్వితీయ స్థితి అంటే, అందులో కొన్నిమార్లు ఒక విధమైన మనోహరంతోనూ, మరికొన్నిమార్లు తన్మయత్వంతోనూ, మరికొన్ని మార్లు సమస్త ఉనికికి మూలమొక్కటేనని అనుభవపూర్వకంగా తెలుసుకోడమే. ఒక సారి గురువుగారు అద్వితీయ స్థితిని గురించి చమత్కారంగా ఈ విధంగా చెప్పారు.

**"నీవు పది గాడిదల గుంపులో వున్నావంటే, నీవు పదకొండవ వాడివవుతావు"**

సమస్త మానవకోటి లక్ష్యమైనట్టి ఏకత్వస్థితిని పొందడానికి గురువుగారు అందరి సహచరులను అనుగ్రహించుగాక ! ఆయనతో అవినాభావ సంబంధము ఏర్పరచుకోడానికి మన మందరము అట్టి పవిత్రతను అభివృద్ధి చేసుకొందుము గాక !

ఓం శాంతిః

"Thoughts on one ness"
from the Book of Call of the Fellow Traveller page 44

# (13) సద్గురువు, సాధన, సంస్థ.
# (12) MASTER, METHOD, AND MISSION.

ఈ సుభ సందర్భము మన గురువుగారిని అత్యంత యోగ్యమైన రీతిన స్మరించుకోడము అవసరమని జ్ఞప్తికి తెస్తుంది.

ప్రాణాహుతి ద్వారా అచరణీయమైన యోగ పద్ధతిని ఆయన మనకు ప్రసాదించారు. ఇక్కడ సమావేశమైన వారందరు, అయన ప్రాణాహుతి ప్రసారంయొక్క అనుభవాన్ని పొందినామని అంటారు, అయితేకూడా ఆయన ఆశయం మేరకు ఉన్నతంగా ఎదగవలెనని మనలోని ప్రతి ఒక్కనికి రహస్యంగా తెలుసు.

గురువు గారు మనకు ధ్యాన పద్ధతిని, మాలిన్యాలను తొలగించుకొనే పద్ధతి, ప్రార్థనా పద్ధతి మనకు యిచ్చారు. వాటితో బాటు దశాదేశములనేవి కూడా ఇచ్చారు. మనం పూజచేస్తున్నాము, అందుకు సంతోషపడుతున్నాము. అయితే దశా దేశాలను గురించి తరచు మరచి పోతున్నందువల్ల అంతర్గతంగా బాధకూడా పడుతూ ఉంటాము. ఇది అ విధంగానే ఉంటుంది. మన లక్ష్యం స్వార్థ పూరితము కాకుండా దైవీకంపైననూ, మరియు పరిమిత తత్వంపై కాకుండా అపరిమిత తత్వంపైన ఉంచడము చేత, ఆవిధమైన బాధ ఉండడము సహజమే.

మన గురువుగారు ఈ సంస్థను మన స్వగృహంవలె అనుకోవాలని సలహా యిచ్చారు. వాస్తవంలో అందర్ని మనవాళ్ళలాగా అనుకొని ఎవరెవరికి ఏమేమి చెందవలెనో ఆ ప్రకారం చెందేట్లు చూడాలి. పెద్దలయందు గౌరవము, చిన్నవారియందు సానుభూతి, సమవయస్కులతో స్నేహభావము లనేవిఉన్నప్పుడు మనలోని స్వచ్ఛమైన ప్రేమకు నిదర్శనాలు. వాటిని మనం యోగం ద్వారా అభివృద్ధి చేసుకోవాలి. మనకు నిర్మలమైన ప్రేమ అభివృద్ధి కాలేదంటే, మనలో ఏదో తీరని లోపం ఉన్నట్లే. మనము గురువుగారితో సరియైన బంధము లేనందువల్ల ఇట్టి లోపం ఏర్పడుతుంది. మనమందరము గురువుగారి ఏకైక చింతనద్వారా సంబంధము కలిగి ఉన్నవారమనేది శీఘ్రగతిన తెలుసుకోవాలి.

సహజ మార్గ ప్రభావం వల్ల భవిష్యత్కాలంలో మానవ జాతి ఏ విధంగా ఉండాలనేది మన గురువుగారి ఉద్దేశము ఈ క్రింద చెప్పిన చిన్న సందేశం ద్వారా గ్రహించవచ్చు..

"ఆయన సమస్త చర్యలలోనూ, ఆయన చుట్టుప్రక్కల వాతావరణంలోనూ ఒక్క పవిత్రతమాత్రమే ఉంటుంది. ఈ పవిత్రతే మానవుల ఆధ్యాత్మిక గమ్యాన్ని మూలముతో ముడివేయ గలిగేది."

స్వార్థము, అహంభావము, ఈర్ష్య మొదలగు వాటివల్ల ఏర్పడు జడత్వాన్ని , అంధకారాన్ని, మన హృదయంలోనుండి

తొలగించి పరిశుద్ధం చేసినప్పుడు, మన జీవితాలను ప్రకృతికి అనుగుణంగా మలచుకొన్నప్పుడు, గురువుగారి ఆశయం మేరకు మన ఆధ్యాత్మిక పురోభివృద్ధి శీఘ్రగతిన పొందగలము.

గురువుగారి చింతనతో మనమందరము సమావేశము కావడముతోనే, ఆధ్యాత్మికమైన ప్రయోజనాన్ని ఇక్కడ ఉన్నవారందరమే గాక, సమస్త మానవాళికి మనము ఇచ్చిన వారమైనాము. అందుకు భిన్నంగా సమావేశమయిన వారందరు, జడ సంబంధమైన వాంఛలతోగాని, లక్ష్యంతో గాని ఉంటే, దానివల్ల ముఠాలుగా ఏర్పడడము, ఈర్ష్య ద్వేషములు హెచ్చుకావడము, తద్వారా ఆత్మవంచన చేసుకోడమే జరుగుతుంది. అందువల్ల, సోదర సోదరీమణులారా, ఇక్కడ ఉన్నంత కాలము గురువుగారి చింతనలో మునిగి ఉండడానికి ప్రయత్నం చేద్దాము. ప్రియమైన, పూజ్యులయిన గురువుగారివలె మన జీవితాలను తీర్చి దిద్దుకోడానికి దృఢ సంకల్పము చేద్దాము.

గురువుగారు ఎంతో ప్రేమతోనూ, శ్రమతోనూ కట్టిన ఈ సౌధాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉన్నదనేది మరల గుర్తుంచుకోవాలి. సహజ మార్గానికి పుట్టినిల్లు, కేంద్రస్థానమయిన ఈ ప్రదేశము ప్రపంచానికంతా ఆధ్యాత్మిక శిక్షణా సంస్థగా ఆవిర్భవించ బోతున్నందుకు మనమింకా జాగ్రత్తగా కాపాడు కోవలసిన బాధ్యత మనపై ఉంది. రాంచంద్ర ఉత్సవ

సమితి వాస్తవంలో ఇందుకొరకే రూపొందించబడింది. గనుక మనమందరము తరచు ఈ విధంగా సమావేశమై, ప్రియమైన గురువుగారి చింతనలో, ఆయన ఆశయాలను, ఆయన రచనలలోను, ప్రసంగాలలోను తెలియజేసినట్లు నెరవేర్చడానికి అందరు సహాయ సహకారాలు అందించవలసిన అవసరము గుర్తించాలి.

ఓం శాంతిః

## MASTER, METHOD AND MISSION

From the Book 'Call of the fellow traveller.' (page 51)

# (14) హృదయ గ్రంథి

## (14) KNOT OF THE HEART.

" వ్యక్తిగతంగా, సృష్టి క్రమంలో ప్రతి ప్రాణికి లేదా జీవికి మూలశక్తి అధోముఖంగా దిగి వచ్చినందువల్ల, ఈ భూమికలు లేదా స్థితులు ఏర్పడి, కొన్ని నియమ నిబంధనలను వాటికవే ర్పరుచుకొని, బంధాలను, దుఃఖాలను కలుగజేసుకొన్నాయి. అవిధంగా దిగజారి వచ్చిన జీవుడు ఊర్ధ్వముఖంగా మరలి పోవడానికి ప్రయత్నం చేయాలి."

*(అనంత్ కీ ఓర్ పుస్తకములో డాక్టరు కె.సి. వరదాచారిగారి సందేశముగా చెప్పినది)*

ప్రస్తుతం మనం ఏ గ్రంథిలో సంచరిస్తున్నాము అనే ఆలోచన, మానవులుగా మనకు మొట్టమొదటిసారి కలుగుతుంది. ఇతర విధములైన ఆలోచనలు ఏమి లేకుండా ఉంటే, హృదయ గ్రంథిలో సంచరిస్తున్నామనేది తెలుసుగో గల్గుతాము. దీని క్రింద కూడా గ్రంధులు (చక్రాలు) ఉన్నాయి కాని, అవి జడంగా ఉంటాయి. జంతువులు, ఇతర విధములైన జీవులకు ఇది నివాస స్థానంగా ఉంటాయి. అన్నింటికన్న తగ్గ స్థాయిలో ఉండేది, ఎప్పుడూ చంచలంగా ఉండేది, చివరి స్థాయికి చెందిన అణువులు, హృదయ గ్రంధికి పైస్థాయిలో ఉండే గ్రంధులను గురించే చెందిన పైచెప్పబడిన గ్రంథములో విశదీకరింప బడినాయి.

గనుక మనం హృదయ గ్రంథిపైననే చింతన చేద్దాము. దీన్ని ప్రయత్నం చేసినప్పుడు, మనం ఒక అంశాన్ని గురించే

ఆలోచిస్తున్నామని అనిపిస్తుంది. మన ధ్యాస తగ్గ స్థాయిలో ఉండే వాటినుండి మళ్ళించినట్లు కన్గొంటాము, అయితే పై స్థాయిలను గురించిన జ్ఞానం కూడా ఇంకా ఏర్పడలేదనేది కూడా ఎరుకలో ఉంటుంది. విడువక సాధన చేస్తే, ఈ హృదయ గ్రంధి యొక్క వాస్తవాన్ని తెలుసుకోగలము. ఇది చాలా చిక్కుముడులతో ఉండేదని తెలుస్తుంది. ఇతరములైన వస్తు విషయాదులు ఇందులో చిక్కుకొని ఉన్నాయని మొట్టమొదట అవగతమవుతుంది. ఎప్పుడయితే ఈ విషయాన్ని గమనిస్తామో, దాని నిజస్వరూపాన్ని కన్గొనడానికి మనం వాటిని సహజంగానే గ్రంధినుండి తొలగిస్తాము. మొదట్లో కొన్ని మనంతకు మనమే ఇచ్ఛాశక్తితో తొలగించలేని మాలిన్యాలున్నాయని తెలుస్తుంది. లేదా, సర్వ సమర్థుడైన గురువుగారి యోగశక్తి ప్రసారిత సహాయమున వాటిని సులభంగా తొలగించవచ్చని తెలుసుకొంటాము.

ఈవిధంగా మాలిన్యాలను తొలగించి పవిత్రము చేసినప్పుడు, ఈ గ్రంధిని బాగా లోతుగా అధ్యయనం చేయవచ్చు. ఇప్పుడు వాటిని ఆదిభౌతిక, అధిమానసిక అదిఆధ్యాత్మిక యొక్క చర్యలుగానూ, కొన్ని మార్లు రాగ ద్వేషాలుగనూ, అనేక విధములైన మనోవృత్తుల యొక్క చర్యలుగానూ, శక్తివంతమైన వివిధ ఆలోచనలగానూ, రూపుదాలుస్తూ ఉంటాయి. ఇక్కడ అంతా చంచలమైన స్థితిగానే ఉంటుంది. మన ధ్యాన సాధన కొనసాగిస్తే ఈచంచలమైన స్థితి తగ్గుముఖంపట్టి,సర్వము ఒక స్థిమితానికి స్తుందనే భావన ఏర్పడుతుంది. మన ఇచ్ఛా శక్తితో గాని, లేక

సులభంగా గురువుగారి శక్తితో గాని ఇదంతా తొలగించవచ్చు. అప్పుడు పవిత్ర హృదయ గ్రంధిని అధ్యయనం చేయవచ్చు.

ఇక్కడ ఒక హెచ్చరిక అవసరము. ఈ గ్రంధులన్నింటి యొక్క సహజ లక్షణాలను అర్థంచేసుకొని వెంటనే వాటిని లయింపచేయాలి. తర్వాత ఉన్నతమైన సారూప్యతను, తర్వాత సాయుజ్యతలను పొంది అధిగమించాలి. వాటిని ఎక్కడికక్కడ విడగొట్టకుండా, సులభతరం చేస్తూ అధిగమించాలి. (డాక్టరు కె.సి.వరదాచారి). కొంతమంది ఋషులు ఈవిధమైన కృషిలో, హృదయ గ్రంధిలో చిక్కుకొని అదృష్టవశాత్తు అధిగమించి ప్రక్కకు నెట్టగల్గినవారు అదేవిధంగా చేయమని బోధించారు. వారి అనుచరులు, అందుకుగాను కావలసిన నైపుణ్యంలేకుండా విసుగు పుట్టించే యాంత్రిక సాధనలు చేసి వ్యతిరేక ఫలితాలను పొందారు.

హృదయాన్ని చాలవరకు నిర్మలం చేసిన పిమ్మట, ధ్యానంద్వారా జాగ్రత్తగా మనం గమనిస్తూ ఉంటే, ఈ గ్రాంధియొక్క ముడి సడలిపోతున్నదని అవగతమవుతుంది. మనకు మనమే లయావస్థ చెందుతున్నామని అనిపిస్తుంది. మన యొక్క ఏకాగ్రత అనే స్పృహకూడా పోతుంది. మనం ఎంత జాగ్రత్తతో, సూక్ష్మంగా గమనించినప్పటికి, గ్రంధి చుట్టూ ఆవరించియున్న హృదయ ప్రాంతానికి సంబంధించిన జ్ఞానమంతా మన ఎరుకలోనే ఉంటుంది. ఇంతకు మునుపు లేనట్టి అనుభవం -అంటే, అతీంద్రియ జ్ఞానమనే స్థితిలోకి దుముకుతాము. మనకు ఆరాటం

ఎక్కువవుతుంది. ఒక విధమైన పరిమితత్వంతో మనం ఉన్నట్లు అనిపిస్తుంది. దాన్ని అధిగమించాలని అనుకొంటాము. రెండవ గ్రంధి మన దృష్టికి వస్తూ ఉంటుంది. ఇది పైన చెప్పబడిన స్థాయికంటే హెచ్చు స్థాయిలో ఉండేది, సూక్ష్మతరమైనట్టిది. రెండవ స్థితికి చేరుకోవాలనే ఆరాటం మనం అభివృద్ధి చేసుకొంటాము. పూర్తి పరిణతి చెందిన తర్వాత - అంటే 45 సంవత్సరాల కాలం కూడా పట్టవచ్చు - మన సాధన సక్రమంగా చేస్తూ ఉంటే మొదటి గ్రంధిని దాటి రెండవ గ్రంధిలో పయనం సాగించవచ్చు.

అత్యున్నతమైన సమర్థవంతుడైన గురువు అభ్యాసిని అతి తక్కువ సమయంలోనే ఉన్నత స్థాయిలకు తీసుకొని పోగలడు. అదృష్టవశాత్తు అట్టి గురువు మనకు లభ్యమైతే మన పయనమంతా ఒక్క క్షణంలో పూర్తి అయిపోయేట్లుగా చేయవచ్చు.

ఇప్పటి నాగరిక పద్ధతులలో చదువుకొన్నవాళ్ల మోస్తరు మనం కూడా ఇప్పుడు ఈ గ్రంధిని శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేద్దాము. ఈ గ్రంధి, ఇంతకు ముందు ఉన్న గ్రంధి పూర్తి అయిన తర్వాత ఏర్పడుతుంది. దీనికంటే ముందు చాలా గ్రంధులున్నాయి. ఆత్మను ఆవరించియున్న మొదటి కోశము మనం చేరే వరకు ఈ విధమైన వరుస క్రమంలో మనపయనం సాగుతూ ఉంటుంది. ఇప్పటి నవీన బుద్ధిశాలురు పరిశీలన ప్రారంభించినప్పుడు దాని మూల కారణం కన్గొనేవరకు తృప్తి పొందరు. కాని, ఇప్పుడు ఈ

హృదయ గ్రంథిని గురించి విచారించేప్పుడు, దాని 'మూలము'ను గురించిన విచారణ అకాలంగా చేసినట్లే అవుతుంది.

ఈ గ్రంథిని ఎవరు ఏర్పరచారు? ఎందుకు ఏర్పడింది? దాన్ని దాట గలమా? ఈ గ్రంథిని లయింప చేసినప్పుడు జరిగే ఫలితాలేమిటి? అనే కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు తృప్తికరమైన, సరియైన జవాబులు కోరడము సముచితమే.

తిరుగు ప్రయాణాన్ని గురించిన వాస్తవిక అనుభవం కల్గినవాడే పై ప్రశ్నలకు జవాబు యివ్వగలడు. ఈ గ్రంథికి పూర్వపు గ్రంథితో ఉన్నప్పుడు ఒక్కడే ఉన్నాడు. అయితే, బాహ్యమైన ఆనందం కోరుకొన్నప్పుడు 'అనేకము' అనే ఆలోచన ఏర్పడింది. వివిధ శక్తులు వివిధ మార్గాలలో వాటిని తృప్తిపరచడానికి పనిచేశాయి. ఇప్పుడు ఈ గ్రంథి ఏర్పడడానికి ఆధారం రూపుదాల్చింది. తదుపరి ఇంద్రియాలకు వాటికి సంబధించిన వస్తు విషయాదులతో సంబంధం ఏర్పడింది. ప్రతి ఇంద్రియము దానికి సంబంధించిన విషయంతో అనురాగం స్థిరపడింది. ఆనందం ఎక్కువయిందిగాని, బంధంమాత్రం శాశ్వతం కాలేక పోయింది. అసంతృప్తి, విషాదం కలిగింది. ఘర్షణ ప్రారంభమయింది. ఉష్ణమనేది, దుఃఖము, కోపము, మోహ, లోభము, మాత్సర్యము మొదలయినవి గోచరము కావడము మొదలయినాయి. ప్రస్తుత గ్రంథి ఏర్పడింది. ఆత్మయొక్క అన్నివిధాలయిన సూక్ష్మ శక్తులు ఇక్కడ ఘనీభవించినాయి. బాహ్య వస్తు విషయాలనుండి

ఆనందాన్ని కోరే స్వభావంనుండి, అంతర్ముఖంగా చేసి, మన పయనాన్ని వెనుకకు మళ్ళించినప్పుడు ఈ గ్రంధిని దాటవచ్చు. తక్కువ విలువ గల్గిన వస్తువిషయాదులను ఎక్కువ విలువగల్గిన వాటి పరంగా త్యాగం చేయాలి. తక్షణమైన మంచికొరకు తక్షణమైన సుఖాన్ని త్యాగం చేయాలి. అప్పుడు ఈ గ్రంధి సడలిపోయి చివరకు లయమైపోతుంది. ఇట్టిది, తన ఇచ్ఛాశక్తిని అభివృద్ధి చేసుకొన్నవాడు ఒక్క ధృఢ సంకల్పం చేయడం ద్వారాగాని, లేక ఇచ్ఛాశక్తి కల్గిన సమర్థవంతుడైన గురువు లభ్యమైతే అతని సహాయంవల్లకూడా పొందవచ్చు.

ఎప్పుడయితే ఈ గ్రంధి సడలిపోవడం ప్రారంభ మవుతుందో, అనేక విధములైన అనుభూతులు వస్తాయి. అవన్ని వ్యక్తికి వ్యక్తికి మధ్య ఉండే శారీరక, మానశిక, సూక్ష్మగ్రాహక, శక్తి సామర్థ్యాలను బట్టి తేడాలుంటాయి. ఉన్న విషయసార మొక్కటే అయినా, దేనిద్వారా అవి అవగతమవుతుందో దాన్ని బట్టి వ్యత్యాసాలుంటాయి. ఉదాహరణకు ఇక్కడ, కొన్ని ప్రత్యేకమైన అనుభూతులను గురించి మాత్రమే తెలియచేయబడినాయి.

ప్రపంచములో సమస్త చేతనాచేతన వస్తువిషయాదులన్ని ఏదోకొంత దైవీకమైన ప్రభావాన్ని కలుగ చేస్తాయని కొంతమంది అభ్యాసులు భావిస్తారు. ఈ ప్రభావమనేది కొంతమందికి తేజో రూపంలోనూ, కొంతమందికి సువాసనలుగనూ, మరికొంతమందికి స్పదనల ద్వారానూ, అనుభవంలోకి రావచ్చు. కొంతమంది

అభ్యాసులు ఈ సమస్త జగత్తు ఒక క్రమబద్ధమైన దైవీక స్పందనలతో కూడుకొని ఉన్నదని, అన్ని వస్తువులు దైవీకమైన సృష్టి, స్థితి, లయ మనునవి స్వరానుగుణంగా నృత్యం చేస్తున్నాయని కన్గొంటారు. ఈ స్థితిలో భగవంతుడు సర్వత్రా నిండి ఉన్నాడనే భావన ప్రబలంగా ఉంటుంది.

ఎప్పుడయితే ఈ గ్రంథి వికసిస్తుందో, అప్పుడు అందులో నిక్షిప్తమైయున్న - అనగా శిద్ధులని పిలువబడు మానశిక (ఆత్మ) శక్తులు మేల్కొంటాయి. అభ్యాసియొక్క పయనం అంతర్ముఖంగా ప్రారంభమవుతుంది. తనకు తానుగా ఏదో ఒక అద్భుతమైన విషయంతోనో, లేదా మరొక కారణంగానో తగుల్కొని పోతే తప్ప, తన ప్రయాణం ముందుకు సాగుతూనే ఉంటుంది. ఏదో ఒక ఆశ్చర్యకరమైన జగత్తులోకి ప్రవేశించినాననే అనుభవం పొందుతాడు. కొన్నిమార్లు ఆశ్చర్యచకితుడై, మరికొన్ని మార్లు ఆనంద పరవశుడై తనను తానే మరచిపోతాడు. ఈ విధంగా మొదటి గ్రంథిలో అనేకములైన విషయాలుంటాయి. ప్రతివారు తమకు తాముగా అనుభవించాలి. పురోభివృద్ధికి, సమర్థవంతుడైన గురువుగారి సహాయము ఈ విషయంలో తప్పనిసరియని పదేపదే వేరుగా చెప్పనవసరము లేదు.

ఓం శాంతిః

(14) "Knot of the Heart"
(From the book Call of the Fellow Traveller, page 54)

# (55) నా గురు దేవులు.

## (55) My Master

ఎవరైన నా గురువుగారిని చూసారా ? అయితే అతని వివరణ నావివరణతో సరిచూడమనండి.

అంతా నా గురువుగారి గొప్పదనమే. అయితే నాగొప్పదనాన్ని గురించిగూడా పొగడకుండా వుండడానికి నేను నిస్సహాయుడిని. అంటే ఈరెండింటికి వైరుధ్యమనేది వున్నట్లు అనిపించడములేదా? నాగురువుగారే నేను.

భారమైన హృదయంతో ఆయన వద్దకు వెళ్ళాను. ఆయన్ను చూడటంతోటే నాలో వుండే దౌర్బల్యం, దుఃఖం తొలగింపబడ్డాయి. అహో ! అది ఏ క్రమపద్ధతిలో జరిగిందో అప్పుడు నాకు తెలియదు. అయితే దాని పర్యవసానమేమంటే అన్ని మటుమాయమయి పోయినాయి.

అది ప్రేమా? ఎడబాటువల్ల కలిగిన వేదనా ? శోకతప్తమయిన హృదయంతో వెక్కివెక్కి ఏడ్చినందువల్ల, కంటినుండి ధారాపాతంగా రాలిన కన్నీటి బిందువులా ? ఎంత ఆశ్చర్యకరము ! ఎంత గగుర్పాటు !! ఆహా ఏమి ఊరట !!!.

మోక్షాన్ని యిచ్చేది భగవంతుడొక్కడే. కృపాకటాక్షములతో బంధవిముక్తిని ప్రసాదించేది భగవంతుడే. సృష్టికర్త భగవంతుడొక్కడే. స్వచ్ఛతను కలుగజేసేది ఆయనే. ఆయనే గొప్పలోకి గొప్ప, కొద్దిలోకి కొద్ది (సూక్ష్మంలోకి సూక్ష్మం). ఆయన అనంతమే గాక, అనంత సూక్ష్మముకూడా.

భగవంతుడనేవాడు సాధ్యము కానివాడా? ఆయన కేవలము ఊహాజనితమైనవాడా? అలాగయితే నీవు నా గురువును చూడలేదు.

ఆయన ఒకసారి నావద్దకు వచ్చారు. అది స్వప్నమనుకొన్నాను. ఎంత శాపగ్రస్థమైన అజ్ఞానమో - అయ్యో - కాదది, నేను దూషించకుండుగాక - ఆయన కేవలము దాగుడుమూతల ఆట అడుతుండినాడు. ఆయన ఎల్లప్పుడూ అక్కడేవుండినాడు. అయితే నాహృదయంలోని మాలిన్యము, చెత్తచెదారము ఆయన వెలుగుకు అవరోధాన్ని కలుగజేస్తూ వుండినాయి.

నన్ను నేను ప్రేమిస్తాను. అందుచేత నాలోని మాలిన్య పూరితమైన కోర్కెలయొక్క ప్రతిబింబాన్ని అన్నిటా చూస్తూ వుండినాను. కొన్ని మార్లు ఆయన చిన్నగా నవ్వేవారు, అయితే నేనుమాత్రం ముఖం చిట్లించుకొంటూ వుండేవాడిని.

ఇప్పటిలాగా అప్పుడుకూడా చనువుతో ఉండడానికి నాకు ఆయన స్వేచ్ఛని చ్చారు. నేను బాధపడుతూ వుంటే, ఆయన

ఆటలడుతూ వుండేవారు. ఆయన ఆట అనంతమని నాకు తెలియదు. అయితే నాబాధ పరిమితమేనని మాత్రం గ్రహించ గలిగాను. చివరకు, ఆయన అపారమైన కరుణవల్ల అనామకుడైన ఈ చీడపురుగును ఎంతో దయతో జరామరణములనే బురదనుండి పైకి లేవదీసారు. ఆయన స్పర్శ నన్ను అమరుడిని చేసింది. ఆయన సంకల్పమే నన్ను శాశ్వతునిగా చేసింది.

నీవు ఇంకా బాధ పడుతున్నావా? నిరాశ, నిస్పృహలు నిన్ను శాశ్వతంగా అవిటి వాడిని చేశాయా ? ఈనాటికి, ఇక అన్ని కాలాలకు విశిష్ఠమైన, అపురూపమైన సంగతి నీవు వినలేదా ? నాగురువుదేవులు అవతరించారు. ఆసూర్యుడు తేజోమయంగా ప్రకాశిస్తున్నాడు. భరత పక్షులు శ్రావ్యంగా గానంచేస్తున్నాయి. జీవం పోస్తూ ఆత్మలను ఉబ్బూతలూగించే ఆయన గానానికి ప్రతి అణువు వెర్రెత్తి నాట్యం చేస్తూవుంది. స్నేహితుడా ! కళ్ళుతెరు, ఆయన పవిత్రమైన రూపాన్ని దర్శించు. ఆయన హృదయాన్ని ఆలకించు. మున్నెప్పుడు ఇట్టి ప్రేమానురాగమైన గానం చేయలేదు.

ఏమి ? ఆయన రూపాన్ని చూచి కూడా ఆయన్ను అవగాహన చేసుకోలేదా ? అవగాహన చేసుకోవాలని ఎందుకు ఆతురత పడుతున్నావు ? ఆయన పంచన నిలబడివుంటే చాలదా? అసలు ఆయన్ను ఎవరైనా, ఎప్పుడైనా అర్థంచేసుకొన్నారా? ఎవరైనా ఆయన్ను ఎప్పటికైనా అర్థంచేసుకోగలరా? అహం(కారము)ను త్యజించు. కేవలం పుష్పాల నర్పించిన వారికడకుకూడా వారి

(గుర్రాలకు) గడ్డి మోపులు మోసుకెళ్ళి యిచ్చినాయనపట్ల వినయ విధేయతలు కలిగివుండు.

ఆయన ఏమిటి, అని నీకు తెలుసుకోవాలని ఉన్నదా ?. ఆయన తండ్రికాదు, మిత్రుడూకాదు, శత్రువూకాదు, మిత్రుడూకాదు. జ్ఞాని కాదు, అజ్ఞానికాదు, శూరుడుకాదు, చోరుడూకాదు, దేవుడూకాదు, దెయ్యమూకాదు. నీకు ఆయన వయసుం, కులము, మతము, లింగము, వృత్తి ఉద్యోగాలను గురించి తెలుసుకోవాలని వున్నదా? ఆయన దేశ కాల, కుల మత, జాతి వర్ణ లింగ, వ్యవహారాలన్నింటికి అతీతుడు. అయినప్పటికి, నీ ఉబలాటం తీర్చడానికి, నీ ఊహాజనితమైన తలంపులతో నీవు స్థిరపరచుకొన్న రూపనామాలతోనే ఆయన్ను గురించి నేను నీకు చెప్పగలను. అయితే నీ ఊహాజనితమైన అట్టి రూపనామాలలో నీవే మునిగి పోతావనే సందేహం నాకువుంది. అందువల్ల, నీకోరిక మేరకు ఆయన ఏవిధంగా ఉండాలో ఆవిధంగానే ఉండాలని గాకుండా, వాస్తవంగా ఆయన ఏవిధంగా ఉన్నాడో అలాగే చూడు.

నా గురువువలె ఎవ్వరు లేరు. అయితే, ప్రతివాడు ఆయన ప్రతి బింబమే. నాగురువు ఒక్కడంటే ఒక్కడే, అయితే, అందరిలో ఆయన ఉన్నాడు. నాగురువు సామాన్యులలో ఒక్కడు, అయితే సామాన్యతలోకూడా ఆయన ఒక్కడే. ఆయన్ను నీవు సమీపించలేవు. అయితే ఆయన నీయందే ఉన్నాడు. ఆయన ఎవరిని దగ్గరకు చేర్చుకోవాలని నిర్ణయించుకొంటాడో అతనినే తీసుకొంటాడు.

వాస్తవంలో, ప్రతివాని హృదయమును ఆయనయొక్క నివాసంగా యేర్పరచుకొన్నాడు. నేను మాత్రం ఆయన్ను నా హృదయాధీసునిగా ఏర్పరచుకొన్నాను. ఆయన అక్కడ ఉన్నప్పుడు నేను లేను. నాహృదయంలో ఇద్దరు ఇమడడానికి వీలులేనంత యిరుకుగా ఆయన తీర్చిదిద్దినాడు.

నీవు దూక బోయేముందు చాలా వివేకవంతుడవని అనుకొంటావు. అయితే నేను చాదస్తునివలె చాలా లోతుకు దుమికాను. నా సంభ్రమాశ్చర్యముకొద్ది, అది ఒక అమరత్వమనే మహాసముద్రమని కన్గొన్నాను. నేను చెప్పేది విను. అనుమానాలు, అపోహలన్ని వదలివేసి ఒక్కసారి ఎగిరి దూకి నాగురువుగారిలో లయమవ్వు. ఆయన్ను చూడడానికి వేరే మార్గంలేదు.

ఓం తత్ సత్

**"My Master"**

From the Book 'Call of the fellow traveler,' (page 230)

# (17) చిత్శక్తి

## (17) POWER OF THOUGHT

ప్రియమైన బాబూజీ, సోదర సోదరీమణులారా !

ఈ శుభ సందర్భమున, ఇప్పుడు చెప్పబోయే నా ఉద్దేశ్యాలను మీరు సావధానంగా దయచేసి వినగలందులకు మీముందు ఉంచడానికి నేను ఇష్టపడుతున్నాను.

భగవంతుడు ఈ జగత్తునంతా సృష్టించాడని మత రీత్యా ఉండే అభిప్రాయము. అయితే, ఈ సృష్టించడానికి ఆయనకు ఎంత కాలం పట్టిందని అంటే, విజ్ఞాన శాస్త్రకారుల సిద్ధాంతాల ననుసరించి కొన్ని కోట్ల సంవతసరాల కాలం పట్టిందని తెలియ జేస్తున్నాయి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మొదలైన దివ్యరూపాలు మబ్బువలె అస్పష్టమైన పదార్థమునుండి (ఉపకరణము) ఒక క్రమ పద్ధతిన పరిణామం చెందడానికి కొన్ని కోట్ల సంవతసరాల కాలం పట్టిందని శాస్త్రకారులు సిద్ధాంతీకరించారు. అయితే, ఈ అస్పష్టమైన పదార్థం శక్తి నుండి పరిణామం చెందడానికి క్రమ పద్ధతి ఏమిటో ఇంకా పరిశోధనలు జరుపవలసి ఉంది. అంతేగాక, ఈ శక్తి యొక్క మూలము, దాని స్వరూప లక్షణాలు ఏమిటో ఇంకా అవగాహనకు రావలసి ఉంది.

సృష్టి చేయాలంటే, - సృష్టికర్తయగు భగవంతుడు ముందుగానే భగవంతుడు అయివుండాలి. ఆయనలో సృష్టి కావాలనే ఉద్దేశ్యం, లేదా ఒక కదలిక లేదా క్షోభ కలిగినప్పుడే భగవంతుడు సృష్టికర్త అవుతాడు. ఆ కదలిక లేదా, ఉద్దేశ్యమే భగవంతుని కార్యకలాపా లన్నింటిని నిర్వహించడానికి మూల శక్తియై ఉంది. ఈ అర్థంతో చూచినప్పుడు, భగవంతుడు సృష్టికర్తయైనప్పుడు, సృష్టి ప్రారంభమయింది. అయితే, సృష్టి చేయాలని ఆయన ఎందుకు సంకల్పించాడు, అంటే, అది ఆయనకే తెలుసు. బహుశః అది ఆయన లీల, లేదా వినోదము కావచ్చు.

ఇప్పుడు ఆలోచనా శక్తియొక్క స్వరూప లక్షణాన్ని విచారిద్దాము. ఈ జగత్తుకు ఆధార భూతమైన శక్తి మానవునిలో కూడా ఉంది. మనిషి తన ఉనికికి మూలస్థానం ఈశక్తియని అనుభవ పూర్వకంగా తెలుసుకోగలడు. సమర్థవంతుడైన మన గురువుగారి పరిశోధనలవల్ల, ఈ శక్తినే సహజ మార్గంలో ఉపయోగ పెట్టుకోవడము జరుగుతున్నది గావున ఆయనకు ధన్యవాదములు.

అనుభవంలోకి వస్తేగాని ఈ ఆలోచనా శక్తిని గురించిన పూర్తి అవగాహన మనకు కలగడము కష్టము. వాస్తవంలో, దాన్ని గురించిన అనుభవము ఎల్లప్పుడూ మనకు ఉంది. అయినప్పటికి, అది ఎప్పుడూ అగోచరంగానే ఉంది. ఎందువలన ఆవిధంగా ఉంది, అంటే దానికి కారణం స్పష్టంగా కనబడుతున్నది. శాస్త్రరీత్యా దాన్ని ఎప్పుడూ మనః స్ఫూర్తిగా పరిశీలిస్తామని అనుకోము. మనల్ని గురించిన వాస్తవికతను

తెలియజేసే దానినుండి మనం తప్పించుకొని పోతాము. లేదా, మనకు మనమే అభూత కల్పితమైన వస్తువిషయాదులతో ఒక ప్రపంచాన్ని సృష్టించుకొంటూ ఉండడము వల్ల ఆ విధంగా తప్పించుకొని పారిపోవడం తటస్థపడుతుంది.

అలాంటప్పుడు దాన్ని ఏవిధంగా తెలుసుకోవడము? ఇందుకు జవాబు చాలా సులభము. చింతన (ధ్యానము) చేయడమే. అది చేసినందువల్ల మనలో అంతర్ దృష్టి దానంతకదే వికసింప బడుతుంది. స్థూలమైన, జటిలమైన విషయాదులను గురించి పొరబాటుగా అర్థంచేసుకొన్నామనే ఎరుక వెంటనే ఏర్పడుతుంది. ఈ గందరగోళమంతా సాలెగూడుమోస్తరు మన ఆలోచనలతో అల్లినట్టిదే. ఈ గూడు మనల్ని పటిష్ఠంగా బంధించింది. అది ఇంకా ఘనీభవించి (వృద్ధిపొంది) ఇంకా ఘనీభవించడానికి దోహదంచేసే తత్వంతో వృద్ధి పొందింది. చేతనా రహిత స్థితిలో కూడా జడత్వమనేది తెలియ రానట్టిదిగా అగుపించినప్పటికి, దీని అల్లిక సమస్తము ఎంతో శక్తివంతంగానూ, పటిష్ఠంగానూ వివిధ రకాలైన గ్రంధులుగా ఏర్పడినట్లు కనబడుతున్నాయి.

ఈ విధంగా, ఆలోచననుండి సజీవశక్తి పరిణామం చెందడమూ, తదుపరి అదే శక్తి జడంగా పరిణామం చెందడమూ మన దృష్టికి స్పష్టంగా గోచరమవుతుంది. ఏ క్రమపద్ధతిలో ఈవిధంగా పరిణామం చెందినదో, ఇప్పుడు అదే క్రమంలో వెనక్కి మళ్ళించితే ఆలోచనయొక్క శుద్ధమైన, స్వచ్ఛమైన అంతిమ స్థితికి మనం

చేరవచ్చు. అందువల్ల మన శరీరంలోని ప్రతి కణము శక్తిగా మార్చవచ్చు. ఇంకా ముందుకు పోతే అట్టి ప్రతియొక్క కణమును దాని మూలస్థితిని పొందింపజేసి, దివ్యత్వాన్ని ప్రసరించగల దైవీకమగు కేంద్రములుగా తయారు చేయవచ్చు. ఈ విధమైన స్థితిని పొందినప్పుడు మానవుడు, తన ఉనికి సంపూర్ణంగా మార్పు చెందినట్టిదై, మానవాతీతుడుగా అవుతాడు.

ఆలోచనా రహితులగు కొందరు తమకు తామే గురువులమని ప్రకటించుకొని, ఏకాగ్రతసాధించడానికి, భావాతీతస్థితిపొందడానికి కొన్ని ఆలోచనా రహిత మైన సాధనాపద్ధతులను ప్రవేశపెడుతూ ఉంటారు. వాస్తవంలో, సహజమైన రీతిలో పవిత్రమైన, ధర్మయుక్తమైన ఆలోచనలను, కలుగ జేయునట్టిదే, సరియైన సాధనా పద్ధతి. తేలికైన మానసిక ధ్యాన,సాధనా, పద్ధతులను సమర్థవంతుడైన వ్యక్తి ద్వారా పొందితే, త్వరితగతిన సత్ఫలితాలను పొందడానికి వీలుగలుగజేస్తుంది. సరియైన సాధనాపద్ధతిలో, మనసునను క్రమమైన పద్ధతికి రాగలందులకు, మలవిక్షేపాలను తొలగించి పవిత్రత చేకూర్చుటకు, ఆలోచనలపై అధిపత్యం ఏర్పడగలందులకు కృషి జరుగుతూ ఉంటుంది.

ప్రకృతిసిద్ధంగా, నిష్కళంకమైన తలంపు చాలా సూక్ష్మంగానూ, తేలికగానూ, సులభంగానూ ఉంటుంది. సామాన్యంగా మన ఎరుకలో ఉండేది దీనికి భిన్నంగా, - అంటే వ్యతిరేకంగా ఉండే స్థితియే. ఇది సాధారణమైన వ్యతిరేకము కాకుండా, ప్రతియొక్క వ్యతిరేకచర్య వల్ల

ఒక జడత్వ స్థితినుండి మరొక జడత్వస్థితిని పలుమార్లు పొందినట్టి బహు క్లిష్టతర మైన వ్యతిరేక స్థితి. ప్రకృతిసిద్ధంగా ఉన్న స్థితిని పునః మనం పొందగలిగితే దానిపై మనకు అధిపత్యం లభించగలదు.

వాస్తవికతనుకూడా కాదని త్రోసిపుచ్చి, ప్రస్తుతానికి సర్వం మనోకల్పితమనే సిద్ధాంతాన్ని ద్రుఢపరచాలనే ఉద్దేశ్యము కాదు. మానవులయొక్క బుద్ధిని తీర్చిదిద్దడములో ఆలోచన ఎంత శక్తివంతంగా పనిచేస్తుందో అప్పుడప్పుడు ఈ మనోకల్పితమనే సిద్ధాంతము, తెలియజేస్తుంది. వాస్తవాన్ని తెలుసుకోడానికి, పరిశీలనా దృక్పథముతో, ఏవిధమైన పక్షపాత వైఖరిలేకుండా శాస్త్రీయమైన పద్ధతి ననుసరించడమనేది ఎల్లప్పుడూ అవసరము.

అయినప్పటికీ, కొంతవరకు ఊహకూడా అవసరమే. అది ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది. నిరాకారమనిగాని, సంపూర్ణమనిగాని, భగవంతుడనిగాని, లేదా మరేపేరుతోనైనా ఊహించుకోడము అన్నింటికన్న సులభమైనది, సర్వవిధాల క్షేమకరమైనది. ఈ రంగమందు అన్వేషణలకు ఆలోచనా శక్తియే ముఖ్య ఆయుధము. దాన్ని సక్రమమైన పద్ధతిలో వాడడమే కావలసినది. దీని మీద ఆధిపత్యం వహించిన వ్యక్తియొక్క సహాయము చాలా లాభదాయకంగా ఉంటుంది. అంతేగాక, ఉన్నత స్థాయిలలో అతని సహాయము అత్యావసరముకూడా.

మానవుని మూలశక్తిని ఉపయోగ పెట్టుకొనే విషయాన్ని, కన్గొన్న ఖ్యాతి సహజమార్గ వ్యవస్థాపకునికే చెందుతుంది. ఏదో ఒక రూపంలో ఈ శక్తిని ఉపయోగ పెట్టుకోడము ప్రాచీన ఋషులకు తెలిసియున్నప్పటికి, మానవుడు చేరగల స్థితికి ఒక పరిమితి లేదా హద్దు ఉన్నదని నిశ్చయించారు. కాని, మన గురు మహానుభావుడు, ఈశక్తివల్ల ఏవిధమైన హాని లేనట్టి, వెంటనే ఫలితాల నిచ్చునట్టి అత్యంత ఆశ్చర్యకరమైన పద్ధతిని కన్గొన్నందులకు వారికి ధన్యవాదములు.

మందత్వముతోనూ, జడత్వముతోనూ కూడిన స్థితులను అధిగమించిన తర్వాతకూడా, సూక్ష్మమైన ప్రాపంచిక స్థితులను, అహంకార దశలను ఒక స్థాయి తరువాత మరొక స్థాయికి పురోగమించడము కష్టతరంగా ఉంటుందని, ఆధ్యాత్మికంగా కొంతవరకు, పురోభివృద్ధి సాధించి ఉన్నత స్థితులనందు కొన్నవారికి తెలుసు. అహం అనేది, ఎంతటి అపురూపమైన స్థితియందున్నప్పటికి ఏదోకొంత సూక్ష్మాతిసూక్ష్మ మైన రూపంలో పొడసూపుతూనే ఉంటుంది. కొంతమంది ఋషులు, ఈ 'అహ' మనేదే భగవంతుడని కూడా తీర్మానించారు. మరికొంతమంది, శరీరమున్నంత వరకు బంధవిముక్తి యనేది అసంభవమని తమ అనుభవాలను ఆధారంగా చేసుకొని బోధించారు.

ఉన్నత స్థితి గతులను పొందే విషయంలో మానవుడు ఒక పరిమితిని దాటి పోలేడనే నిర్ధారణ చేసినట్లేనని అనిపిస్తున్నది. అయితే

'కేంద్ర' మను ప్రాంతమును కనిపెట్టిన మహానీయుడు అట్టి అభిప్రాయము సరికాదని ద్వారాలు తెరిచారు. ఇప్పుడు మానవుడు ఉన్నత స్థాయిలను పొందడములో ఎట్టి పరిమితులు లేవు. 'అనంత' మహాసాగరమందు తన ఈదులాటను నిర్విరామంగా కొనసాగించవచ్చు. కేంద్రము వరకు దాదాపు చేరవచ్చు. ఎందుచేతనంటే, ప్రాణాహుతి పద్ధతిన యోగశక్తి ప్రసారితము చేయుట వల్ల, అత్యంత ఆశ్చర్యకరమైన పద్ధతిలో దాన్ని సాధించవచ్చు. ప్రాణాహుతి శక్తి ప్రభావం వల మార్గము అత్యంత సుగమమవుతూ, వెనుకకు దిగజారడ మనేదానికి అస్పదం లేకుండా దశలవారిగా ముందుకు పురోగమిస్తూ ఉంటాడు.

ప్రపంచము ఉండవలసిన రీతిన తీర్చి దిద్దడములో శ్రీ రాంచంద్ర మిషన్ చాలా ప్రాముఖ్యత వహించవలసి ఉంది. భవిష్యత్తులో మహత్కార్యసాధన కొరకు తగురీతిన దాని సభ్యులను తయారు చేయబడుచున్నారు. ఘోరమైన విధ్వంసకర మారణా యుధాలను కనిపెట్టబడినందువల్ల, ఈనాటి ప్రపంచము అత్యంత భయకంపితమై ఉంది. ఇట్టి విధ్వంసకర మారణాయుధాలను పొంది, ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం పొందినవాడు గర్వపడుతూ ఉంటే, తన విరోధి చేతిలో కూడా అట్టి ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం వున్నదని తెలిసినప్పుడు ఇంకా భయపడుతున్నాడు. అయితే, ఈ ప్రాపంచిక శక్తులన్ని ఆధ్యాత్మిక శక్తి ముందు పిల్లవాని ఆట వస్తువులని మనకు తెలుసు. ఇట్టి ఆధ్యాత్మిక శక్తిపై అధిపత్యం సంపాదించమని మన సంస్థ ప్రతి ఒక్కరిని అహ్వానిస్తున్నది. ఈ శక్తి

-- అనగా ఆధ్యాత్మిక శక్తికి - ప్రపంచంలో ఎన్నిశక్తులున్నాయో వాటినన్నింటిని మించి విధ్వంసంచేయగల శక్తి కలిగి ఉండడమే గాక, గొప్ప నిర్మాణాత్మకమైన శక్తి, సృష్టించే శక్తి కూడా కలిగి ఉంది. సహజ మార్గ సాధనా పద్ధతి, ప్రారంభ దశనుండి, ఆలోచనా శక్తిని స్వాధీనంలోకి తెచ్చుకోడముగాని, లేదా క్రమబద్ధంచేసి తగురీతిలో మార్పుచెందుటకు గాని దోహదము కలుగ జేస్తుంది. ప్రకృతికి అనుగుణంగా దీనిని ఉపయోగ పెట్టడము మనపైననే ఉంది.

మహాత్ములైన మనగురువుగారు ప్రారంభించిన కార్యమును, వెలుగులోకి తెచ్చి తద్వారా ప్రపంచాన్ని వినాశకర శక్తుల వల్ల కలుగబోవు విపత్తులనుండి కాపాడుట కొరకు ఈ రంగంలో పరిశోధనలు జరుపుతూ, విషయాలను తెలియజేయ వలసిన బాధ్యత మనందరి పైనా ఉంది. ఆయన వలె మన మందరము తయారు కావలెననే ధృఢ సంకల్పము చేస్తే, అదే ఆయన్ను గౌరవించినట్లవుతుంది. అతి తక్కువ సమయంలో, అత్యున్నత స్థితిని పొందగలమని ఆయన మనకు అభయమిస్తూ, అందుకు ఆయనే నిదర్శనంగా జీవించి యున్నారు. ఆయన వెలుగు సర్వవేళలందు మనందరిని మార్గమందు నడిపించు గాక !

**ఓం శాంతిః**

**"Power of Thought"**

From the Book 'Call of the fellow traveler,' (page 69)

Written by **Pujya Sri. Raghavendra Rao.** Raichur

## (88) ప్రాణాహుతి లేక యోగశక్తి ప్రసారితము
## (58) *Pranahuti* or Transmission

యోగశక్తిని మీరు ఎట్లా ప్రసారం చేస్తారనేది తెలుసుకోవాలనే అభిలాషతో కొంతమంది అభ్యాసులు అడిగిన ప్రశ్నకు నేను చాలాసార్లు జవాబు చెప్పవలసి వచ్చేది. " నాకు తెలియదు" అనే జవాబు నుండి "నేను నా ఇచ్ఛాశక్తిని ఉపయోగ పెడుతా" ననే జవాబు వరకు, చాలామందికి సంతృప్తిని కలుగజేసిందని తెలిసి నాకు ఆశ్చర్యం కలుగజేసింది. ప్రతిసారి జవాబు చెప్పినప్పుడు, ఏవిధమైన సంకోచము, సంశయము నాహృదయంలో లేకుండా ఖచ్చితంగా చెప్పానని అనిపించింది.

నిజమైన అన్వేషకులకు దాన్ని గురించి ఇప్పుడు ఇంకా క్షుణ్ణంగా తెలియచేస్తున్నాను. "ప్రసారం చేసేది నీవుకాదు, నేను కాదు. నిజమైన ప్రసారకుడు మరొకరున్నారు" అని మన గురువుగారు ఒకప్పుడు నాకు వ్రాసిన మాటలు జ్ఞాపకానికి వస్తాయి. గనుక 'ఎట్లా' అనే విషయం పరిశీలనచేసే ప్రయత్నానికి ముందే అసలు ప్రాణా హుతి అంటే ఏమిటో నన్ను విశదపరచనివ్వండి.

ఆంగ్ల భాషలో 'ట్రాన్‌సమిషన్' అనే మాటకు సంస్కృతభాషలో 'ప్రాణాహుతి' అనేది సమానపదం. భాషాపరంగా దీని అర్థమేమంటే, "తన ప్రాణశక్తిని త్యాగం చేయడమని (లేదా, ధారపోయడమని)" అర్థం. ఆధ్యాత్మిక మార్గమందు అభ్యాసి ముందుకు పోవడానికి, గురువుగారు అత్యంత ప్రేమతో అభ్యాసికి సహాయము చేయాలనే ఉద్దేశ్యాన్ని ఇది కనబరుస్తుంది. మన గురువుగారు దైవత్వంతో ఉండేవారు. ఎప్పుడైతే ఆయన అభ్యాసివైపు ప్రత్యేకంగా దృష్టి మళ్ళిస్తారో, ఆయన అనంతమైన ప్రేమ అభ్యాసి హృదయంపై కేంద్రీకృత మవుతుంది. అది, దైవానుగ్రహాన్ని అభ్యాసిలోకి నేరుగా ప్రవహింపచేస్తుంది. ఆ విధంగా ప్రాణాహుతి జరుగుతుంది. అభ్యాసి కూడా అదే పద్ధతిలో ప్రయత్నం చేసినప్పుడు, అట్టి అనుగ్రహం నేరుగా పొందుతూ ఉంటాడు. అనగా, అభ్యాసి దృష్టికూడా గురువుగారి హృదయంపై ప్రేమతోనూ, అత్యంత ఆరాటంతోనూ కేంద్రీకృతం చేయాలి. అప్పుడు మాత్రమే సరియైన, సంపూర్ణమైన గ్రహింపు ఉంటుంది.

అందువలన, ప్రాణాహుతి అంటే భగవదనుగ్రహాన్ని సింపడము. ఏవిధంగా అది చేయబడుతుంది? అంటే, అది మరల గురువుగారు చేయవలసిన పనే. మానవుడు తన నిజ తత్వాన్ని మరచి, ఆలోచనా శక్తిని దుర్వినియోగంచేసి తనకే ఆటంకములు కలుగ చేయునట్టి ముడులను సృష్టించి, అట్టి ముడులతో తనచుట్టూ ఒక వలను అల్లుకొని, అందులో బంధింపబడి ఉండడము చేత, దైవ శక్తి ప్రసరణకు ఆటంకము కలుగ చేస్తూవుంది. మరలా యథాస్థితికి

రావడానికి, ఈ అల్లికను ఛేదించాలి. సమర్థవంతుడైన గురువు, తన ఇచ్ఛా శక్తిని ఉపయోగించి ఆపని చేయగలడు. సంస్కారాలతోనూ, పొరలతోనూ కలుషితమైనట్టి హృదయాన్ని శుభ్రపరచి, ఆటంకాలను తొలగిస్తాడు. పోగొట్టుకొన్న సామ్రాజ్యాన్ని తిరిగి పొందగలందులకు, అభ్యాసికి సహాయం చేయాలనే పటిష్టమైన గురువుగారి ప్రేమే ఆయనపై వొత్తిడి కలుగజేసి తన ప్రాణశక్తిని ధారపోసేట్లు చేస్తుంది. పొందవలెననే తాపత్రయ పడే అభ్యాసి హృదయంలోకి, తగినంత ఇచ్ఛా శక్తినుపయోగించి, గురువుగారు మూలశక్తిని ప్రవేశింప చేస్తాడు. ఖచ్చితమైన ఫలితాన్ని పొందాలంటే, అభ్యాసి గురువుకు సహక రించడమే. ఎంతమటుకు అభ్యాసి భగవదనుగ్రహానికి ఆటంకము కలుగజేస్తాడో, అంతమటుకు అతనికి పురోభివృద్ధి లేకుండా ఆలస్యము జరుగుతూ ఉంటుంది.

ప్రాణాహుతి వల్ల గురువు గారు ఒక్కుమ్మడిగ క్షణంలో అల్లికలను ఛేదించి, జిజ్ఞాసికి ఉన్నతమైన స్థితిని కలుగజేయవచ్చు. అయితే, సామాన్యంగా అభ్యాసి అందుకు సంసిద్ధుడుగా ఉండడు గనుక, వివేకశాలియైన గురువు అట్టి అపాయకరమగు పనిని అకాలంగా చేయడు.

చివరగా, ప్రాణాహుతియనేది కేవలం వ్యక్తిగతంగా ప్రత్యక్ష అనుభవ విషయమని నేను స్పష్టంచేస్తున్నాను. దానిని గురించి పలువిధములైన వివరణలు, వర్ణనలు కేవలము బుద్ధిచే సారాంశమును

గ్రహించడానికి మాత్రమే ఉపయోగపడుతాయి. ప్రత్యక్ష అనుభవం కోరేవారు సమర్థవంతుడైన గురువు వద్దకు ప్రేమతో, నమ్మకంతో విశ్వసించి వెళ్ళి ఆ అమృతంయొక్క రుచిని గ్రోలవచ్చు.

ఓం శాంతిః

## *Pranahuti* or Transmission

From the Book 'Call of the fellow traveler.' (page 241)
Written by **Pujya Sri. Raghavendra Rao.** Raichur

# (62) గురువుగారి జన్మదిన కానుక

## (62) A Birthday Present to Master

ఆంగ్ల మూలం పూజ్యశ్రీ రాఘవేంద్ర రావు.

సహజమార్గ అభ్యాసి కొన్నిమార్లు ధ్యానానికి కూర్చున్నతర్వాత. తన అంతర్ముఖ స్థితిని గురించి విచారించడం మొదలు పెడతాడు. ఈవిధంగా మనఃపూర్వకమైన విచారణ అనేది ప్రాణాహుతి యొక్క మొట్టమొదటి సత్ఫలితము. తనలోనుండు స్థూలత్వాన్ని కొంతవరకు తొలగింప బడినప్పుడు, చాలా సులభముగా సూక్ష్మస్థితులను గురించి అతను ఆలోచన చేయడానికి సమర్థత కలిగి ఉంటాడు. కొంతవరకు అతనిలోని సంస్కారాలను తొలగింప బడినప్పుడు అతని ఆలోచన స్పష్టంగానూ నిర్మాణాత్మకంగానూ జరుగుతూ ఉంటుంది.

క్రమేణా, అతనికి అభ్యాసమునందు శ్రద్ధ అంతకంతకు ఎక్కువ అవుతూ ఉంటుంది. అతిత్వరితగతిన గురువుయందు ప్రేమ అభివృద్ధి చెందుతూ ఉంటుంది. అంతకంతకు ప్రాణాహుతిని పొందాలనే ఇచ్ఛ అతనికి ఉంటుంది. ఉన్నతోన్నతమైన స్థితిని పొందవలెనే కోరిక ఎక్కువయ్యే కొలది అతనిలో అశాంతిని కలుగ జేస్తుంది. హృదయములో జడత్వమనేది ఎక్కువగావుంటే, ఈ అశాంతియందు యిష్టము ఉండకుండా అతను అభ్యాసాన్ని వదలి వేయవచ్చు. హృదయంలో సంస్కార బలము చాలా

పటిష్టంగా ఉంటే, ఈ అశాంతిని పోగొట్టు కోడానికి అతను ఇతర జడ సంబంధమైన మార్గ పద్ధతులవైపుకు మళ్ళవచ్చుకూడా. అవిధంగా కాక, సహజమార్గ పద్ధతిలో సంపూర్ణమైన విశ్వాసము, ధైర్యము అభ్యాసికి ఉంటే, గురువుగారి యోగశక్తిప్రసారితానికి (ప్రాణాహుతికి) అంటిపెట్టుకొని అతి త్వరలోనే ఉన్నతమైన స్థితులను చేరుకొంటాడు. ఎందుచేతనంటే, ప్రాణాహుతి అనేది జడత్వాన్ని, సంస్కారాలను తొలగించి, అభ్యాసిని తదుపరి ఉన్నతమైన స్థాయిని పొందేట్లుగా చేస్తుంది.

ఇట్టి ఉన్నతమైన స్థాయికి, ఒకవిధమైన తేలికదనము, ఆనందము, అంతర్ముఖంగా బంధాలనుండి విముక్తి, లేక సూక్ష్మమైన దివ్యమైన స్థితియందు వ్యాపకం చెందినట్లు అనుభవాలు తోడై ఉంటాయి. ఈస్థితిలోనే శాశ్వతంగా ఉండిపోయేటంత అహ్లాదకరంగానూ, అకర్షణీయంగానూ అభ్యాసికి అనిపిస్తుంది. గురువుగారినే జీవిత లక్ష్యంగా పెట్టుకొన్నప్పుడు, తాను తన కోర్కెలకు లొంగిపోకుండా ఇంకా ఉన్నతస్థాయిలకు తనని తీసుకొని పొమ్మని గురువుగారిని ప్రార్థిస్తాడు. అప్పుడు మరల అతనికి అశాంతి ఏర్పడి, పైన తెల్పినవిధంగా మరల అదేవిధమైన అనుభూతి పొందుతూ ఉంటాడు, అయితే అట్టి అనుభూతి మరొక విధమైన సూక్ష్మత్వంతో, పరమానందముతో కూడి వుంటుంది.

ఈ విధంగా, సహజమార్గ అభ్యాసి యొక్క అంతర్ముఖ స్థితి పోనుపోను, కేవలము భావనా మాత్రము మిగిలి, చివరకు ఆ భావన

కూడా 'అనంతమందు' లయించువరకు సూక్ష్మత్వం చెందుతూ ఉటుంది.

మనము ఏస్థితిలో ఉంటే మనల్ని ఆమహోన్నత స్థాయికి తీసుకొని పోవడానికి అయనకు ఆసక్తి, అశాంతి కలుగజేయునో అట్టి స్థితిలో మనమందరము, ప్రియమైన బాబూజీగారి ఈ జన్మదినోతసవ సందర్భంలో మనకుమనమే అర్పించుకొందుము గాక.

1977 ఏప్రిలు, 1978

**ఓం శాంతిః**

**"A Birthday Present to Master"**
From the Book 'Call of the fellow traveler.' (page 255)
Written by **Pujya Sri. Raghavendra Rao.** Raichur

# దైవముతో మానవుని అనుసంధానము

## (64) Dynamic connection of Man with God.

(1) సూర్యోదయానికి కొంచెం ముందు, చీకటి వెలుగుల సంధి కాలమే వేకువ ఝాము. ఆధ్యాత్మికత యొక్క అంతిమ స్థితికి ఒక విధమైన ప్రతి రూపమే, ఈ సంధ్యాకాలం. యోగి అయినవాడు పొందవలసిన స్థితి ఇది. వాస్తవంలో ఇది చీకటి వెలుగులకు అతీతంగా ఉండే స్థితి. హృదయంలోని దివ్యతేజస్సుపై ధ్యానం చేయడమువల్ల, అభ్యాసికి తన లక్ష్యాన్ని గురించిన భావన ఈ సమయంలో చాలా పటిష్టంగా అభివృద్ధి చెందుతుంది. సూర్యాస్తమానానికి మునుపు, సాయం సంధ్య వేళలో ఉష్ణ తీవ్రత బహిర్గతమవుతూ వుండడముతో చల్లదనం ప్రవేశిస్తున్నదని సూచిస్తుంది. ఈ సమయము, అంతర్ శుద్ధి కావించుకోడానికి, నిర్మలీకరణ చేసుకోడానికి అన్ని విధాల యుక్తమైన సమయం. సహజ మార్గ పద్ధతిన సాయంకాలము నిర్మలీకరణ (శుద్ధి) కార్యక్రమమువల్ల, ఆశించిన సత్ఫలితాలను త్వరితగతిన పొందగలడు. కోపము, తాపము, ఆకలి, ఉద్రేకము, మోహము మొదలగునవన్ని ఉష్ణముయొక్క వివిధ దశలు. వాటి ప్రభావాలను గురించి పర్యవసానాలను గురించి ఎంతైనా చెప్పవచ్చు. కాని, వీటిని గురించిన ప్రత్యక్ష స్వానుభవము వల్లనే సరియైన అవగాహన ఏర్పడుతుంది. ఎవరైనా క్రమము తప్పకుండా, ఒకే స్థళంలో ధ్యానం చేస్తూవుంటే, ఆస్థళం పవిత్రతతోనూ, దైవీక స్పంధనలతోనూ నిండి ఉంటుంది.

ఎవరైనా ఆ స్థళం దగ్గరకు వెళ్ళినప్పుడు, తనలో పవిత్ర భావనలు కల్గడము గుర్తించగలడు. ఒకే ఆసనమందు ఒద్దికగా కూర్చోవడమనేది అంతిమ స్థితి యొక్క సూక్ష్మ ప్రతిరూపమే. దీనిని యోగియైనవాడు పొందాలి. ఇది బాహ్యమైన వ్యాపకాలన్నింటిని తనలోనికి లీనం చేసుకొని, దైవానుగ్రహాన్ని పొందడానికి నిరీక్షిస్తూ ఉండే స్థితి. ఏవిధంగానైతే భగవంతుడు ఒక్కడే నిష్కల్మషమైన, పవిత్రమైన, అద్వితీయమైన సచ్చిదానంద స్వరూపుడో, అదేవిధంగా యోగియైనవాడు ధ్యాన సమయంలో అట్టి పరిపూర్ణ పవిత్రతను శారీరకంగానూ, మానసికం గానూ అనుకరిస్తూ ఉండాలి. గనుక సహజమార్గ దశాదేశ నియమాలలోని మొదటి ఆదేశము మానవునికి, భగవంతునికి మధ్య మొదట్లోనే ముఖ్యమైన సంబంధమును అభివృద్ధిచేసి, కాలము, ప్రాంతము, ఆసనము, పవిత్రత మొదలయినవాటిని గురించిన సూక్ష్మ భావనలతో గట్టి అనుబంధము అభివృద్ధి గలుగజేసి, అనుచిత ఆలోచనలతో చేసిన కార్యములన్నిటిని దైవముఖంగా మళ్ళింప జేస్తుంది.

(2) భగవత్ సామ్రాజ్యంలోకి ప్రవేశించాలంటే, ప్రార్థనా పూర్వకమైన లేదా, వినయ పూర్వకమైన వైఖరి ఎంతో అవసరము. స్వల్పమైన వస్తు విషయాదుల కొరకు ప్రార్థించడమనేది పిల్లచేష్టగా ఉంటుంది. సర్వోన్నతమైన భగవంతునికి బానిసలుగా పడివుండే చిల్లర దేవుళ్ళను ప్రార్థించడము ఇంకా హాస్యాస్పదం. తన కోర్కెలకు తానే బానిసగావున్న స్థితిని, వినయ విధేయతలతో గమనించుతూ,

అత్యంతోన్నతమైన స్థితిని పొందుట కొరకు అట్టి అత్యంతోన్నతమైన దానిసహాయముతో, దానిపైనే ధ్యానం చేయడానికి ప్రారంభం చేయాలి.

(3) మానవ సాధ్యమగు ఉన్నతోన్నతమైన దైవీక స్థితిని ఎంతవరకు పొందగలమో, అంతటి ఉన్నత స్థితి, లేదా భగవంతునితో సంపూర్ణ లయావస్థ పొందడమనేదే ధ్యానసాధనల యొక్క లక్ష్యము. త్వరితగతిన పురోభివృద్ధి కొరకు లక్ష్యాన్ని పొందాలనే తీవ్ర ఆరాటమే ఉండవలసిన సరియైన స్థితి.

(4) అంతర్గతంగా, తనను గురించి తాను కలుగజేసుకొన్న భావనలు, అభిప్రాయాలు, సంస్కారాలు అన్నింటిని పారద్రోలినప్పుడు, నిరాడంబరమనేది దాని ఫలితంగా ఏర్పడుతుంది. ప్రకృతితో తాదాత్మ్యం చెందడానికి ఈ నిరాడంబరత దోహదకారి అవుతుంది. ప్రకృతియొక్క శక్తులు సరళంగానూ, మృదువుగానూ ఉంటాయి. అంతేగాక, సహజంగావుండే చక్రాలు, గ్రంథులు కూడా తగిన శక్తిని అవసరమైన చోట్ల యివ్వడానికి కేంద్రాలుగా ఉన్నాయి. వాస్తవంలో ప్రకృతి యొక్క శక్తుల ప్రవాహం నిలిచి పోవడమంటూ ఏమి లేదు. అయితే, మానవుడు తన సామర్థ్యాలన్నింటిని, అసంఖ్యాకములైనట్టి, పరస్పరం విరుద్ధములైనట్టి కోర్కెలకు బానిసుడై కలుషితం చేస్తున్నాడు. అందువల్ల, అంతర్గతంగా చిక్కులతోనూ, జడత్వము తోనూ ముందుకు సాగిపోలేక నిలబడి పోతున్నాడు.

(5) నిరాడంబరమయ, నిష్కపటము లనేవి మానవునిలోని యథార్థ తత్వాన్ని బహిర్గతంచేస్తాయి. అందువల్ల, ఉన్నదున్నట్లుగా ఏవిధమైన భయము, సంకోచము లేకుండా తనను తాను గోచరింప జేసుకొంటాడు. ఈవిధమైన యథార్థము, నిరాడంబరము, నిష్కపటము మానవునిలో ఒక తృప్తిని కలుగజేస్తాయి. దీనివలన తనకు ఏదైనా బాధలు, కష్టాలు కలిగితే అవి దైవముచే ప్రసాదింపబడిన వరములుగనూ, బహుమానములుగనూ భావించి స్వీకరిస్తాడు. ఇవన్నికూడా అంతఃశ్శుద్ధికి దోహదంచేస్తాయని పరిగణిస్తాడు.

(6) అభ్యాసిలో ఈ విధమైన దృక్పదం పూర్తిగా స్థిరపడినప్పుడు, అన్నింటియందు, అన్నివేళలా, అందరియందు భగవంతుడున్నాడనే అనుభవం పొందడము ప్రారంభమవుతుంది. సమస్తము ఆ మూలమునుండి ఉద్భవించినదని, అ మూలముతో సంబంధము కలిగి ఉన్నదని గోచరిస్తుంది. పురుషులు, స్త్రీలు అందరూ తన సోదర సోదరీమణులని గమనించి, సహజంగానేవారిపట్ల తనప్రవర్తన మార్పుచేసుకొంటాడు.

(7) ఎవరైనా అట్టి సహృదయునికి హాని తలపెడితే, అతనిపట్ల కృతజ్ఞతతో ఎట్టి ప్రతీకార ఆలోచన తన మనసులో లేకుండా ఉంటాడు.

(8) నీతి నిజాయితీగా ధనాన్ని ఆర్జించడమువల్ల, సదా భగవత్ చింతనతో భుజించడము వల్ల పై తెలిపిన స్థితులన్ని ఇంకా అభివృద్ధి చెందుతాయి.

(9) పై స్థితులన్ని అభ్యాసిలో, సాత్విక స్వభావాన్ని, పవిత్రతను కలుగజేస్తాయి. ఇతరులు అట్టి అభ్యాసిచే సహజంగానే అకర్షింపబడి, అదేవిధంగా వారుకూడా మార్పు చెందుతారు. అవిధంగా అభ్యాసి, తన ఆదర్శ జీవనంవల్ల సమస్త మానవకోటిని పరిణామంచెందేట్లు, అధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదగడానికి ఏ విధమయిన బాహ్య వొత్తిళ్ళు, ఆయుధాలు లేకుండానే వారిలో మార్పుతేవడానికి సహాయపడతాడు.

(10 ఎన్ని స్థితులున్నప్పటికి, అతను మాత్రం సమర్థ సద్గురువు మాత్రమే తన గురువనిన్ని, తనుమాత్రం అతని బంటునని అనుకొంటాడు. తప్పుచేయడము మానవ సహజమనే లోకోక్తిపట్ల ఎరుక గలవాడై, తాను చేసిన తప్పిదములకు పశ్చాత్తాప మనసుతో, మన్నించమని, క్షమించమని, ఇకమీదట చేయనని, ప్రేమపూర్వకమైన నిండు సహృదయంతో గురువును స్మరించడము తన విద్యుక్త ధర్మమని అవిధంగా పాటిస్తాడు. నిద్ర కుపక్రమించే ముందు చేసే ప్రార్థన తన నిద్రనంతా నిర్మలమైన ప్రార్థనా స్థితిగా మార్పు చెందడమే గాక, అట్టి స్థితి సర్వ సమర్థుడైన తన గురు దేవుని సాన్నిధ్యంలో తాను ప్రార్థనా స్థితిలో నిరంతరము వుంటాడు.

ఆ విధంగా, సహజ మార్గ దశా దేశ నియమాలు భగవంతునికి, మనవునికి మధ్య ప్రయోగాత్మకమైన అనుబంధాన్ని ఏర్పరుస్తాయి. ఈ దశాదేశాలు, భగవన్ముఖంగా మానవుడు ఉన్నత దిశగా పయనము సాగుతున్నప్పుడు, అనుభవంలోకి వచ్చే స్థితులు గనుక, ఇవి కేవలం బలవంతంగా అమలు చేయడానికి చెప్పబడిన నీతి వాక్యాలు కావు.

ఓం శాంతిః

**'Dynamic connection of'Man with God**
From the Book 'Call of the fellow traveler,' (page 260)

# అజ్ఞాన (అవిద్య) తెర

Evil Veil

హిరణ్మయేన పాత్రేణ, సత్యస్యాపిహితం ముఖం,
తత్వం పూషన్నపావృణు, సత్యధర్మాయ దృష్టతే

అవిద్యయను తెర బాధలకు మూలకారణమని పూర్వ కాలంలో మహర్షులు నిర్ధారించారు. ప్రతి వ్యక్తి తాను ఇతరులకంటే వేరని భావిస్తాడు. ఇట్టి వేరనే భావన పైచెప్పబడిన తెర - అజ్ఞానంవల్ల మెదట్లో కలుగుతుంది. అందువల్ల ఏకత్వము - అంటే, (అభేదత్వము యెక్క) నిజమైన విలువ పోయి, దాని స్థానే బూటకపు విలువలకు స్థానం లభించి, రాగము, ద్వేషము, సుఖము దుఃఖము మొదలయిన ద్వంద్వాలకు దారి తీసింది.

బాధయొక్క యధార్థాన్ని కాదని త్రోసివేయడానికి చాల ధైర్యం ఉండాలి. బాధ ఒక్కటే యధార్థమని అనిపిస్తుంది. బాధ అనేదే లేదని త్రోసిపుచ్చడం మరొక బూటకానికి రూపకల్పన చేసినట్లవుతుంది. మహాసముద్రము లోని నీరు వెనుకకు మళ్ళి నప్పుడు కయ్యలలో నిలచిపోయిన నీరులాటిదని అనిన మహాయోగి నిజంగా ధన్యుడు. ఎప్పుడూ ఉన్నది ఒక్క ఆనందమే, అదే శాశ్వతమైన జ్ఞానము, దాన్ని పొందడమే పురుషార్థమని లేదా పరిపూర్ణ లక్ష్యమని అన్నప్పుడు, బాధఅనేది అట్టి ఆనందానికి విపరీత స్థితియని సహజంగానే గుర్తించాలినవస్తుంది.

దురదృష్టవశాత్తు, బుద్ధిపూర్వకంగా మనం చేసిన ఆలోచనలే ఈ తెరకు కారణమయినాయి. అంతేగాక, ఇది మన జ్ఞానానికి అతీతంగా ఉండేది. అతీంద్రియ స్థితిలోని జ్ఞానంవల్ల ఈ తెరను గుర్తించగలమని వాదించవచ్చు. అయితే, మనకు ఈ అతీంద్రియ ఉనికిని అతీంద్రియజ్ఞానంతో అవగాహన చేసుకోడమంటే, అనేక శిరసులు, అనేక చేతులు, పెద్ద ఉదరము కలిగియున్న భగవంతుడినే మనము ఊహించుకొని, అతీంద్రియంగా ఆహ్లాద పడడముతప్ప అంతకంటే ఎక్కువగా ఏమి కనిపించడము లేదు. ఆధ్యాత్మికత మాత్రమే సత్యము, మహోన్నతమైనది, అయినా దానికి భౌతిక మనేది సమాంతరంగా ఉన్నదని అన్నప్పుడు, ఈ రెండింటి సమన్వయంవల్ల, సర్వత్రా నిండియుండేదనే మరొక ముఖ్య లక్షణాన్ని దానికి ఆపాదించబడినందువల్ల సమస్య ఇంకా జటిలంగా తయారయింది. ఈవిధమైన గందరగోళంవల్ల వెర్రిపుట్టించడం చాలదన్నట్లు, దీనికి తోడు అనంతత్వమనే మరొక లక్షణాన్ని జోడించి సమస్యను ఇంకా క్లిష్టతరము చేయడం జరిగింది. ముగింపు కొరకు, చివరకు అది అనిర్వచనీయమని అన్నారు.

వాస్తవంగా ఇది అంత క్లిష్టమైన విషయమేనా అని ఆశ్చర్యమేస్తుంది. ఒక రాజుగారివద్ద అనేకమంది పండితులు ఈ జగత్తుయొక్క సృష్టినిగురించిన అనేక విషయాలను వివరించగా, ఆ రాజుగారువిని, చివరకు భగవంతుడు నన్ను సలహా అడిగివుంటే

చాలా సులభమైన ప్రణాళికను నేను తయారు చేసి ఆయనకు ఇచ్చివుండేవాడిని కదా అని అన్నాడట. ఇక్కడ ఒక సందిగ్ధస్థితి ఉంది. అంతిమ సత్యము చాలా సామాన్యంగానూ, సులభంగానూ, నిరాడంబరంగానూ ఉన్నదనేది మానవునికి అంతర్ముఖంగా అనిపించినప్పటికి, ప్రతిసారి తానుకన్గొన్న విషయాన్ని విశదీకరించి బహిర్గతం చేయడానికి కొంత జటిలమైన సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టడము తప్పనిసరి అవుతుందని భావిస్తున్నాడు. ఈ విధంగా ఇప్పుడు ఉండే శాస్త్రసిద్ధాంతాలన్ని పూర్వముండే రసాయన సిద్ధాంతాలమాదిరే దిగ్భ్రమ కల్గించడములో ఏమి తీసిపోదు. సాధారణ వ్యక్తికి సాపేక్షిక సిద్ధాంతమంటే ఎంత నమ్మదగినదో అదేవిధంగా ప్లాగిటసన్ సిద్ధాంతముకూడా అంతనమ్మదగినదిగా ఉంటుంది. ఒక సిద్ధాంతముయొక్క వాస్తవాన్ని, దాన్ని విశదపరచే సామర్థ్యమునుబట్టి ఉంటుందని అంటే, ఇంతవరకు ఉండే ఏ సిద్ధాంతాలుకూడా తృప్తికరంగా లేనట్లు కనిపిస్తాయి. అంతిమ సత్యాన్ని, గమనించినట్టి అంశాలద్వారానే నిర్ధారించాలనే దృక్పధం అజ్ఞానమనే తెరను ఇంకా పటిష్టం చేసినట్లయి, అదే ఆటంకంగా తయారవుతుంది. గుర్రానికి ముందు బండిని కట్టినట్లుగా ఉంటుంది.

శక్తికి ఆధారభూతమైన కారణాలను క్రొత్తగా వెలికి తీసుకొనిరావడంలో శాస్త్రవేత్త ఉత్సాహవంతుడైతే, యోగి అయినవాడుకూడా ప్రకృతి శక్తిపై ఆధిపత్యం వహించడానికి అదేవిధంగా ఉత్సాహ వంతుడవుతూ ఉంటాడు. అయితే,

శాస్త్రవేత్తకు తాను చేయదలచుకొన్న పరిశోధనలకు ఆర్థికంగా మరొక యజమానిపై ఆధారపడవలసి వస్తుంది. అందువల్ల శాస్త్రవేత్తఅట్టి యజమాని యొక్క అభిప్రాయాలకు, అవసరాలకు అనుగుణంగా పరిశోధన చేయాలిఎవస్తుంది. ఉదాహరణకు, కాలమనుదానిని శక్తిగా రూపొందించవచ్చని పరిశోధన ద్వారా కన్గొన్నప్పుడు, అది తన యజమాని యొక్క ఇష్టాయిష్టాలకు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉంటే, శాస్త్రవేత్తకు ఉద్వాసన పలుకుతాడు. ఇక అది కాలగర్భంలో మునిగిపోతుంది.

కాని, యోగి అయినవాడు తన ఇచ్ఛననుసరించి పరిశోధనలను జరపడానికి సర్వ స్వతంత్రుడై ఉంటాడు. అయితే, అంతకంటే తీవ్రమైన మరొక విధమైన అపాయాలు ఇతనికి ఉన్నాయి. ఉదాహరణకు, యోగి అయినవాడు కాలమనే శక్తి మీద ఆధిపత్యం వహించగల్గి, తన భౌతికదేహాన్ని కొన్ని వేల సంవతసరాలు జీవించగల్గులాగున ఆ శక్తిని ఉపయోగపెడితే అప్పుడు వాడు ఒకపెద్ద బండరాయికంటేనో లేక ఒక పెద్ద వేప చెట్టుకంటేనో గొప్పగా ఏమి ఉండడు. అందువలన, శక్తిని పొందడమనే విషయంగా అవాంఛనీయమైన తెర అనేది పెద్ద ఆటంకంగా ఉంటుంది. అందువలన, అతను ఈ తెరను ఛేదించడమో లేక, తనకు తనే ప్రకృతికి అనుగుణంగా సంపూర్ణంగా మలచుకొని ప్రకృతి శక్తులపై ఆధిపత్యం సంపాదించి వాటిని సక్రమమైన రీతిలో ఉపయోగపెడుతూ ఉండడమో చేయాలి.

సామూహికంగా వ్యక్తులయొక్క సంపూర్ణ శ్రేయసునకంటే, వ్యక్తిగత సంపూర్ణ శ్వేచ్ఛ ముఖ్యమా అనే విషయంగా అనేక భిన్నాభిప్రయాలున్నాయి. సాంఘిక, ఆర్థిక, రాజకీయ సిద్ధాంతా లన్నింటికీ, ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమైతే, నిష్కళంకమైన శాస్త్రాలన్నికూడా పరిపూర్ణమైన శాస్త్రకారుడినే కోరుతాయి. యోగము, ఆధ్యాత్మికములనేవి వ్యక్తిని పరిపూర్ణంగా చేయడమే ఆదర్శంగా కలిగి ఉంటాయి. ధర్మయుక్తమైన సమాజమంటే, ధర్మయుక్తమైన వ్యక్తులయొక్క సముదాయమేనని అన్నప్పుడు, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, తదితర శాస్త్రవేత్తల యొక్క కలలు నెరవేరాలంటే, కేవలము యోగము, ఆధ్యాత్మికములనే రెండు మార్గముల ద్వారానే అట్టి సమాజము బహుశః సాధ్య మవుతుంది. ఎంతయినా ఆదర్శము ఆదర్శమే. అయితే, సత్య మనేది పలుమార్లు మన ఇష్టాయిష్టాల ననుసరించి ఉండదు. సృష్టి, స్థితి లయాలనేవి ఎంత వాస్తవమో, మరణము, వ్యాధులనేవి అంతకంటే ఎక్కువగా ఉండే చేదు వాస్తవాలు. మనో కల్పితమైన సత్యమనేది అన్ని మూలఅనర్థాలకు బునాదే కాకుండా మూలసత్యాన్ని పొందాలనే సహజమైన ఆరాటానికి కూడా అవరోధంగా ఉంటుంది.

మానవుని వివిధ పరిణామ దశల ననుసరించి అతని ఆలోచనకూడా అనేకవిధాలుగా ఈ తెరను గురించి ఊహించ బడింది. మానవునిలోని దైవీక కిరణము దారితప్పిపోయి, స్థూలమైన వాటియందు గట్టిగా తగుల్కొని పోవడము జరిగింది. రక్త

మాంసాదులతో కూడినవాటికే అవాంఛనీయమైన తెరయనే పేరు ఆపాదించబడింది. అటుతర్వాత ఆలోచనలు, కోర్కెలు, కామ క్రోధాదులు, కష్టములు మొదలగువాటితో ఉండే సూక్ష్మ శరీరాలకు ఈ తెరను ఆపాదించబడింది. పరిణామం చెందడానికి ఒకే ఒక్క అవాంఛనీయమైన తెర ఏమిటి అంటే అది ' అహం' అనేదేనని కన్గొన్నారు 'అహం' అనేది కరగిపోయినప్పుడు, తెర మాత్రం ఉండిపోయి, శరీరం ఉన్నంతవరకు తదుపరి పురోభివృద్ధి లేదని అనుకొన్నారు. ఈ స్థితిలో యోగముకాని, ఆధ్యాత్మికతకాని,స్థంభించి పోయినట్లుగా అనిపించింది. 'అవాంఛనీయ' మనే విషయాన్ని గురించి కాక పోయినా, 'తెర' అనుదాన్ని గురించిన మర్మము ఇంకా అట్లానే ఉంది.

అవసర మేర్పడినప్పుడు, మానవ జాతిని ఉద్ధరించడానికి ప్రకృతి ఒక మహాపురుషుడిని పంపిస్తుంది. యోగ, ఆధ్యాత్మిక రంగాలలో మూసపోసినట్లు యాంత్రికంగాను, జడత్వంగాను ఒకేవిధమైన సాధనా పద్ధతులు తయారయినాయి. అప్పుడు సరియైన మార్గపద్ధతిలో మనకు మార్గము చూపించడానికి ఒక నూతనతేజసుగ ఆకాశంలో దర్శనమిచ్చింది. ఒక బ్రహ్మాండమైన ఆధ్యాత్మికమగు అలను అట్టి దృష్టి కలిగినవారు కన్గొనగలిగారు. ఈ తెర అంటే ఏమిటనే వాస్తవాన్ని మన గురువుగారు తన పరిశోధనలవలన మనకు తెలియజేయబడింది. అందుకు వారికి కృతజ్ఞతాభి వందనములు.

సూక్ష్మాతి సూక్ష్మమైన ఉనికి చుట్టూ జడత్వం వృద్ధిచెందడమే ఈ తెర ఏర్పడడానికి మూలకారణము. సూక్ష్మాతి సూక్ష్మమైన ఈ ఉనికి మూల సత్యముతో విడరానిదై ఉంటున్నది. పూర్వ ఋషులు, అహంకారమే ఒక ఆటంకంగా ఉండే తెర అని కన్గొన్నారు. అంతమటుకు అది సరియైనదే, సందేహము లేదు. అయితే, మానవుడు పొందదగిన స్థితికి ఇదే చివరి హద్దుయని అన్నప్పుడు, బహుశః వారి దృష్టి స్థూల సంబంధమైన తెరపై దృష్టిని నిలిపినట్లుగానో, లేదా ఏదో కారణము వల్ల వారు అంతకంటే ఉన్నత స్థితులవైపుకు ప్రాణశక్తిని ఎందుకో ఉపయోగించ లేదనుకోవాలి లేదా, వాటితో అవసరము లేదని అనిపించి ఉండాలి.

ఈ శరీరముతో ఉంటూ అహంకారమనే జడత్వాన్ని అధిగమించ గలందులకు ఆస్పదమున్నదని సహజమార్గ సంస్థాపకులు ప్రత్యక్షంగా నిరూపణ చేసారు. ఇట్టి సూక్ష్మాతి సూక్ష్మమైన, అపురూపమైన అహం అనే తెర దృష్టికందడము చాలా సున్నితమైన విషయమనేది సందేహం లేదు. అయినప్పటికి, మానవుడు పొందదగు ఉన్నతమైన తేజోమయమైన స్థాయిలతో పోల్చి చూచినప్పుడు అదికూడా చాల జడత్వమనే చెప్పాలి. ఈ తేజోమయమగు స్థాయిలను పొరలు లేక కోశములని కూడా అనవచ్చు.

కేంద్రము చుట్టు తేజోమయమగు ఏడు వృత్తముల యొక్క వ్యత్యాసములను మన గురువుగారు తన పరిశోధనలలో

# అపారము, అనంతము

«««««««««««««««

పెద్ద పెద్ద పర్వత శ్రేణుల్నిగాని, మహాసముద్ర తీరాలను గాని, దట్టమైన అడవులనుగాని లేదా రాత్రివేళ ఆకాశాన్ని గాని చూడు. అపారమగు వీటిని గురించిన ఆలోచనలతో దిగ్భ్రమ చెందుతావు. సమర్థవంతుడైన ఒక సద్గురువుని నిన్ను నీవు సంపూర్ణంగా మరచి మనఃస్ఫూర్తిగా ప్రేమించుట ద్వారా నీవు అనంతమను దానిని పొందుతావు. అపారమనేది దిగ్భ్రాంతిని కలుగ చేసేదయితే అనంతమనేది సంపూర్ణ శూన్యత్వాన్ని కలుగ చేస్తుంది. ప్రజలు భయంవల్ల ఆరాధిస్తారు, గనుక వారియొక్క ఆరాధనఅంతా కూడా అహం ను కాపాడుకోడానికో, లేదా పెంపు చేసుకోడానికో మాత్రమే ఉంటుంది. అపరిమితమనేదానిని ఆరాధిస్తూ వారు పరిమితులుగల వాటిలోనే చిక్కుకొని ఉంటారు. వారు భగవంతుడిని గురించి చింతన చేస్తున్నప్పుడు వారికి అపారమనుదానిని గురించిన ఆలోచనలు వారి ఊహకు అందినా, వారుమాత్రం ఆయన్ను వారి సిద్ధాంతాల పరిధిలోనే పరిమితం చేస్తున్నారు.

భగవంతుడిని గురించి నిజంగా అన్వేషించే జిజ్ఞాసి అనంతత్వంపైనే దృష్టి కలిగా ఉంటాడు. అయితే అతని అన్వేషణ మనఃపూర్వకమైనయెడల, చిన్న పరిధులనుండి విశాలమైన పరిధుల వైపు పురోగమిస్తూ ఉంటాడు. పరిమితంగా ఉండే అతని దృష్టి అంతకంతకు పరిమితులను దాటి వ్యాపకం చెందుతూ ఉంటుంది. అలాటప్పుడు మంచి ధైర్యంతోనూ, పటిష్టమైన నిర్ణయంతోనూ

పరిమితులతోఉండే సన్నిహిత విషయాదులపట్ల బంధములను తెంచివేసినప్పుడు అతని దృష్టినుండి దిఙ్మండలము (అంటే, భూమ్యాకాశాలు కలిసినట్టు అగుపడే ప్రదేశము) కూడా అంతర్థానమై, అనంతమనే మహాసముద్రంలో ఈదు లాడుతున్నట్లు అనుభవం పొందుతూ ఉంటాడు.

పరిమితులను ఛేదించడానికి అతి సులభమైన పద్ధతి ఏమనగా, ఎవడు తనపరిమితులను ఛేదించి అధిగమించి ఉంటాడో అట్టివానితో అనుసంధానం ఏర్పరచుకోడమే. అట్టివాడు ఎవరై ఉండగలడు? ఉన్నదున్నట్లుగా అట్టివాని స్థితికన్గొనడానికి మార్గమేమి?. ఇచ్చట, 'అపారము', 'అనంతము' అనేవాటిని గురించి గందరగోళముపడి ఆగోతిలో పడకుండా బాగా అవగాహన చేసుకోడంలో జాగ్రత్త పడాలి. అపారమైన తెలివితేటలు, అపారమైన శక్తి సామర్థ్యాలు, అపారమైన వస్తువిషయ సంపద, అపారమైన ఆకర్షణలుకలిగి అపారంగా వశంచేసుకోగల్గిన వారు కొరతలేకుండా అపారంగా ఉన్నారు. పైన తెలిపిన అపారమైన వన్నికూడా పరిమితులు కల్గిన వస్తువిషయాదులే. నిజమైన గురువు అన్వేషకుని హృదయాన్ని ఇట్టి వానితో మభ్య పెట్టడు. నిజమైన గురువు వద్దకు వచ్చినవ్యక్తి తనయొక్క పరిమితులను మరచిపోయి గురువుకు తనకుమధ్య అభేదత్వాన్ని అనుభవిస్తాడు. అట్టి గురువుతో ఎంతో సన్నిహితత్వం ఉన్నట్లుగా భావిస్తాడు. తన స్వగృహానికి చేరు కొన్నట్లుగా నిజమైన గురువు యొక్క సమక్షంలో అనుభూతి కలుగుతుంది. అనంతమనే దానికి అన్యమనేది ఏవిధంగా లేదో,

అదే విధంగా అట్టి గురువుకూడా నిజంలో ఒక్కడే ఉంటాడు. అట్టి గురువుతో సంబంధ మేర్పరచుకొన్నప్పుడు అన్వేషకునియొక్క వ్యక్తిగతమైన పరిధులు, మర్మములు అన్నీ కూడా అంతరించి పోతాయి.

ఆటంకాలను ఛేదించి, పరిమితత్వం నుండి అపరిమితత్వం వైపుకు ఏవిధంగా గురువు సహాయం చేయగలడు? ఎవరైతే అనంతత్వముతో బాగా స్థిరపడి ఉంటాడో అతను ఇఛ్ఛా శక్తి కలిగి ఉండడమేగాక అట్టి ఇచ్ఛాశక్తికి అపరిమితమైన శక్తి కలిగి ఉంటుంది. అట్టివాని ఇఛ్ఛాశక్తికి పొరపాటూగాని తప్పిదము గాని ఉండదు. గనుక ఎవడైనాసరే ఒక్కసారిగాని తప్పిదం జరిగినా, వానికి ఎంత అపారమైన శక్తులున్నా అట్టి వాడు అనంతత్వమును పొందినట్లు కాదు. వాస్తవంలో, అనంతత్వమను దానిముందు అపారమనేది నిరర్థకము. పరిపూర్ణమైన గురువు అభ్యాసిలో గాని, అన్వేషకునిలో గాని ఆశించిన విధంగా ఫలితం చేకూరడానికి తన ఇఛ్ఛాశక్తినిఉపయోగిస్తాడు. అన్వేషకుడు "దాన్ని" పొందడానికిగాను అతని హృదయంలోకి గురువు ప్రాణాహుతిశక్తిని ప్రసారం చేస్తాడు. పరిమితత్వంనుండి అనంతము వైపుకు చేరుస్తాడు. అప్పుడు అపారమనేది శాశ్వతంగా అంతర్థానమై పోతుంది.

ఓం శాంతి

**Immensity and Infinity**

From the Book 'Call of the fellow traveler,' (page 105) Written by

**Pujya Sri. Raghavendra Rao.** Raichur : తెలుగు అనువాదము టి.వి.శ్రీనివాసరావు అడ్వొకేటు,కడప

# నా పద్ధతి, నా కర్తవ్యం

బాబూజీ గారి రచన

నా అనుభవము విస్తృతమైనదేమి కాదు. నాకు ఏమి తెలియదనిమాత్రం నాకు తెలుసు. నా జీవితమనే పుస్తకాన్ని చదివాను. తద్వారా తెలివిఅనేది అంతర్ధానమైంది. నేను గుడ్డిగా ప్రయాణం చేసాను. నేనేమి చేస్తున్నానోకూడా చూడకుండినాను. ఏ మార్గమును అధిగమించి పోతున్నానో నాకు తెలియదు. ఇప్పుడు మీకందరికి ఏలక్ష్యాన్ని నిర్దేశించినానో అట్టిదే నాలక్ష్యమని కూడా నాకు తెలియదు. నా దృష్టియావత్తు కేవలం ఆ పరమపవిత్రమైన ఉనికిగలవాని పరంగా నా సర్వస్వం అర్పణ చేయడంతప్ప మరేమి తెలియదు. అంతకు మించి మరేవిధమైన దృష్టి నాకు లేదు. అదేస్థితి ఇప్పుడుకూడా ఉంటున్నది. భేదమేమంటే, ఇప్పుడు అట్టి విచక్షణకూడా అంతరించి పోయింది.

గుడ్డివాడు ఏమి చూడలేడు. నేనుకూడా గుడ్డివాడినయిన తర్వాత, వాస్తవంలో నేను చూడడానికి, భావించడానికి ఏమిలేదు. గొప్ప భక్తుడైన సురదాసు చూడదగనివి చూడకుండా ఉండగలందులకు ఆయన కళ్ళను పీకేసుకొని గుడ్డివాడయ్యాడు. నేను చేసినది ఏమంటే, ఆయన్ను చూడడానికి నా దృష్టిని అంతర్ముఖంగా ఆయనవైపు మళ్ళించడమే. ఆవిధంగా జగత్తు యొక్క రూపనామాలు నాహృదయమీద ఎట్టి భారం పడకుండా ఉండినది.

మనలోనుండి మనకే (శబ్దము) ధ్వని ఉత్పన్న మవతూ ఉండే మానవులం మనం. మరొక విధంగా చెప్పాలంటే, సంపూర్ణ సమత్వ స్థితి అనుభవంలోకి వచ్చినప్పుడు నిశ్చలత్వము లేదా, అచంచల స్థితి సహజంగా ఉన్నదని చెప్పవచ్చు. దీని తరువాతనే, సమస్త వస్తువిషయాదులకు ఉనికి ఏర్పడింది. ఇట్టి అంతిమ గమ్యానికి మనం కూడా వినయ విధేయతలవల్ల చేరవచ్చు. అయితే మనం వినయ విధేయతలతో ఉన్నామనే స్పృహ కూడా మనలో లేకుండా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. మనం గొప్పతనాన్ని చేరుకోవాలి. ఈ గొప్పతనానికే ఏకత్వమని పేరు. అయినప్పటికి దాన్ని గురించిన జ్ఞానము మనకు లేదు. మనకు మనమే గొప్పదనాన్ని ఆపాదించుకొంటే అది మన పురో గమనానికి తీవ్రమైన ప్రతిబంధకముగా ఉండడమేగాక, మనం చేరుకోవలసిన చోటుకు చేరుకోలేము. ఎవరేగాని ఇతరులకంటే తాను ఏ విషయంలోగాని, ఏ విధంగాగాని, ఏ క్షణంలోగాని అధికుడిననే భావనకూడా రానివ్వకూడదు. దయచేసి ఈ మంచి మాటలను గమనించండి. "పొరబాటు అనేది లేకుండా ఏ పొరబాటు ఉండదు" బహుశః దీని భావన ఈ క్రింది వాక్యాలు విశదపరచవచ్చు. 'నేను కొన్నిమార్లు సంతోషంగా ఉంటాను, మరికొన్నిమార్లు దుఃఖముతో ఉంటాను, కాని నా స్థితి ఏమిటో నాకు తెలియక, కలలోచిన్నపిల్లవాని మోస్తరు నేను ఏడుస్తుంటాను, మరల నవ్వుతుంటాను.

వాస్తవికస్థితిని పొందకుండానే ఇతరులకు శిక్షణ ఇవ్వడానికి

ప్రారంభంచేస్తే శిక్షణ ఇచ్చేవాడు పతనమయ్యే అవకాశం ఉంటుంది. శిక్షణ ఇచ్చేవాడు తాను శిక్షణ ఇచ్చేవాడనే తలంపు హృదయంపై భారం వహించకుండా ఉంటేనే అతనికి శిక్షణ ఇవ్వడానికి అనుమతి ఇవ్వబడుతుంది. తాను (అహం) అనే తలంపు పూర్తిగా తొలగిపోయినప్పుడే అట్టి స్థితి ఏర్పడుతుంది. తన, మన, అనే భేదం లేకుండా, భగవంతుని ఆదేశాలను అమలు చేస్తున్నాననే తలంపుమాత్రం కలిగి, మంచి చెడులతో ఏమాత్రం నిమిత్తం లేకుండా ఉంటాడు. అట్టి వ్యక్తికి ఆదేశమంటే ఆదేశమే.

గురువుగారి పనిని ఏదికూడా నిలుపలేదు. ఈ ఆధ్యాత్మిక పురోగమనము అతిత్వరలో సంపూర్ణంగా వ్యాప్తి చెందుతుంది. ఆధ్యాత్మికమైన పురోభివృద్ధిపట్ల ఏ స్థాయిలోకూడా తృప్తి చెందకూడదు. తృప్తి అనే ఆలోచనను కాకులకు పారవేయాలి. మన గురువుగారు ఆయన జీవితకాలంలో ఎప్పుడేగాని తృప్తి చెందలేదని చెప్తారు. తర్వాత మహోన్నతమైన అంధకారమందు ఈదులాట సాగుతూనే ఉండినదని అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అనంతమైన మహాసముద్రాన్ని ఎవరేగాని దాటలేకపోయారు. మహోన్నత స్థితిని పొందిన వ్యక్తుల విషయమే ఈ విధంగా ఉంటే తక్కువ శ్రేణిలో ఉన్నవారి సంగతి ఇక చెప్పడానికేమున్నది.

**బిసియార్ నఫర్ బాయేద్ త పుక్తా షావాద్ ఖామీ**

**Journey should be long so that rawness may ripen)**

(పచ్చిగా ఉండేది పక్వానికి రావాలంటే దీర్ఘకాలం ప్రయాణం సాగాలి.)

అంతర్ శక్తిని ప్రయోగించి అన్నివిధాలైన లోపాలను తీసివేయవచ్చు. ఏదైనా లోపాన్ని తీసివేయాలని మనిషి వాస్తవంగా సంకల్పిస్తే అట్టిది తొలగింపబడకుండా ఉండడానికి అస్పదంలేదు. మనిషికి ధైర్యమనేది ఉన్నప్పుడు భగవంతుని సహాయము అక్కడే ఉంటుందని ప్రాచీన కాలం సూక్తి. నా గురువుగారి సమక్షంలో ఉండడానికి భౌతికంగా పంద్రెండుమార్లకంటే ఎక్కువగా అస్పదం లేకుండా ఉండినది. కాని ఆయననుండి నేను దూరంగా ఉన్నాననే ఆలోచన నా మనసునలో ఎప్పుడేగాని రాలేదు. ఆయనతో నేను చాలా సన్నిహితంగా ఉన్నాననేది నాకు తెలుసు. అంతేగాక, ఆయనకు ఇష్టములేని పని ఏదీకూడా చేయడానికి జంకుతూ ఉండేవాడిని. ఈ విధంగా ఆయనతో నేను ఎప్పుడూ ఉన్నాననే తలంపు సంపూర్ణ విశ్వాసమువల్లనే కలిగి ఉంటుంది. ఈ విషయాలు,అంశములు జరుగబోవు జీవన విధానానికి సహాయ కారులుగా ఉంటాయి. నేను ఒక పద్ధతి తెలియ చేస్తున్నాను. అది ఏమంటే, ఏదైనా అవాంఛనీయమైనది వృద్ధిచెందితే దాన్ని తక్షణం నాకు తెలియచేయండి, లేదా నాకు అప్పజెప్పండి. మరొక విధంగా చెప్పాలంటే, అది నా పొరబాటుగానో లేదా నాలోపంగానో అనుకోండి. ఇది చాలాసులభము, అయినప్పటికి విశేషమైన ఫలితాన్ని ఇస్తుంది. ఈ పద్ధతి చాలా పొగరుబోతు, అమర్యాద

కరమైనదని నా సోదర అభ్యాసి ఆక్షేపించాడు. అందుకు నేను, నిజమే, ఆవిధంగా ఉండవచ్చుగాక, అయితే నాలోని సద్గుణాలు, యోగ్యమైన లక్షణాలు మాత్రం నాకునేనే ఆపాదించు కొన్నప్పుడు గాని లేదా, గురువుగారు అసంపూర్ణుడైఉన్నా నీవు చెప్పేది వాస్తవమని జవాబు చెప్పాను.

మనం ఒకరికొకరు ఏవిధంగా సాధ్యమయితే ఆవిధంగా సహాయం చేయవలసిన భాధ్యత ఉంది. ఏవిధంగానైతే శరీరములోని అవయవాలన్ని శరీరానివో, అదేవిధంగా మానవు లందరు ఒకరికొకరు అవయవాలే. ఒకరికి మరొకరు ఆధారమై ఉంటారు. నేను మాటలద్వారా కాని లేక మరేయితర బాహ్యమైన పద్ధతులద్వారా కాకపోయినా, నాహృదయంతో అందరి శ్రేయస్సుం కొరకు ప్రార్థిస్తుంటాను. భగవత్ సృష్టిలోని సమస్త జీవరాసులు సుఖ శాంతులతో ఉండాలని హృదయంలో సహజంగా దానంతకదే కాంక్షిస్తూఉండే ఒక ఆధ్యాత్మిక స్థితి ఉంది.

సర్వ కాలములందు నిరంతరముగా ప్రార్థన జరుగుతున్న ప్పటికి అట్టి ప్రార్థన జరుగుతున్నదనే స్పృహకూడా లేకుండా జరిగే ప్రార్థనే సరియైన ప్రార్థన. ఒకవేళ అట్టి స్పృహ ఉంటే, ప్రార్థన చేసేవాడు తన అహంకారానికి బలి అయిపోయే ప్రమాదం ఉంది. ఒకవేళ తన ప్రార్థన లేదా, ఆశీర్వాదం వల్ల ఏదైనా అన్నట్లు జరిగితే తాను చాలా విశిష్ట వ్యక్తియని, గౌరవింప తగినవాడని అనుకోవడం

కద్దు. అయినా అతని ఉద్దేశం మంచిదయితే ఇదేమి అంత ప్రమాదకరం కాదు.అందువల్ల అన్నిచోట్ల ముఖ్యంగా హృద యాన్నిబట్టే ప్రతి విషయం ఉంటుంది.

ఇప్పుడు తానుఅను స్థితినుండి పైకి ఎదగాలిఎన అవసర ముంది. పై దానితో, అనగా (మూలముతో) బంధమేర్పరచుకొని అదేమిటో చూడండి. అహా! ఇది హిందువులకు వారసత్వంగా వచ్చినట్టిది.. అయితే దాన్నిగురించి శ్రద్ధ చూపడానికి, అవగాహన చేసుకోడానికికూడా సమయం చిక్కడము లేదు. మహాప్రళయం తర్వాత ఇంకా స్వర్గంఅనేది ఉంటుందో లేదో తెలియకపోయినా, నమ్మకమున్న వారందరికి స్వర్గాన్ని ప్రసాదించమని మహమ్మద్ ప్రవక్త సిఫారసు చేస్తాడని ముసల్మానుల నమ్మకం.

వైవిధ్యమనేది ఆధ్యాత్మికతకు విషంలాంటిది. మనకు మనమే శ్రేష్ఠులమని భావించినప్పుడు, ఇక సర్వశ్రేష్ఠుడైన పరమాత్మను ప్రేమించడమనే ప్రశక్తేలేకుండా పోతుంది. మనకు మనమే చాలా స్వల్పమైనవారమని భావిస్తే శ్రేష్ఠమైన దానిని సేవించేందుకు మనహృదయం సుముఖంగా ఉంటుంది. ఇదే సన్మార్గము. తగ్గు స్థితిలో ఉండేవాని కంటే తాను ఉన్నతమైన స్థితిలో ఉన్నానని ఎవరైనా అనుకొంటే అట్టివాడు తను ఉన్న స్థాయినుండి కిందికి పడిపోవడం ఖాయమని ఒక యోగి అంటాడు.

మనము ఇతరుల కులాన్నిబట్టి, గౌరవాన్ని, ఆధిక్యతను లెక్కించడం జరుగుతున్నది. ఒకపెట్టెలోని భాగాలవలెనే ఈ కులాలన్నికూడా. అవసరమైనప్పుడు పెట్టె అని అంటామేగాని, అందులోని భాగలను కాదు. అన్ని విభాగాలు పని చేసేవాడు చేసినవే. పని సౌలభ్యంకొరకు వేర్వేరు భాగాలుగా అమర్చుకొన్నవే. పెట్టెను తెరచి చూస్తే అన్ని భాగాలు ఒకదానితో మరొకటి కలిసే ఉంటాయి. అయితేకూడా అన్ని భాగాలకు కొయ్యగాని, ఇనుము గాని ఆధారమై ఉంటున్నది. కబీరు చక్కగా ఈ మాటలు అంటాడు. 'పవిత్రమైన సాధుపుంగవుల పాదాలనాశ్రయించి తగ్గు కులంలోనివారు మోక్షమొందితే, ఉన్నత కులంలోనివారు వారి కులాధిక్యతచే దానిలోనే మునిగి అంతరించి పోయారు.' ప్రకృతి తన గొడ్డలిని కుల వ్యవస్థయొక్క కూకటి వేళ్ళపై ఉంచింది. ఇక అది కాలాంతరమందు తప్పక అంతర్ధానము కావలసినదే.

అంతర్ ముఖంగా దృష్టిని మళ్ళించు. నీ ముందున్న ప్రపంచమంతా నీదికాదు నాదని అనుకో. అందువల్ల నీవు స్వేచ్ఛను పొందుతావు. నా సుఖభోగాల నిలయాన్ని ఇతరుల కోసం విడిచిపెట్టి, వారి దుఃఖాలకు, భాదలకు నేను గురి చేసుకొన్నాను. నా బంధవిముక్తి కొరకు నేనేమి ఆలోచించను. నాకు రెండు తొడుగులున్నాయి. ఒకటి తెల్లనిది, రెండవది నల్లనిది. పైన చెప్పినట్లు నల్లనిది ఇతరుల భాదలు కష్టాలు. నేను

శిక్షణ యిచ్చేవానిగా పని చేస్తున్నాను కాబట్టి వాటిని నేను పులుముకొన్నాను. మీయొక్క భాదలు, కష్టాలనే తొడుగులను తీసివేయండి. వాటిని నన్ను అనుభవించనివ్వండి. నానల్లని తొడుగుకు అవి చేర్చబడతాయి. మీరుమాత్రం తెల్లని తొడుగుతోనే ఉండాలి.

గురువుగారి కార్యక్రమం నిరంతరాయంగా శాశ్వతంగా ముందుకు సాగిపోవాలినందే. నా ప్రియమైన వారందరు బంధ విముక్తి, అంతకంటే ఇంకా, ఇంకా అతీతమైనదాన్ని పొందడానికి నా గురువుగారి ఈ పవిత్రమైన, సరియైన మార్గము ఇదొక్కటే కాబట్టి, దీనిద్వారా పొందమని కొరుతున్నాను.

((((((((((()))))))))))

ప్రచురింపబడని శ్రీ రాంచంద్రజీ మహరాజ్ (బాబూజీ) గారి హిందీభాషలో వ్రాసిన జాబుకు ఇంగ్లీషులో శ్రీ రాఘవేంద్రరావు అనువాదానికి తెలుగు అనువాదం.

(తెలుగు అనువాదం టి.వి.శ్రీనివాసరావు)

from the book of Call of the Fellow Traveller,(page 219)

by Sri. Raghavendra Rao, Raichur

# గురువును చేరుటకు

TOWARDS MASTER

ప్రియమైన సోదర సోదరీమణులారా,

ఉత్తర ప్రదేష్ లోని ఫతేఘర్ వాస్తవ్యులు శ్రీ రాంచంద్రజీ గారి జన్మదినోతనవం మన సంస్థకు చాలా పవిత్రమైన, ముఖ్యమైన రోజు. మనగురువుగారు సతసంఘులందరిని ఈ ఉతసవానికి రమ్మని ఆహ్వానిస్తారు.

మన మందరము గురువుగారి చెంతన చేరినప్పుడు, మన హృదయం ఏస్థితిలో ఉన్నదని గమనించాలి. సహజమార్గ అభ్యాసీ లయిన మనం సాధారణంగా మన ఆధ్యాత్మిక, తదితరములైన పురోభివృద్ధిని గురించి తెలుసుకోవాలని ఉంటుంది. చాలమంది అభ్యాసులు 'నాకు ఏదీ అనుభవానికి రాలేద'ని అంటారు. వారికి తెలియనందున అనుభవానికి వచ్చేట్లు దారి తెలియ జేయమని ప్రశిక్షకుడిని (ప్రిసెప్టరు) అడుగుతారు. హృదయముయొక్క స్థితిని తెలుసు కోడానికి యిక్కడ సాధనా పద్ధతి ఉంది. స్థితిని గురించి సూచించేది హృదయము. ఇక్కడ మనమంతా సమావేశ మయినాము. ప్రియమైనగురువుగారు మన అందరి హృదయాలలో వ్యాపకమై యున్నారు. సర్వత్రా వ్యాపకం చెందియుండే గురువు గారు అంతటా సర్వకాలములందు ఉన్నాడనే అనుభవం ఉంది. నీ హృదయంలో ఉండే ఈ స్థితిని గుర్తు ఉంచుకొంటే, ఆధ్యాత్మిక స్థితిని గురించి అవగాహన అవుతుంది. అదేవిధంగా ఇతర వ్యవ హార విషయాదులలో ప్రేమ, అప్యాయత, అభేదత్వము, గొప్ప

సంస్థతో అనుబంధము కలిగి ఉన్నామని, జీవితమనే నాటక ప్రదర్శనలో పాల్గొంటున్నామని మొదలయినవన్ని అనుభవంలోకి రావలసిన అంశాలు. నీవు హృదయంవైపు దృష్టి మళ్ళించినప్పుడు అది నీ ఆధ్యాత్మిక స్థితి గతులను సూచిస్తుంది.

సాధారణంగా అభ్యాసి తనకు ఏదో ఒక ఉత్సాహ పూరితమైన అనుభవం పొందాలనుకొంటాడు. అట్టి అనుభవం పొందకుండావుంటే ఎందువల్ల పొందలేకుండా ఉన్నానని వ్యాకులం చెందుతాడు. ఇంద్రియ సంబంధమైన అనుభవాలను పొందడము అలవాటుగా ఉన్నందున ఆ విధంగా అనుకొంటాడు. కాని ఈ విషయం వేరు. ఆధ్యాత్మికమైన అనుభవాలు ఇంద్రియాలకు అతీతమైనవి. గనుక నీవు అట్టి సూక్ష్మత్వాన్ని పెంపు చేసుకోవాలి లేదా, అట్టి సూక్షస్థితిని పొందడానికి తగిన సూక్ష్మత్వం వృద్ధి చేసుకోవాలి. అందుకు పద్ధతి ఏమి? మనం ప్రయత్నం చేయవలసిన ఒక సులభమైన పద్ధతి ఉంది. -- అది-సహజ మార్గ పద్ధతిలో నిర్ణయింపబడిన ధ్యానము, క్రమం తప్పకుండా అనుసరించే ప్రార్థన, మాలిన్య నిర్మూలన, నిరంతర స్మరణ. ఈ సులభమైన సాధనా మార్గమందు మన పురోభివృద్ధిని గురించి తెలుసుకోడములో నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది.

వాస్తవంలో, సహజ మార్గం నూతనంగా కనిపెట్టబడింది. యోగ శిక్షణలో నూతనమైన మార్గం. మునుపటి కాలంలో అనుసరించిన పద్ధతులు చాలా కష్టతరంగానూ, గందరగోళంగానూ

ఉండేవి. వీటిని గురించి విన్నంతనే ఆధ్యాత్మికమార్గంలోకి పోలేమని అనుకొని నిరుత్సాహ పడేవాళ్ళు. ఇతరత్రా పద్ధతులు కూడా చాలా క్లిష్టమైనవి, మరికొన్ని మార్గ్లు చాలాజటిలమైనవిగా ఉంటూ ఎవరైనా వాటిని అనుసరించినప్పుడు తిక్కపట్టడమో లేదా, మందత్వ మేర్పడడమో జరిగేది. యోగసాధనను గురించి భయమేర్పడింది. కొంతమంది బూటకపు గురువులు సమాధిస్థితియని పిలువబడే స్థితిని పొందడానికి కొన్ని మత్తు పదార్థాలుకూడా వాడడము, ప్రవేశ పెట్టడము జరిగింది.. గనుక సూక్ష్మమైన అధ్యాత్మిక స్థితిగతులను గురించిన ఆలోచనలు అంతరించిపోయి వాటి స్థానే స్థూల సంబంధమైన స్థితి, గతులే ఆధ్మాత్మిక అనుభవాలనే స్థితికి దిగ జారిపోయింది.

మనం పోగొట్టుకొన్న జ్ఞానాన్ని ఇప్పుడు సహజ మార్గం మనకు అందించింది. ఈ ఘనకీర్తి మన గురువుగారికి చెందు తుంది. ఆయన నూతనమైన అంశాన్ని ప్రవేశపెట్టారు. ఇది అభ్యాసికి ఉపయోగంగానూ, సహాయంగానూ ఉండే ప్రాణాహుతి అను పద్ధతి. అతి స్వల్ప కాలంలోనే అభ్యాసికి, ఏ విధమైన కష్టము లేకుండానే అధ్యాత్మిక మార్గములో పురోభివృద్ధి పొందడానికి ఈ ప్రాణాహుతి శక్తి ప్రసారితమువల్ల సులభతర మవుతుంది.

దైవత్వాన్ని అభ్యాసి హృదయంలోకి ప్రసారం చేయడమనేది ఒక ఆశ్చర్యకరమైన విషయం. మునుపటి హిందూ సాంప్రదాయ

సాధనా పద్ధతులలో వివేకము, వైరాగ్యము, ఆసన, ప్రాణాయామం మొదలగునవన్ని చాలా సంవతసరాలు కష్టపడితే గాని పొంద లేకుండినారు. అంటే పైఅంశాలు అనవసరమని కాదు. అవసరములే.

నీవు సహజమార్గ పద్ధతిన ధ్యాన సాధన చేస్తున్నావంటే, నీలో వైరాగ్యం అభివృద్ధి చెందాలి. వైరాగ్యం అబివృద్ధి చెందకుండా ఇంద్రియ సుఖాలలో మునిగివున్నా, అసూయా, తృష్ణ, కోరికలు ఇంకా ఉంటే, నీవు ధ్యానం చేయడంలో ఏదో పొరబాటు ఉన్నట్లే. నీకు సహాయం చేయడానికి ప్రశిక్షకుణ్ణి (ప్రిసెప్టరు) సంప్రదించు. వైరాగ్యమనే స్థితి అత్యవసరం. వైరాగ్యమనేది సాధనక్రింద తీసుకో కూడదు. వైరాగ్యమనేది సాధనా పద్ధతి కాదు, అయితే ఆ స్థితిని పొందడమనేది అవసరం. నీవు ఇంకా సూక్ష్మ స్థితులవైపు పురోగ మించాలంటే ఇది అవసరం. గనుక పురోభివృద్ధినిబట్టి నీ వైరాగ్య స్థితి ఏ స్థాయిలో ఉండేది పరిశీలించుకోవచ్చు. వైరాగ్యమనేది వృద్ధి చెందకపోతే నీవు పురోభివృద్ధి చెందడములేదని బాగా గ్రహించుకో. ఇప్పుడు నీకు తగిన సహాయం కావాలి.

అదేవిధంగా ఇతరత్రా విషయాదులందు -- అనగా --తోటి మానవులయందు ప్రేమ ఉండాలి. నీవు గురువుగారిని ప్రేమించి పదే పదే ఆయన్ను జ్ఞాపకం పెట్టుకొన్నందువల్ల, ఆయనతో నీకు బంధము ఎక్కువవుతుంది. వాస్తవంగా మనకు పురోభివృద్ధి కలిగియుండి ఆయనలో ఏకమయి ఉంటే సర్వ మానవకోటితో ఏక

మయి ఉండాలి. మానవులందరి హృదయాలలో గురువుగారు వ్యాప్తి చెందియున్నారు. కావున మనంకూడా అందరిని ప్రేమించాలి. గురువుగారి తేజసుని మన సోదరులలో చూడలేకపోతే, దాని అర్థమేమంటే నీవు సాధన చేయడంలో ఏదో పొరబాటు లేదా లోపం ఉన్నట్లేనని గమనించు. అసూయ, రాగము, ద్వేషము, పగ, కుచ్చితమైన తలంపులు, వికారాలు మొదలగు ఆటంకాలు ఇంకా మన హృదయాలలోవున్నా, మన పురోభివృద్ధిలో తీవ్రమైన తప్పిదం ఉన్నట్లే. వీటి విషయంగా ప్రిసెప్టరును సంప్రదించి తగు రీతిన సరిదిద్దుకోవాలి. ప్రాణాహుతిని ప్రసారితం చేయు అధికారం, శక్తి గురువుగారు ప్రిసెప్టర్లకు ఇచ్చి వారిద్వారా అభ్యాసుల హృదయాలలోని జడత్వము, ఆటంకాలను తొలగించు పనిని చేయుచున్నారు. కావున పైతెలిపిన అవరోధముల విషయంగా ప్రిసెప్టర్లను సంప్రదించి తగు రీతిన సహాయం పొందుతుండాలి.

ప్రాణాహుతి ప్రసారం వల్ల పూర్తి స్థాయిలో మలవిక్షేపం జరిగి పవిత్రము చేయబడుతుంది. ఆధ్యాత్మికత అంటే ఇదే. సామాన్యంగా అభ్యాసికి తనకు భాదాకరంగా ఉండే ఆటంకాలు అతనికి తెలియవు గనుక, ప్రిసెప్టరు పద్ధతినంతా శుద్ధి చేసి సహాయం చేస్తాడు. అందువల్ల పైన తెలిపిన విధంగా, అభ్యాసిగా తాను అంతర్ముఖంగా పురోభివృద్ధి చెందుతున్నానా లేదా అనేది తెలుసుకోవాలి. అందుకు కొన్ని ముఖ్యమైన అంశాలు సహాయకారులుగా ఉంటాయి. అంటే, నీయొక్క ప్రేమ వ్యాపకం కావాలి. గురువుగారి వైపు నీ పయనము ఎంత ఎక్కువగా దగ్గరవుతూ ఉంటుందో అంత ఎక్కువగా నీవు విశ్వ వ్యాపకం కావాలి.

గురువుగారి వైపు నీ పయనము ఎంత ఎక్కువగా దగ్గరవుతూ ఉంటుందో అంత ఎక్కువగా వైరాగ్యం అభివృద్ధి చెందుతూ ఉండాలి. గురువుగారి వైపు నీ పయనము ఎంత ఎక్కువగా దగ్గరవుతూ ఉంటుందో అంత ఎక్కువగా వివేకము, విచక్షణ వృద్ధి కావాలి. ఏది మంచి ఏది చెడు అనే విచక్షణా జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. ఈ విధమైన పురోభివృద్ధి తప్పక కావాలి. ఈ విధంగా కాకుండా మన పాత అలవాట్లలోకి, పాత ఆలోచనా పద్ధతిలోకి జారిపోయినా, లేదా మన నడవడిక సహజంగానే నిరాడంబరంగా లేకపోయినా, మన దైనందిన జీవనములో ప్రేమ, సూక్ష్మత్వము, తేలికదనము అభివృద్ధి కాకపోయినా మనం సాధన చేయడంలో ఏదో తీవ్రమైన లోపం ఉన్నట్లే.

గనుక, ప్రియమైన సోదర సోదరీమణులారా, ఈ సందర్భంలో ఈఅంశాలను మీముందుఉంచి మాట్లాడడము అవసరమని అనుకొన్నాను. మన అభ్యాసము సరియైన పద్ధతిలో ఎంతమేరకు ముందుకు సాగుతున్నదని మనకు మనమే గమనించుకోడం ఎంతైనా అవసరము.

చివరగా, మనందరము గురువుగారి ఇచ్ఛ, అభీష్టము మేరకు తగువిధంగా మనలో మార్పు జరగడానికి కావలసిన ధైర్య, స్థైర్యాలను మనకు ప్రసాదించ వలసినదిగా గురువు గారిని ప్రార్థిస్తున్నాను.

NNNNK

21-1-1972 న షాజహానుపూర్ లో శ్రీ రాఘవేంద్రరావు గారు చేసిన ప్రసంగం. తెలుగు అనువాదు టి.వి.శ్రీనివాసరావు అడ్వకేటు, కడప from the book of Call of the Fellow Traveller (page 270) written by Pujya Sri Raghavendra Rao, Raichur, Telugu Translation by T.V.Srinivasa Rao, Advocate, Kadapa

# గురువుగారి యోగ పరిశోధనలు

Master's Researches in Yoga

యోగమార్గమును గురించి మన గురువుగారు పరిశోధనలు జరిపారు. వాటి ఫలితాలను 'సహజ మార్గ దృష్ట్యా రాజయోగ ప్రభావము', మరియు 'అనంతము వైపు' మొదలగు పుస్తకములలో మనకు తెలియజేసారు. యోగ్యత, సామర్థ్యము కలిగినవారు వారి పరిశోధనలను వారి అనుమతితోను, వారి పర్యవేక్షణలోను ఉపయోగ పెట్టుకోవచ్చు.

కొంతమంది ఔత్సాహికులు గురువుగారితో నిమిత్తము లేకుండానే వారి పరిశోధనలను అభ్యసించడానికి ప్రయత్నము చేసి వారి కాలాన్ని, యితరుల కాలాన్ని, శక్తిని వృధాచేసారు. అందువల్ల వారు చేసిన పొరబాటు ఏమనగా, గురువుగారితో ప్రత్యక్షంగా సంబంధము పోగొట్టుకొని, ఆయన ఎందుకొరకు ప్రత్యేకమైన పరిశోధనలు చేసారో వాటిని గురించిన అవగాహన లేకుండా పోయింది.

సమర్థవంతుడైన గురువుయొక్క సహాయము వ్యక్తిగతంగా పొందకుండా, కేవలము పుస్తకాలను చదివి యోగాభ్యాసము చేయడము హానికరంగా ఉంటుంది. సామన్యంగా ప్రజలు అసహజమైన స్థితిగతులను పొరబాటుగా ఆధ్యాత్మికమైన స్థితిగతులని, - అనగా ఆధ్యాత్మికమంటే సన్యసించడ మని లేదా, ధ్యాన మంటే ఏకాగ్రతయని మొదలగు గందరగోళమైన అభిప్రాయాలతో పొరబాట్లు చేస్తూ ఉంటారు. ఈ విధమైన గందరగోళం సహజమైన దైవీక మార్గంనుండి అపమార్గాన్ని పట్టిస్తుంది.

గురువుగారి సహాయము అర్థించకుండా ఉంటే ఏవిధంగా పొరపాట్లు జరుగుతాయో కొన్ని ఉదాహరణలు ద్వారా తెలుసుకోవచ్చు. సహజ మార్గము ననుసరించి మనం చేసే ప్రార్థనా విధానము చాలా సులభము, మరియు బహుళ ప్రయోజన కారియైన అభ్యాసము. ఇది ఆలోచనా శక్తిని ప్రకాశింప చేసి దాన్ని ఉపయోగం పెట్టుకోడానికి ఉద్దేశింప బడినది. రాత్రి పడుకొనబోవు సమయమున ప్రార్థనయొక్క అర్థమును సంపూర్ణమైన అవ గాహనతో ఒకటి లేక రెండు మార్లు ఉచ్చారణ చేసి, 'ప్రార్థనాస్థితి' లో నిద్రకు ఉపక్రమించాలి. అయితే చాలామంది అభ్యాసులు ప్రార్థనయొక్క అర్థమునందు ధ్యాస లేకుండా మాటలను మాత్రం యాంత్రికంగా ఉచ్చారణచేసి, లేదా వారికిష్టమగు మతపరమైన ప్రార్థనలతో, వారి కోర్కెలను తీర్చుకోడానికి భగవంతుడిని ఆహ్వానిస్తూ ఉంటారు. అందువలన సంవతసరాలు గడిచి పోయినా నిజమైన 'ప్రార్థనా స్థితికి' ఎంతో దూరంగానే ఉంటున్నారు. హృదయ ప్రాంతమందు ఉండే 'ఏ' మరియు 'బి' అనబడు కేంద్రములపై చేసిన మన గురువు గారి పరిశోధనలు ముఖ్యంగా సహజ మార్గ అభ్యాసులకు, మరియు యావత్ మానవ కోటికి వర ప్రసాదములు. నియమానుసారం మనఃస్పూర్తిగా ఈ స్థానములపై, కొన్ని నిర్దుష్టమైన ఆలోచనలతో కొన్ని నిముష ములపాటు గురువుగారు చెప్పినట్లు కేంద్రీకృతము చేసినప్పుడు, ఆశించిన ఫలితాలను బహు కొద్ది కాలంలోనే తప్పకుండా పొందవచ్చు. ఆ విధంగా నియమాను సారం కొద్ది నిముషములకు బదులు, కొంతమంది సరియైన అవగాహన లేకుండా, కొన్ని గంటల

పాటు ఆ కేంద్రాలపై కేంద్రీకృతం చేసి ధ్యానం చేయమనిన్నీ ఇతరులకుకూడా ఆ విధంగా చేయించమని చెపుతూ ఉండడము వలన, సహజమైన మానవత్వానికి విరుద్ధమైన లక్షణాలు కలగి, దానివలన వారికేగాక ఇతరులకు కూడా అపకారం చేసినవారవుతున్నారు. ఇట్టి విరుద్ధ లక్షణాలవల్ల హాని జరిగిన తర్వాత వారిని తగు విధంగా చక్కదిద్దడానికి గురువుగారి వద్దకు తీసుకొని వచ్చినప్పుడు ఆయన ఎంతగానో విచారిస్తారు.

'అనంతము వైపు' (అనంత్ కి ఓర్) అను పుస్తకము, దివ్య జ్ఞానమునకు సంబంధించిన వివిధ కేంద్రములు, స్థితులు, వాటియొక్క వివరణలన్నికూడా సరియైన ధ్యానసాధన మరియు గురువుగారి యొక్క ప్రాణాహుతి శక్తి సహాయము వలన సత్ఫలితాల నిచ్చేదంతా వాస్తవంలో దివ్య శక్తియే. అయితే, కొన్నిమార్లు అభ్యాసులు తమ శరీరంలోని వివిధ భాగాలలో కలిగే గగుర్పాట్లు (అదురుళ్ళు) లేదా అటువంటి స్పందనలు, ఆధ్యాత్మిక మార్గంలో వివిధ కేంద్రాలు వికశించి పురోభివృద్ధివల్ల అట్టి అనుభూతులు కలుగుతున్నాయని పొరబాటుగా అనుకొంటారు. ఆధ్యాత్మిక రంగములో ప్రవేశించ దలచుకొన్న వ్యక్తికి ఉండవలసిన ప్రారంభ లక్షణములు వినయము, విధేయత. ఆధ్యాత్మికంగా ఎంత ముందుకు పోతూ ఉంటాడో, అంత ఎక్కువగా వినయ విధేయతలు అభివృద్ధి చెందుతాయి. అందువలన అత్యున్నత స్థాయిలను చేరుకొన్నప్పుడు అతనిలో సంపూర్ణంగా శూన్య భావన అభివృద్ధి చెందడంవలన, అనంతమగు దానియందు తాను చాలా అల్పుడని భావిస్తాడు. అయితే ఇందుకు వ్యతిరేకమయినది కూడా వాస్తవమే, అంటే, అతనిలో వినయ విధేయతలు లేకుండా,

గురువని, సాధువని, దివ్య పురుషుడని, దైవాంశ సంభూతుడని తనకు తానుగాగాని, లేక తన అనుయాయులుగాని ఎంతగా చాటుకొన్న ప్పటికి, అట్టివానిలో అణుమాత్రంకూడా ఆధ్యాత్మిక ప్రకాశం లేనివాడేనని అర్థం.

సాంప్రదాయకమైన పద్ధతులలో ఇంతకు ముందు మనసునను, శరీరమును అదుపులో నుంచుటకు అనుసరించ వలసిన నియమాలు చాలా కష్టతరంగానూ, గందరగోళంగానూ ఉండేవి. కఠోరమైన పద్ధతులద్వారా మనోనిగ్రహం, సహజమైన మానశిక లక్షణాలను అణచివేయడము యిత్యాది కష్టతరమైన పద్ధతులకు, గురువుగారి పరిశోధనలద్వారా, అనగా ధ్యానము, మాలిన్యనిర్మూలన, ప్రాణాహుతి శక్తి ప్రసారములనే వాటిద్వారా స్వస్థి చెప్పడం జరిగింది. అంతమాత్రంచేత ఐహిక సుఖాల కొరకు ఇష్టంవచ్చినట్లు యింద్రియాలను విచ్చలవిడిగా వదలివేయ వచ్చుని కాదు. హృదయంలోని కోర్కెలపట్ల వైరాగ్య లక్షణాలు, నియమాలు, గురువు చెంతన అభ్యాసి సుముఖతతో స్వతఃశిద్ధం గానూ, ప్రయాస లేకుండానూ వృద్ధికావాలి. అప్పుడు గురువుగారి ప్రాణాహుతివల్ల సంపూర్ణ ఫలితాన్ని పొంది మానవ జీవిత లక్ష్యాన్ని పొందడానికి అభ్యాసి ఆశించవచ్చు.

మనకందరికి సరియైన అవగాహన కలుగులాగున ఆశీర్వదించి, దైవీక స్పందనలను ప్రసారము చేయగలందులకు గురువుగారు చిరకాలము జీవించియుందురు గాక !

From the Book 'Call of the fellow traveler,Ñ (page 267)Written by **Pujya Sri.Raghavendra Rao. Raichur** తెలుగు అనువాదము టి.వి.శ్రీనివాసరావు అడ్వొకేటు, కడప

# కర్మకాండ - దాని పరిధులు

మొట్టమొదట ఒక విషయాన్ని తెలియ జేయాలి. ఏవిధమైన ఆచార వ్యవహారాలకు, మతాలకు మనం వ్యతిరేకులం కాదు. అయితే మతము యొక్క అంతిమ దశయే ఆధ్యాత్మికతకు ప్రారంభదశయని మన సిద్ధాంతం. మనం కేవలం మూలసారమైన ఉనికిని పొందగల్గు ఆధ్యాత్మిక మార్గం.

అనంతమైన ఏదో ఒక పరా శక్తి ఉన్నదనిన్నీ, దాన్ని పొందాలనే లక్ష్యం మానవునికి ఉండాలనేదే మతము యొక్క ఆశయం. దీనినే భగవంతుడని మతము సూచించినదని ఎప్పుడైతే మానవుడు వాస్తవంగా గ్రహించి, అట్టి అంతిమ లక్ష్యాన్ని పొందడానికి కాంక్షిస్తాడో, మతము యొక్క కర్తవ్యం అయిపోయినట్లే. మానవుడు అంతకంటే ఉన్నతమైన అభివృద్ధికి ఆధ్యాత్మిక మార్గం చేపట్టవలసిందే.

ఎప్పుడయితే మతమే ఆధ్యాత్మిక పద్ధతులను సూచించడము మొదలుపెడితే, తప్పనిసరిగ అది పురాణాలు, ఇతిహాసాలు, ఉత్సవాలు, ఆరాధనలు మొదలగు వాటిని తన ఉనికిని, ప్రాధాన్యతను కాపాడుకోడానికి పలువిధాలైన ఆచార వ్యవహారికములైన కర్మకాండను ప్రవేశపెడుతుంది. ఇది గందర గోళమైన అనేక పద్ధతులతో రూపుదాల్చి చివరకు ఈ ఆచారపద్ధతులే చివరకు మతముగా మార్పుచెందుతుంది.

మతపరమైన కర్మకాండలో కొంత విజ్ఞత, అర్థము,భావము, గుర్తింపుకొరకు లాంఛనప్రాయంగా చిహ్నములు, లేదా సూక్ష్మంగా తెలియజేయడానికి సంకేతాలు ఉంటాయి. అయితే మూలమును గురించిన దృష్టి మరుగున పడిపోయినప్పుడు, తదితర కర్మకాండ అంతాకూడా యాంత్రికంగా జరుగుతూ మూసపోసినట్లు సాంప్ర దాయకంగా పద్ధతులు దిగజారిపోతాయి. ఉన్నతోన్నత మైనదానిని ఆరాధించాలనే ఉద్దేశముతోనే ఈ కర్మకాండ ప్రారంభమవుతుంది. అయితే మూర్ఖత్వంవల్ల అది కేవలం డాంబికమైన ప్రదర్శనగా దిగజారిపోతుంది.

దాదాపు అన్ని కర్మకాండలలో సూచనలు సందేశాలు యొక్క శక్తిని అపారంగా వాడబడుతుంది. వేద సంబంధమైన కర్మకాండల విషయంలో దీన్ని ఇంకా ఎక్కువగా వాడబడుతుంది. కర్మను తగిన అర్హతలు కలిగినట్టి వ్యక్తి సక్ర మంగా నిర్వహించినప్పుడు అట్టి కర్మకు ఏ ఫలితము సూచించ బడిదో అది చేయువాని మనసులో స్థిరపడి ఉద్దేశించిన ఫలితాన్ని సంపూర్ణంగా పొందుతాడు. ప్రకృతి శక్తులపై అధిపత్యం ఉండే వ్యక్తిచే నిర్వహింపబడు కర్మద్వారా శాశ్వతమైన ఫలితాలు కలుగ జేయవచ్చు. అయితే అట్టి వ్యక్తులు చాల అరుదు. అట్టివారికి కర్మకాండతో అవసరం లేదు.

కర్మకాండ ప్రాథమిక అవసరాలను తీర్చుకోడంలో బాగా పని చేస్తుంది. అయితే యివి చాలా బలహీన మనసుల గలవారి

పైన ప్రయోగిస్తూ ఉంటారు. వాస్తవంలో అధ్యాత్మిక సంస్థలని పిలువబడు కొన్నింటిలో ఇట్టివి అతీంద్రియ శక్తులని వారిపై ప్రయోగించి వారిని గుప్పెట్లో ఉంచుకొని, మానశికంగా బందీలను చేసారు. మనసుని సంపూర్ణంగా ఈవిధమైన కర్మలనే మత్తు మందుతో నింపబడింది. అట్టి వ్యక్తులు, అంతరంగికంగా వారికేర్పడిన జడత్వాన్ని తొలగించుకొనే మార్గమే కానరానంత కరుడుగట్టుకొని పోయినాయి. అందువలన ఇట్టి గూఢమైన యాంత్రికమైన కర్మలకు దాసోహమై పోకుండా జాగ్రత్తగా ఉండాలి..

పవిత్రమైన లక్ష్యం పట్ల అంకిత భావంతో చేసే ప్రతి కార్యము వాస్తవంలో ఒక కర్మగా తయారవుతుంది. మానవుడు తన ఆలోచన, మాట, కార్యము భగవంతునికి అంకిత భావముతో చేయాలని మతం చెబుతుంది. ఈ అంకిత భావముతో చేసిన ప్రతి ఆలోచన, మాట, చర్య ఒక కర్మకాండగా తయారు చేస్తుంది. ఇట్టి కర్మ అనేది, యాంత్రికంగా ఒక అలవాటుగా మారిపోయే బదులు, మనిషికి భగవంతునికి మధ్య ఒక అనుబంధంగా ఉండిపోతుంది. అయినాకూడా, ఆలోచననేది మతమనే నాలుగు గోడలనుండి మనిషిని బయటికి నెట్టివేయ గలిగినప్పటికి, ప్రతి మతము దానికి సంబంధించిన కర్మకాండ విషయంగా ప్రస్తావించి, కొన్ని తప్పనిసరిగా చేయాలని, కొన్ని ఇచ్ఛననుసరించి చేయాలని, మరికొన్నిటిని సామూహికంగా చేయాలని తమ సభ్యులను నిర్దేశిస్తుంది.

ఈ విధంగా యాంత్రికమైన కర్మకాండలు అనేకములయి,

పలువిధములైన వ్యక్తులను పలువిధాలుగా ప్రభావితం చేసాయి. ఒకవైపు ప్రతిభావంతు లనబడేవారు కర్మయే మతమని పొరబాటున అనుకొని అన్ని కర్మలను వదిలేసి చివరకు మతమనే దాన్ని కూడా వదిలేసి, మతమనే పదం వింటేనే ఏవగింపుగా చూస్తూ, యితరుల తమను హేతువాదుల మనిపించుకోడానికైనా యిష్టపడే స్థితికి వచ్చారు. మరొకవైపు అచార వ్యవహారాలను పాటించటమే మతమని, నిర్ణీత సమయాలలో నిర్ణీత పద్ధతిలో కర్మకాండ చేస్తూ స్వర్గంప్రాప్తి కోసం అనుమతినిమ్మని భగవంతుడిని కోరుతూ ఉంటారు. కొన్ని మధ్యరకమైన పద్ధతులున్నాయి. వాస్తవంగా చెప్పాలంటే ఈ కర్మకాండ అంతా మానవులయొక్క మతపరమైన, సాంఘిక, సామాజిక,నాగరిక, సాంప్రదాయాలలో భాగమై విడువ రానిదైపోయింది. ఇవి చాలావరకు క్లిష్టతరంగానూ, యాంత్రికం గానూ తయారై ఎక్కువ ఖర్చుతోకూడుకొన్నవిగా తయారైనాయి. సమాజంలోని తెలివైనవారు అవసరమైనవాటిని ఆధ్యాత్మికంగా సులభతర మగునట్లు మార్పు చేయాలి.

కర్మకాండలో కొంత ఆనందం, ఆకర్షణలుంటాయి. ఇది కొంతవరకు సున్నిత మనస్కులకు దివ్యమైన ఆలోచనలను కలుగ చేస్తాయి. అయితే యాంత్రికంగా తయారై, నిర్జీవ మయినప్పుడు అది పనికి మాలినదై భారమైపోతుంది. కర్మ అనేది బాహ్యపరంగా క్రమశిక్షణ కొరకు ఒక సాధనగా ఉండేదే. దాని శక్తిని పై విధంగా మానసికంగా కూడా ఉపయోగ పెట్టుకోవచ్చు. అయితే యిందు విషయంగా ఒక జాగ్రత్త తీసుకోవడం అవసరము. ఈ కర్మకాండకు ఆకర్షితమై, జడ సంబంధమైన కర్మల్లో తగుల్కొని పోకుండా తగిన

ముందు జాగ్రత్త తీసుకోవలసిన అవసరము ఎంతైనా ఉంది. గతంలోని గొప్ప సాంఘిక సంస్కర్తలందరు వారి కాలాల్లో ఆచార వ్యవహారాలకు సంబదించిన కర్మకాండను నిరశించి విమర్శించారు. దీనికి అతీతంగా, ఉన్నతంగా ఎదగాలని తమతోటివారికి బోధించారు. విపరీతంగా యిట్టి బాహ్య కర్మల్లో తగుల్కొని, అసలు యివి ఎందుకు నిర్దేశింపబడినవో అది మినహా మిగిలిన వాటికి ప్రాముఖ్యత యిచ్చినందువలన ఆవిధంగా బోధ చేసారనేదే కారణంగా కనపడుతుంది.

ఒకటి మాత్రం వాస్తవం. కేవలం ఆచార వ్యవహారాల పరమైన కర్మకాండ అనేది మానవుడిని బంధ విముక్తినికాని, భగవంతుడిని పొందడమనేదికాని కలుగజేయలేవు. ఒకవేళ అవి ఒక ఉన్నతమైన ఆశయాలను హృదయంలో కలుగ జేయవచ్చు. ఆధ్యాత్మిక సాధన ఒక్కటే మానవుడిని తన ఉనికియొక్క ఉన్నతమైన సూక్ష్మమైన స్థితిగతులకు తీసుకొని పోయేది. అయినప్పటికి, మానవుడిని కొన్ని సందర్భాలలో సత్యాన్వేషణకు సరియైన మార్గ పద్ధతిని చేపట్ట గలందులకు, అత్యంత సులభ మైన, సూక్ష్మమైన, శక్తివంతమైన, కర్మను అనుసరించేట్లు ప్రేరేపణ కలుగజేయ వలసివస్తుంది.

From the Book 'Call of the fellow traveler,(page 84) Written by **Pujya Sri.Raghavendra Rao.** Raichur తెలుగు అనువాదము టి.వి.శ్రీనివాసరావు అడ్వొకేటు, కడప

*సహజ మార్గ పత్రిక నెం.1, 1967.*

# ధ్యానమనగా ఏమి?

ఒక వస్తువుపైన ఆలోచనను నిలకడగా ఉంచడానికి చేసే కార్యమే ధ్యానము. పలుమార్లు అభ్యాసము చేయడము, ధ్యాన వస్తువుపై భక్తి, శ్రద్ధ, ఉత్సాహము ఎక్కువవుతూ ఉంటే ధ్యానము సహజరీతిన జరిగేట్లు చేస్తాయి. కాల క్రమేణా ధ్యానం కొరకు చేసే కృషి ఏమీ లేనంతగా తగ్గుతుంది. తర్వాత అది సంకల్ప పూర్వకంగా చేసేదిగా ఉండదు. అట్టి స్థితిలో కేవలము దాని ఫలితమైనా ఉంటుంది లేదా నిర్మల జ్ఞానమైనా ఉంటుంది. ఇట్టి జ్ఞానము కూడా పోయినప్పుడు, అనగా ఎప్పుడయితే ధ్యానము వాస్తవికతవైపు, లేక, ధ్యానవస్తువు యొక్క మూలసారమువైపు పురోగమిస్తూ ఉంటుందో ఇక దాని ఫలితము సహజస్థితియే.

ధ్యానమనేది ఏవిధంగా చేయవలెనో ఆవిధంగా చేసినప్పుడు, మరియు , దేనిని ఆశించి ధ్యానం చేపట్టినామో దానికనుగుణంగా ధ్యానవస్తువుకూడా ఉంటేనే పైనచెప్పిన విషయాలు యధార్థములవుతాయి.

ప్రతి చర్యకు ఒక ఫలితం ఉంటుందనేది తెలిసిన విషయమే. అయితేకూడా, ఖచ్చితంగా ఏవిధమైన చర్య ఏవిధమైన ఫలితాన్ని ఇస్తుందనేది ఒక ఆశ్చర్యకరమైన మర్మమే. ఈ విషయంగా, 'అదృష్ట'మనే అంశంకూడా ప్రాబల్యం వహించి ఉంటుంది. అయినప్పటికి, అంతర్ముఖంగా దృష్టి ఎదిగినప్పుడు,

కార్యా కారణములపై కొంత పట్టు సాధించవచ్చు. అంతేగాక, సమస్త చర్యలన్ని కొన్ని సూక్ష్మమైన కారణాలవల్ల జరుగుతున్నాయని గమనించవచ్చు. 'అదృష్ట' మనేదాని ప్రమేయమును తెలుసుకోకుండా, అంతర్ముఖంగా సరియైన దృష్టి ఎదగకుండా, ఏమి ఆశించి ఏమి చేస్తున్నామనేదికూడా గమనించకుండా, ఆశించిన ఫలితం పట్ల అనుచితమైన బంధము ఏర్పరచుకొన్నప్పుడు, నిరాశ, నిస్పృహ, వ్యాధులు, బాధలు కలుగుతాయి. మతిభ్రమించినవారు, వెర్రివాళ్ళు, ఛంచల స్వభావం కలవారు ఈ శ్రేణికి చెందుతారు.

ధ్యానమంటే అది ఒక క్రియ అని సూచించ బడింది. సహజంగానే దానివల్ల కొన్నిఫలితాలు ఉంటాయి.ఇందు విషయంగా కూడా అనేక అంశాలు పని చేస్తూ ఉంటాయి. భగవంతుడిని చూడాలని, మాట్లాడాలని ఆశించి అందు కోసం కొన్ని చౌకబారు పుస్తకాలను చదవడం, అనుభవ శూన్యులైనవారి నుండి సలహాలు పాటిస్తూ, ఒకదేవుని చిత్రాన్ని ధ్యేయవస్తువుగా తీసుకొని దానిపై మనసు పెట్టడమువల్ల, అవి కొన్ని ఫలితాలను కలుగజేస్తాయి. అదే విధంగా భగవంతునినుండి శబ్దతరంగాలకొరకు, జప అజప స్థితుల కొరకు చేసే ప్రయత్నాలుకూడా. యాంత్రికంగా, 'ఓం శ్రీ అనంత సుబ్రహ్మణ్యాయ నమః', లేదా ' శ్వాసతో జతచేర్చి 'సోహం', లేదా లయబద్ధంగా కూర్చిన ' లా ఇలాహ - ఇల్లల్లాహ', లేదా, రెండు ఇరవైలు ఇరవైఐదు మొదలయిన పదాలను జోడించి, నడిచేటప్పుడు వేసే అడుగులకు అనుగుణంగా ఉచ్చరించడంవల్ల కూడా కొన్ని ఫలితాలు వస్తాయి.

ధ్యానం ప్రారంభించడానికి వాస్తవమైన తపన గాని లేదా కారణంగాని తెలియనందువలననూ, ధ్యానాన్ని గురించిన సరియైన అంతర్ దృష్టి, పరిజ్ఞానం లేనందువలననూ, 'అదృష్ట' మనే అంశం యొక్క ప్రమేయమున్నందుననూ, ధ్యానం చేయువానికి వాడు ఊహించని లేదా ఆశించని ఫలితాలు ప్రాప్తిస్తూ ఉంటాయి. అయినప్పటికి ఈ విధంగా ఇంకా చేస్తూపోతే, మతిభ్రమణము, చిత్త చాంచల్యము, లేదా, వెర్రితనము మొదలగున దుష్ట ఫలితాలు ఏర్పడతాయి.

కొన్ని అపాయకరమైన ఫలితాలు కల్గడము చాలవరకు గమనించిన కొంతమంది బోధకులు (శిక్షకులు) యోగ మార్గపద్ధతి కేవలం ఊహాజనితమని విమర్శించారు. అందుచేత వారు ధ్యానమంటే భక్తి, భావావేశం ఉండాలని చెప్పడం జరిగింది. అయితే, యిందులోకూడా తెలివిలేని తనంతో ఆచరిస్తే హానికలిగే అవకాశం లేకపోలేదు. కొంతమంది గమ్యాన్ని గురించిన స్పృహ కోల్పోయారు. కొంతమంది తాము రక్షకులమని, మోక్ష ప్రదాత లమని తలతిక్కగా తయారయ్యారు. మరికొంతమంది పైన చెప్పినట్లు మతి భ్రమణమువల్ల, చిత్త చాంచల్యం వల్ల అనేక విధములైన దృశ్యాలు కనబడు తున్నాయని, అనేక శబ్దాలు వింటున్నామని అంటారు.

ధ్యాన వస్తువుతో తాము తాదాత్మ్యం చెందడమనే తలంపు కొంతమందిని మరొక విధంగా తయారుచేసింది. ఉదాహరణకు,

కొంతమంది సాధువులు, స్వాములు భగవంతుని స్థానాన్నే అప హరించి, వారే దేవుళ్లమని వెల్లడించుకున్నారు. మరికొంతమంది మానవోద్ధరణకు అవతరించామని చాటుకొన్నారు. ఇంకా కొందరు ప్రపంచానికి వెలుగును పంచి యిస్తున్నామని అన్నారు. ఈ విధమైన దేవుళ్లకు, స్వాములకు, సన్యాసులకు పెద్ద సంఖ్యలో శిష్యులుకూడా ఉన్నారు.

తర్వాత, జ్ఞానులమని పిలువబడే బోధకులకుకూడా కొరత ఏమి లేదు. కాషాయరంగు వస్త్రాలు ధరించిన అందరు దాదాపు జ్ఞానులే కాకుండా పూర్ణ బ్రహ్మజ్ఞానులే! వారు అనేక ధ్యాన పద్ధతులను నిర్దేశిస్తారు. గుర్రపు పందాలనుండి క్షీరసాగరంలో శేషతల్పంపై పవ్వళించిన శ్రీమన్నారాయణుని వరకు వాళ్ళ జ్ఞానం విస్తరించి ఉంటుంది. అనేక వ్యాధుల్ని గురించి, ఆ వ్యాధులకు అధిష్టాన దేవతలను ఆహ్వానించి నయంచేయడంకూడా తెలుసు. శ్రీమహాలక్ష్మి అమ్మవారిని ఆహ్వానించి లాటరిలలోనూ, పందాల లోనూ గెలవడానికి ఆమె అనుగ్రహాన్ని పొందేట్లు చేస్తారు. వీరందరూకూడా ధ్యాన మార్గాన్ని నిర్దేశించేవారే.!

గ్రంథాలు, శాస్త్రాలు చదివి అట్టిపుస్తక జ్ఞానంతో దేవుళ్ళను స్వాధీనం చేసుకొన్నామని చాటుకొనే నాజూకైన కొంతమంది స్వామీజీలు కూడా ఉన్నారు. అగ్నినుండి అగ్నికణములవలె భగవంతునినుండి ఆత్మలు ఏవిధంగా బహిర్గతమయినవి, ఈ ప్రపంచాన్ని భగవంతుడు ఏవిధంగా సృష్టించాడు, స్థూల దేహ

మనబడు ఈ గూడునుండి ఆత్మ బయిటికి పోయిన తర్వాత ఏమవుతుంది, బంధ విముక్తి అంటే ఏమి, మొదలగు అంశముల మీద అనర్గళంగా వేదికలనుండి వీరు గంటల తరబడి మాట్లాడుతూ ఉంటారు. వీరుకూడా ధ్యాన మార్గాలను నిర్దేశిస్తూ ఈ ప్రపంచం అంతా కేవలము భ్రమయని గమనించ మంటారు. మనం చనిపోయేప్పుడు భార్య, పిల్లలు తల్లి, తండ్రి ఎవరేగాని వెంటరారు గనుక ప్రేమించడంవలన ఫలితంలేదని, చెవులు మూసుకొన్నప్పుడు వినపడే ఆశ్చర్యకర మైన ' ఓం ' అనే నాదాన్ని గమనించమని అంటారు. వీరికి తగ్గ శిష్యులు చిక్కితే, యిక వార్లు బ్రహ్మలని వారికివారే గురువులని శిష్యులకు తెలియజేస్తూ ఉంటారు.

సరే, పైన చెప్పబడిన పెద్ద, చిన్న విషయాలు ఎట్లున్నా, క్లుప్తంగా చెప్పాలంటే, ఉన్నతోన్నతమైన దానినే పొందాలని లక్ష్యంగా పెట్టుకొన్న తర్వాతనే ధ్యానం చేపట్టాలి. తర్వాత, ఈ మార్గమందు మంచి అనుభవజ్ఞుడిని, లక్ష్యాన్ని సాధించినవాడిని మాత్రమే మనం మార్గదర్శకుడిగా తీసుకోవాలి. అటు తర్వాత ఆయన చెప్పినట్లు సాధన ప్రారంభం చేయాలి. ధ్యేయ వస్తువు యొక్క సూక్ష్మ స్థితితో ఆలోచనద్వారా అనుసంధాన మేర్పరచుకొని దాని నిజతత్వమును పొందడమనేదే ధ్యానం యొక్క ముఖ్య ఉద్దేశము. అందువలన ధ్యానముయొక్క ఫలితము ఏదైతే ఉన్నదో, అట్టి ఫలితము మీద ధ్యానం చేయకూడదు. ఈ విషయంగా తాతాసరం చేయడంవలన అన్నివిధములైన గందరగోళాలు, చిక్కు సమస్యలు కలుగుతాయి.

అదృష్టవశాత్తు ఉన్నతోన్నతమైన దానిని సాధించిన గురువు లభిస్తే అట్టిదానిని పొందడానికి గురువుయొక్క రూపంమీదనే ధ్యానం చేయాలి.

ఉన్నతోన్నతమైన స్థితిగతులను అధిగమించిన గురువు రూపం మీద ధ్యానం చేయడమువలన, అంతిమ లక్ష్యమును అతి త్వరితగతిన పొందగలరు. అంతేగాక, ఇది చాలా సులభమైన పద్ధతి. దోష రహితమైన ఈ పద్ధతి అవగాహనకు రావాలంటే దీన్ని పరీక్ష చేయవచ్చు. పొందే ఫలితము చివరకు ఒకటే అయినా, అందరికి ఆమోగ్యదాయకంగా ఉంటుందని సర్వసాధారణంగా ధ్యానము దివ్యతేజసునపై చేయమని చెప్తారు. దీని వెనుకనుండే సత్యమును వర్ణింపలేము.

పరిధుల కతీతంగా పురోగమించడమనేది సాధు లక్షణమయితే, ఈ పరిధులకు లోబడి ఉండడము సాధారణ మానవ లక్షణం. అయితే ఈ పరిధులకు అతీతమైన స్థితికి మనల్ని తీసుకొని పోతుందా లేక ఈ పరిధులకు లోబడినట్టి స్థితిలోనే ఉంచుతుందా అని పరీక్షించడానికి ఏమైన మార్గపద్ధతులున్నాయా! అంటే సరియైన ధ్యానంవల్ల ముందు చెప్పబడిన స్థితిఏర్పడి, సరియైన గురువు లభిస్తే అన్ని సమర్థవంతంగా జరిగి పోతూ ఉంటాయి.

ఉన్నతోన్నత స్థితిగతులను పొందడానికి సహాయకుడు

లేనిదే సాధ్యపడదు. ఎందుచేతనంటే, ఉండవలసిన రీతిగా ఉండడానికి ఇప్పుడున్న వ్యక్తి ద్వారా దైవీకశక్తి పనిచేస్తూ ఉంది. ప్రతి అంశముపైనా పరీక్షించకుండానే అభ్యంతరాలు లేవదీస్తే ఏవిధంగా సమన్వయ పరచడము? ఇట్టిది సామాన్యంగా భగవంతునితో నేరుగా సంబంధం పెట్టుకోవాలనే వానికి అన్వయిస్తుంది. ఆలోచన లక్ష్యమువైపుకు కాకుండా అందుకు భిన్నంగా ఉండేదిశగానూ, వేదికలనుండి ఈ విధమైన విషయాలే తరచు వింటూ మనసునను ఉన్నది ఉన్నట్లుగా కాకుండా అపసవ్యంగా మళ్ళించడంవల్ల అవగాహన చేసుకోలేకపోతన్నారు.

From the Book 'Call of the fellow traveler,(page 98) Written by **Pujya Sri.Raghavendra Rao.** Raichur తెలుగు అనువాదము టి.వి.శ్రీనివాసరావు అడ్వొకేటు, కడప